ఈనాడు


విజయవాడ 30-8-2017 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 20

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



"My vision for India's energy future has 4 pillars:
Energy Access, Energy Efficiency,
Energy Sustainability, Energy Security."

- Narendra Modi

SANKALP SE SIDDHI

NEW INDIA MOVEMENT (2017-2022)

ONGC, ON ITS 62ND FOUNDATION DAY PLEDGES FOR A NEW INDIA

Since 1956, ONGC has been relentlessly striving in spirit and soul to accomplish the pledge for building an energy-sufficient India.
Today, as we celebrate our 62nd Foundation Day, let's rededicate ourselves towards the PM's vision of a 'New India'.
An India with energy access to all, energy efficiency, energy sustainability and energy security. An India we will all be proud of.



On this momentous day, we salute all the ONGCians
who are standing shoulder to shoulder to make this dream of New India, a reality.

Karenge aur Kar ke Rahenge

A PROUD MAHARATNA

• World's No.1 E&P company as per Platts Global Energy Rankings 2016 • India's largest producer of crude oil & natural gas • Contributes 72% of O + OEG production in the country • First to discover Shale Gas in India • ONGC Videsh, our 100% subsidiary is present in 38 oil and gas projects in 17 countries • First Indian company to produce equity oil and natural gas abroad • Played a lead role in the National Gas Hydrates Programme (NGHP) • Promoting sports, supporting over 170 active national and international sportspersons in various games • Contributed over ₹ 2200 crore in CSR activities in last 8 years.

Oil and Natural Gas Corporation Limited

COURAGE TO EXPLORE | KNOWLEDGE TO EXCEED | TECHNOLOGY TO EXCEL

ONGC GROUP OF COMPANIES

Subsidiaries

Petronet MHB Limited

Joint Ventures

Pawan Hans Limited

Associates

www.ongcindia.com ONGCLimited @ONGC_ /company/ONGC https://startup.ongc.co.in

CIN No.: L74899DL1993GO1054155, **Regd. Office**: Pandit Deendayal Upadhyay Urja Bhawan 5, Nelson Mandela Marg, Vasant Vihar, New Delhi - 110070 **Email**: secretariat@ongc.co.in

ఈనాడు

విజయవాడ 30-8-2017 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 20
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 16+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



నడులను తలపిస్తున్న ముంబయి వీధుల్లో నడిచి వెళ్తున్న ప్రజలు

ముంభయం భయం

- భారీ వర్షాలు, గాలులతో గజగజ వణికిన దేశ ఆర్థిక రాజధాని
- స్తంభించిన విమాన, రైలు, రోడ్డు రవాణా వ్యవస్థలు
- 3 గంటల్లో 15 సెం.మీ. వర్షపాతం • మరో 2 రోజులు ముప్పే

ఎడతెరిపిలేని కుండపోత వర్షం...బలమైన గాలులు...నీటితో నిండిపోయిన రహదారులు...ఎక్కడికక్కడే నిలిచిపోయిన వాహనాలు... అడుగుతీసి అడుగువేయలేని దుస్థితి.. ఎటు వెళ్లాలన్నా నడుం లోతులో వరదనీరు.. దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరవాసులు మంగళవారం అనుభవించిన నరకయాతన ఇది. పారిశ్రామికవేత్తల నుంచి సామాన్యుల వరకు...పాదచారుల నుంచి విమాన ప్రయాణికుల వరకు ఎవరినీ ఈ కష్టాలు వదల్లేదు. బస్సులు, రైళ్లే కాదు విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలిగింది. అల్పపీడనం వాయుగుండంగా మారటంలో మరో 2 రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించింది.


- పూర్తి వివరాలు 12 లో



ఓటేసిన వృద్ధురాలి ఆనందం

64.78% పోలింగ్

ఏడేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం మంగళవారం కాకినాడ నగర పాలికకు నిర్వహించిన ఎన్నికలు స్వల్ప ఉద్రిక్తతలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. 48 డివిజన్లలో 64.78% పోలింగ్ నమోదైంది. ఉదయం వర్షం పడడంతో మధ్యాహ్నం వరకు ఓటర్ల రాక మందకొడిగానే సాగింది. సాయంత్రం ఐదింటికల్లా 196 పోలింగ్ కేంద్రాల పరిధిలో 64.78% మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 2005లో ఇదే నగరపాలక సంస్థకు జరిగిన ఎన్నికల్లో 58.03% పోలింగ్ నమోదైంది. 2లో



రాష్ట్ర వ్యాప్తంగా నంద్యాల నమూనా

- పక్కా ప్రణాళిక ఉంటే పులివెందులలోనూ గెలుస్తాం
- 1న మంత్రులు, ఎమ్మెల్యేలు మళ్లీ నంద్యాలకు వెళ్లాలి
- హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

2లో

పరిశ్రమ ఫలం!

- తెలుగు రాష్ట్రాల్లో మంచి పారిశ్రామిక వాతావరణం
- నీతిఆయోగ్-ఐడీఎఫ్‌సీ సర్వేలో వెల్లడి
- టాప్-5లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ


ఈనాడు - దిల్లీ

తెలుగు రాష్ట్రాల్లో పారిశ్రామిక వాతావరణం అత్యంత మెరుగ్గా ఉంది. దేశంలో వివిధ సంస్థలు నిర్వహిస్తున్న పారిశ్రామిక సర్వేల్లో ఈ విషయం వెల్లడైంది. తాజాగా నీతిఆయోగ్, ఐడీఎఫ్‌సీలు సంయుక్తంగా నిర్వహించిన పారిశ్రామిక సర్వేలో చాలా అంశాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు దేశంలోని టాప్-5 స్టేట్ జాబితాలో నిలవడం విశేషం. ఇదివరకు ప్రపంచ బ్యాంకు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకుల్లో తెలుగురాష్ట్రాలు తొలి స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. వ్యవస్థీకృత ఉత్పాదక సంస్థల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఆ ర్యాంకులు ఇచ్చారు. అయితే ఇప్పుడు అందుకు భిన్నంగా సర్వే నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంస్కరణలు వాస్తవంగా పనిచేస్తున్నాయా? వాటివల్ల పారిశ్రామికవేత్తలు నిజంగా లబ్ధి పొందుతున్నారా? అన్న అంశాలపై నీతిఆయోగ్, ఐడీఎఫ్‌సీలు న్యాయవాదులు, ఛార్టెర్డ్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీల్లాంటి నిపుణులతోపాటు తయారీదారులు, స్టార్టప్స్ నుంచి అభిప్రాయాలు సేకరించాయి. పరిశ్రమల అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటుచేసిన సింగిల్‌విండో విధానం గురించి ఎంతమందికి అవగాహన ఉంది? కార్మికుల లభ్యత ఎలా ఉంది? భూములు, అనుమతుల కేటాయింపుల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న అంశంపై వివరాలు సేకరించారు.

రాష్ట్రం

పరిశ్రమల అనుమతుల కోసం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం మిగతా రాష్ట్రాలకంటే ఆంధ్రప్రదేశ్‌లో బాగా నడుస్తోంది. అక్కడి 41% మంది పారిశ్రామికవేత్తలు ఈ విధానాన్ని ఉపయోగించుకుంటున్నట్లు నీతి ఆయోగ్ నిర్వహించిన తాజా సర్వేలో చెప్పారు.

పర్యావరణ అనుమతుల విషయంలో పారిశ్రామికవేత్తలకు బాగా అవగాహన ఉన్న రాష్ట్రాల్లో ఏపీ మూడోస్థానంలో నిలిచింది. కేరళలో- 89%, సిక్కింలో- 86%, ఏపీలో 85% మందికి దీని గురించి తెలుసు.



భళా

దేశంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు చాలా రాష్ట్రాల్లో 20 నుంచి 120 రోజుల సమయం పడుతోంది. కొన్ని రాష్ట్రాల్లో 240 రోజులూ తీసుకుంటోంది. ఈ విషయంలో రాష్ట్రం రెండోస్థానంలో నిలిచింది. తమిళనాడులో సగటున 63 రోజులు, ఏపీలో 67 రోజులు పడుతోంది.

కార్మికుల అవసరం అధికంగా ఉన్న పరిశ్రమలు తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, ఏపీ పైనే దృష్టి సారించాయి.

అత్యధిక పెట్టుబడులతో కూడిన స్టార్టప్‌లు మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, ఏపీల్లో వస్తున్నాయి. ఇక్కడున్న సులభ వాణిజ్య విధానం దోహదం చేస్తోంది. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ అధికార వ్యవస్థ బాగా పనిచేస్తోంది.

సర్వే ఇలా సాగింది..

- దేశవ్యాప్తంగా 3,726 ఉత్పాదక (మిగతా 2లో)



జీఎస్టీ అపూర్వ సంస్కరణ 14లో

జీఎస్టీ ఒక అపూర్వ సంస్కరణ అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు. దేశంలో రాత్రికిరాత్రే పన్ను విధానాలను మార్చేసిందని పేర్కొన్నారు.

కొరియా కొరివి

- జపాన్ మీదుగా ఉ.కొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం
- తీవ్రంగా ఖండించిన జపాన్, అమెరికా, దక్షిణ కొరియా
- ఐరాస భద్రతా మండలి అత్యవసర భేటీకి పిలుపు

సియోల్, జెనీవా, వాషింగ్టన్



ప్యాంగ్‌యాంగ్ నుంచి ఉత్తరకొరియా ప్రయోగించిన క్షిపణి.. జపాన్ మీదుగా ప్రయాణించి సముద్రంలో పడిన చిత్రం

ఉత్తర కొరియా మరోసారి రెచ్చిపోయింది. ఆంక్షలను బేఖాతరుచేస్తూ జపాన్ మీదుగా మంగళవారం బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. దీంతో పరిస్థితులు మరింత ఉద్రిక్తమయ్యాయి. ఉత్తర కొరియా చర్యలను జపాన్ తీవ్రంగా ఖండించింది. టోక్యోలో ఐరాస భద్రతా మండలి అత్యవసర సమావేశానికి అమెరికా, దక్షిణ కొరియాలతో కలిసి పిలుపునిచ్చింది. 'ఇది చాలా తీవ్రమైన, సహించలేని విపరీత చర్య'అని జపాన్ ప్రధాని షింజో అబే వ్యాఖ్యానించారు. ఉత్తర జపాన్‌లో క్షిపణి ప్రయాణించిన మార్గంలో ప్రమాద ఘంటికలు మోగాయి. పరిసరాల్లోని భవనాల్లోకి వెళ్లిపోవాలని ప్రజలకు వెంటవెంటనే హెచ్చరికలు జారీఅయ్యాయి. ప్రయాణికులందరూ స్టేషన్లలోనే ఉండిపోవాలని సూచించడంతో రైలు సేవలకు అంతరాయం కలిగింది. అన్ని (మిగతా 2లో)


'డొల్ల' పాఠశాలలను
ప్రైవేటుకు ఇవ్వాలి

- పీపీపీ విధానంలో నడపాలి
- నీతి ఆయోగ్ సూచన 14లో

నిమిషం ఆలస్యంగా
నింగిలోకి

- పీఎస్ఎల్‌వీ ప్రయోగంలో మార్పు
- అంతరిక్ష వ్యర్థాలు అడ్డువస్తాయని... 3లో

ఇదీ సంగతి!



చెక్కు చెదిరిపోతోంది

- ఏడాదిలోపే మారిపోతున్న సంతకాల శైలి
- కుప్పలు తెప్పలుగా అక్షర దోషాలు
- రోజూ చెల్లని చెక్కులు 5%
- దక్షిణాదిలో 4 నెలల్లో 58 లక్షల తిరస్కారం
- వాటి విలువ రూ.48,504 కోట్లు

ఈనాడు, అమరావతి: సంతకాలు సరిపోలకపోవడం, చెక్కుపై రాతల్లో కొట్టివేతలు, అక్షర దోషాలు తదితర కారణాలతో చెక్కులు చెల్లుబాటు కాకుండా పోతున్నాయి. దీనికి చెక్కులు రాయడంలో ఖాతాదారులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, వారి రాత నైపుణ్యాల్లో క్షీణత కనిపించడం కారణంగా కనిపిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జులై వరకు దక్షిణాది రాష్ట్రాల్లో బ్యాంకులకు వచ్చిన చెక్కుల్లో వివిధ కారణాల వల్ల చెల్లకుండా తిరుగుటపా కట్టిన చెక్కుల సంఖ్య 58.71లక్షలు కావడం గమనార్హం. వీటి విలువ రూ.48,504 కోట్లు.



తిరస్కరణకు గురైన చెక్కు

సీఎస్టీతో 48 గంటల్లో తేల్చేస్తారు

వేగంగా చెల్లింపులు చేయడానికి వీలుగా భారతీయ రిజర్వు బ్యాంకు చెక్కుల విధానంలో 'చెక్కు ట్రంకేషన్ సిస్టమ్' (సీఎస్టీ)ని 2013 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. దాని ప్రకారం బ్యాంకులు కూడా (మిగతా 2లో)

కొరియా కొరివి

(మొదటి పేజీ తరువాయి)


రైలు మార్గాలపైనా ప్రభావం పడిందని సప్పొరోస్ మెట్రో వ్యవస్థ తెలిపింది. 2009లో సైతం జపాన్ మీదుగా ఓ ఉత్తర కొరియా రాకెట్ దూసుకెళ్లింది. అయితే అది ఉపగ్రహ ప్రయోగమని ఉత్తర కొరియా తెలిపింది. తాజాగా ప్రయోగించింది మాత్రం ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి (ఐసీబీఎం)అని అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ గట్టిగా నమ్ముతున్నాయి. గత నెలలో సైతం ఉత్తర కొరియా రెండు ఐసీబీఎం పరీక్షలు చేపట్టింది. అమెరికాలో చాలా ప్రాంతాలపై దాడిచేయగల సామర్థ్యమున్న క్షిపణి తమదగ్గరుందనే సంకేతమిచ్చింది. దీంతో పూర్తిగా దేశాన్నే లేకుండా చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అనంతరం అమెరికాకు చెందిన గువామ్ దీవులపై క్షిపణిని ప్రయోగిస్తామని ఉత్తర కొరియా హెచ్చరికలు జారీ చేసింది.

తప్పేమీలేదు: ఉత్తర కొరియా..: తన చర్యలను ఉత్తర కొరియా సమర్థించుకుంది. జెనీవాలో ఐరాస నిరాయుధీకరణ సదస్సులో ఉత్తర కొరియా రాయబారి హెన్ తే-సంగ్ మాట్లాడారు. 'వరుస హెచ్చరికలు చేసినా పట్టించుకోకుండా దక్షిణ కొరియాతో సంయుక్త యుద్ధ విన్యాసాలకు సిద్ధపడి.. మా దేశంపై వైరాన్ని అమెరికా బహిరంగంగా ప్రదర్శించింది. ఆత్మరక్షణ కోసం కఠినమైన చర్యలతో స్పందించే హక్కు మా దేశానికి ఉంది'అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే నేరుగా క్షిపణి ప్రయోగాన్ని ప్రస్తావించలేదు. పరిస్థితులు ఉద్రిక్తం కావడానికి అమెరికానే బాధ్యతని చెప్పారు. అనంతరం ఉత్తర కొరియాపై అమెరికా, ఐరోపా సమాఖ్య, జపాన్, ఆస్ట్రేలియా తీవ్రస్థాయిలో విమర్శలు సంధించాయి.

ప్యాంగ్యాంగ్ నుంచే ప్రయోగం.. తాజా క్షిపణి 550 కి.మీ. గరిష్ఠ ఎత్తులో 2,700 కి.మీ. దూరం ప్రయాణించిందని దక్షిణ కొరియా తెలిపింది. జపాన్‌కు చెందిన హొక్కాయిడో దీవులపై నుంచి దూసుకెళ్లి ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో పడిందని వెల్లడించింది. ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లోని సునాన్ నుంచి దీన్ని ప్రయోగించినట్లు పేర్కొంది. ఉత్తర కొరియా నుంచి గువామ్ ఆగ్నేయ దిశగా 3500 కి.మీ. దూరంలో ఉంది. పైగా తాజా క్షిపణిని తూర్పు దిశగా జపాన్‌వైపు ప్రయోగించారు.

నిగ్రహంతో ఉండండి: చైనా.. మరోవైపు అందరూ ప్రశాంతంగా నిగ్రహంతో ఉండాలని ఉత్తర కొరియా ప్రధాన మిత్రపక్షం, అతిపెద్ద వాణిజ్య భాగస్వామి చైనా వ్యాఖ్యానించింది. రష్యా కూడా స్పందించింది. 'పరిస్థితులు ఉద్రిక్తంగా మారే పరిణామాలు కనిపిస్తున్నాయి. వీటిపై మేం చాలా ఆందోళన పడుతున్నాం'అని రష్యా విదేశాంగ శాఖ సహాయ మంత్రి సెర్జీ రిబకోవ్ వ్యాఖ్యానించారు.

ఇంకా ఒంటరి అయిపోతారు: ట్రంప్.. ఉత్తర కొరియా చర్యలను ట్రంప్ తీవ్రంగా ఖండించారు. 'బెదిరింపులు, ప్రాంత సుస్థిరతకు భంగం కలిగించే చర్యలు ఉత్తర కొరియాను మరింత ఒంటరిని చేస్తాయి. ఇరుగుపొరుగు దేశాలతోపాటు ఐరాస సభ్య దేశాలనూ ధిక్కరిస్తున్నట్లు దీంతో సంకేతమిచ్చింది'అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాతో అమెరికా, జపాన్, దక్షిణ కొరియా సహా ప్రపంచానికే ముప్పు పొంచివున్నట్లు ట్రంప్, అబే అంగీకరించినట్లు శ్వేతసౌధం ఓ ప్రకటన విడుదలచేసింది.



బిడ్డలకు పాలిచ్చేందుకు బస్టాండ్లలో ప్రత్యేక గదులు

ఈనాడు అమరావతి: ప్రయాణ సమయంలో చంటి బిడ్డలకు పాలిచ్చేందుకు తల్లులకు చాటు ప్రదేశాలు ఏర్పాటు చేయడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అన్ని బస్టాండ్లు, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో ఇందుకోసం ప్రత్యేకంగా గదులు సిద్ధం చేయాలని కేంద్ర స్త్రీ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు అందాయి. తొలుత విజయవాడ, విశాఖ, తిరుపతి లాంటి ప్రధాన నగరాల్లోని బస్టాండ్లలో ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. తదుపరి దశలో అన్ని పట్టణాల్లో ఈ గదులను నెలకొల్పుతారు. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లలో తల్లి పాలిచ్చేందుకు గదులు ప్రారంభించబోతున్నారు.

గుర్తింపు ఉన్న వారితోనే వైద్య సేవలు.. నిర్దేశిత అర్హతల్లేకుండా.. ప్రభుత్వపరంగా గుర్తింపు లేని వారు అందించే వైద్య సేవలవల్ల పౌరులు నష్టపోకుండా చూడాలని కేంద్రం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఆయా రాష్ట్రాల్లోని వైద్య మండళ్ల ద్వారా గుర్తింపు పొందిన వారు మాత్రమే వైద్య సేవలు అందించేందుకు అర్హులని వెల్లడించింది. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా ముఖ్యమంత్రులకు రాసిన లేఖల్లో అర్హతలు లేని వారు వైద్య సేవలు అందిస్తే అటువంటి వారికి అపరాధ రుసుముతోపాటు జైలు శిక్ష కూడా విధించవచ్చునని పేర్కొన్నారు.

నేడు చివరి కౌన్సెలింగ్

ఈనాడు, అమరావతి: ఎంబీబీఎస్, దంత వైద్య విద్యలో ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం చివరి కౌన్సెలింగ్ బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరగనుంది. నాలుగో విడత కౌన్సెలింగ్ ద్వారా సీట్లుపొందిన వారిలో 24 మంది ఎంబీబీఎస్‌లో చేరలేదు. దంత వైద్య విద్యలో ఇలాంటి వారి సంఖ్య 211 వరకు ఉంది. ఈ సీట్లకు తుదివిడత కౌన్సెలింగ్ బుధవారం జరగనుంది. ఈ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు పొందినవారు కళాశాలల్లో చేరకుండా ఉంటే రెండేళ్లపాటు ప్రవేశాల్లో పాల్గొనేందుకు అవకాశం ఉండదని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ అప్పలనాయుడు తెలిపారు.

ప్రశాంతంగా 'కాకినాడ' పోలింగ్

ఈనాడు - కాకినాడ

కాకినాడ నగర పాలిక ఎన్నికలు స్వల్ప ఉద్రిక్తతలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. 64.78% పోలింగ్ నమోదైంది. ఎన్నికల్లో విజయం సాధించేందుకు తెదేపా, వైకాపా పోటీపడ్డాయి. మంగళవారం పోలింగ్ రోజున ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో గుర్తులను చూపిస్తూ ఓటర్లకు చెప్పడంపై తెదేపా, వైకాపా శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ప్రత్యేకించి 14వ డివిజన్‌లోని ఏటిమొగ ప్రాంతం అతి సమస్యాత్మకంగా మారింది. పోలింగ్ కేంద్రంలో ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలతో ప్రారంభమైన వివాదం ఘర్షణ వాతావరణానికి దారితీసింది. పోలింగ్ ముగిసే వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. పోలీసు అధికారులు భారీగా బలగాలను మోహరించడంతో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.

తొలిగంటలోనే మొదలైన వాన..

పోలింగ్ మొదలైన తొలి గంటలోనే వర్షం రావడంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పెద్దగా రాలేక పోయారు. దీని ప్రభావం పోలింగ్‌పై పడిందన్న అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమవుతోంది. మత్స్యకార కుటుంబాలు అధికంగా ఉన్న జగన్నాథపురం పరిధిలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు దీరారు. అక్కడి అన్ని డివిజన్లలో 80 నుంచి 70 శాతానికి పైగా పోలింగ్ నమోదవడం గమనార్హం. జగన్నాథపురం వంతెనకు ఇవతల ఉన్న నగర పరిధిలో పోలింగ్ ముగిసే వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల తాకిడి తక్కువగా ఉంది. కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు 17వ డివిజన్‌లో, ఎమ్మెల్సీ వర్మ 50వ డివిజన్‌లో, వైకాపా జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు 2వ డివిజన్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అభివృద్ధి చెందిన కాలనీలను పోల్చితే మురికివాడల్లోనే ఓటింగ్ శాతం అధికంగా నమోదైంది. మధ్యాహ్నం వరకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రాకపోవడంతో వారిని సమీప కేంద్రాలకు తరలించేందుకు పార్టీల తరపున ఆటోలు ఏర్పాటుచేశారు.

మాజీ మేయర్ ఓటూ గల్లంతు!

ఓటర్ల జాబితాలో పలువురి పేర్లు గల్లంతవడం, ఓటరు గుర్తింపు కార్డున్నా జాబితాలో పేరు లేదని తిరస్కరించడంతో కొన్నిచోట్ల గందరగోళ పరిస్థితి నెలకొంది. మాజీ మేయర్ పి.సరోజ ఓటు గల్లంతు కావడంపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ కార్తికేయ మిశ్రా పలు డివిజన్లలో పర్యటించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. తల్లిదండ్రులతోపాటు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన చిన్నారులకు మిఠాయిలు అందజేశారు. నగరపాలక సంస్థ ఎన్నికల్లో 'నోటా'కు అవకాశం లేకపోవడమేంటని పలువురు ప్రశ్నించారు. నగర పాలక సంస్థ కమిషనర్ అలీంబాషా, జాయింట్ కలెక్టర్ మల్లికార్జున, జేసీ-2 రాధాకృష్ణమూర్తి, ఎస్పీ విశాల్ గున్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కొన్ని కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది ఓ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడంపై అధికారులు ఆగ్రహం ప్రకటించారు. వైకాపా నేతలు అక్రమాలకు పాల్పడుతున్నారని, పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని తెదేపా నేత టి.డి.జనార్దన్ చేసిన ఫిర్యాదుపై ఎస్పీ విశాల్ విచారణ చేపట్టారు.

ఓట్ల లెక్కింపు వచ్చే శుక్రవారమే..

నగరపాలక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు శుక్రవారం జరగనుంది. ఆ రోజు మధ్యాహ్నంలోపే ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కాకినాడలోని రంగరాయ వైద్యకళాశాల ఆవరణలో స్ట్రాంగ్ రూములను ఏర్పాటుచేశారు. మంగళవారం సాయంత్రానికి 196 పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను సురక్షితంగా అక్కడకు తరలించారు.



కాకినాడ నగర పరిధి 12వ డివిజన్ దుమ్ములపేట ప్రాథమిక పాఠశాలలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు



ఏఎంజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద గుర్తింపు కార్డులు చూపుతున్న మహిళా ఓటర్లు

2014 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే తగ్గిన పోలింగ్ శాతం

ఈనాడు, కాకినాడ: రెండు ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మంగా తీసుకున్న కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గడం చర్చనీయాంశమైంది. మూడేళ్ల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు, ఇప్పటి నగరపాలక సంస్థ ఎన్నికలకు మధ్య వ్యత్యాసం కనిపించింది. 48 డివిజన్లకు జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికల్లో 64.78 శాతం పోలింగ్ నమోదవగా.. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం 67.5గా ఉంది. మూడేళ్ల వ్యవధిలో మూడు శాతం తక్కువగా నమోదైంది. ఈ పరిస్థితికి కారణాలను అధికారులు, రాజకీయ వర్గాలు పలు రకాలుగా విశ్లేషిస్తున్నారు.

- మంగళవారం ఉదయం వర్షం పడడంతో పోలింగ్ కేంద్రాలకు వచ్చేందుకు ఓటర్లు ఆసక్తి చూపలేదు.
- డివిజన్ల పునర్విభజన అనంతరం ఓట్లు ఒక చోట... పోలింగ్ కేంద్రం మరో డివిజన్‌లో ఉండడం వల్ల ఆ ప్రాంతానికి వెళ్లి ఓటు వేసేందుకు కూడా చాలా మంది రాలేదంటున్నారు.
- కొన్ని వర్గాలకు పార్టీల పరంగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వకపోవడం వల్ల వారి నుంచి కొంత వ్యతిరేకత ఉండడం కూడా పోలింగ్‌పై ప్రభావం చూపినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.
- రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల సమయంలో సుమారు 17 కులాలకు ప్రాతినిధ్యం కల్పించగా కాకినాడ విషయంలో హడావుడిగా సీట్లు కేటాయించిన పార్టీలు కేవలం మూడు, నాలుగు కులాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.
- అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన కాలనీలతో పోల్చితే మురికివాడల్లో ఓటింగ్ శాతం అత్యధికంగా నమోదైంది. జగన్నాథపురం వైపు ఉండే అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరగా, వంతెనకు ఇవతల ఉన్న కొత్త కాలనీల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏ దశలో కూడా ఓటర్ల రద్దీ కనిపించలేదు.
- రామారావుపేట, గాంధీనగర్, ప్రతాప్‌నగర్, శ్రీవిద్యాలకాలనీ, శ్రీనగర్ కాలనీ, వెంకటనగర్, భానుగుడి, శాంతినగర్ వంటి ప్రాంతాల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల తాకిడి తక్కువగా కనిపించింది.
- దీనిని గుర్తించిన రాజకీయ పార్టీలు మధ్యాహ్నం తర్వాత ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు అపార్టుమెంట్ల వద్దకు ఆటోలను పంపినా పెద్దగా స్పందన రాలేదు.
- మధ్యతరగతికి చెందిన కుటుంబాల్లో అత్యధిక మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

కాకినాడలో గెలుపుపై తెదేపా ధీమా

ఈనాడు, అమరావతి: కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో గెలుపు తమదే అన్న ధీమా తెలుగుదేశం వర్గాల్లో వ్యక్తమవుతోంది. పట్టణ ప్రజల మొగ్గు తమవైపే ఉందని, 60శాతానికి పైగా పోలింగ్ జరగడం అనుకూలిస్తుందనేది ఆ వర్గాలు చెబుతున్నాయి. ఓటర్ల నాడిని బట్టి చూస్తే మొత్తం వార్డుల్లో 34చోట్ల విజయం సాధిస్తామని నేతలు స్పష్టం చేస్తున్నారు. ఆరుచోట్ల మాత్రమే వైకాపాతో హోరాహోరీ ఉంటుందని, మూడుచోట్ల రెబల్స్ గెలిచే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. ఎన్నికల్లో భాజపా కూడా సానుకూల ఫలితాలు సాధిస్తుందని చెబుతున్నారు. వైకాపా సింగిల్ డిజిట్‌కే పరిమితం కావచ్చంటున్నారు.

పరిశ్రమ ఫలం!

(మొదటి పేజీ తరువాయి)

సంస్థల అభిప్రాయాలను రాబట్టారు. ఇప్పుడిప్పుడే పురుడుపోసుకున్న 141 సంస్థల అభిప్రాయాలను కూడా సేకరించారు.

- 2016లో జరిపిన ఈ సర్వేలో 23 రంగాలకు చెందిన సంస్థల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు.
- సులభ వాణిజ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సంస్కరణలు ఎక్కడ విజయవంతమవుతున్నాయి? ఎక్కడ విఫలమవుతున్నాయనే విషయాలను వెలుగులోకి తెచ్చి తప్పులను సరిదిద్ది మరింత మెరుగైన పారిశ్రామిక వాతావరణం కల్పించడానికి ఈ సర్వే నిర్వహించారు.

తెలంగాణలో రుణాలు సులభం

- ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకోవడం పెద్ద ఇబ్బందేమీ కావడంలేదని తెలంగాణలో 46% మంది పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో గుజరాత్ తర్వాతి స్థానంలో తెలంగాణ నిలుస్తోంది.
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌ల్లో వ్యాపారాలు ప్రారంభించడానికి.. భూమి, నిర్మాణ అనుమతులు, పర్యావరణ అనుమతులు పొందడంలో తమకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావడంలేదని ఉత్పాదక సంస్థలు అభిప్రాయపడ్డాయి.
- యువపారిశ్రామికవేత్తలు అధికంగా మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలపై దృష్టిసారించారు.
- మాన్యుఫ్యాక్చరింగ్ స్టార్టప్స్‌లో 63 శాతం మహారాష్ట్ర, తెలంగాణ, గుజరాత్‌ల్లోనే ఉన్నాయి.

చెక్కు చెదిరిపోతోంది

(మొదటి పేజీ తరువాయి)

ఖాతాదారులకు పాత చెక్కుల స్థానంలో కొత్త చెక్కులు జారీ చేశాయి. అందులో పలు భద్రతా చర్యలు కూడా తీసుకున్నాయి. సీఎస్టీ విధానం చెక్కుల పరిశీలన, మంజూరును కేంద్రీకృతం చేశారు. ఇందుకోసం దేశంలోని మూడు ప్రాంతాల్లో సీఎస్టీ గ్రిడ్‌లను ఏర్పాటు చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి ఈ గ్రిడ్ చెన్నైలో ఉంది. ఈ నాలుగు రాష్ట్రాల్లో ఖాతాదారులు ఏ ప్రాంతంలో, ఏ బ్యాంకులో చెక్కులు జమ చేసినా అవి చెన్నైకి చేరుతాయి. చెక్కు తీసుకున్న బ్యాంకు అధికారులు దాన్ని సర్వీసు బ్యాంకర్‌కు స్కాన్ చేసి పంపుతారు. ఇలా రోజంతా వచ్చిన చెక్కులను ఆ సర్వీసు బ్యాంకు నేరుగా చెన్నైలోని సీఎస్టీ గ్రిడ్‌కు పంపుతుంది. వారు అక్కడ వాటిని పరిశీలించి ఆ చెక్కు చెల్లుతుందో లేదో వెంటనే తేల్చేసి మరునాడు సాయంత్రం 3 గంటల్లోపు(మొత్తం 48 గంటల్లో) చెక్కు గురించి సదరు ఖాతాదారుడికి వివరాలు అందిస్తారు.

ఐదు శాతం తిరస్కరణ

చెన్నైలోని 'చెక్ ట్రంకేషన్ సిస్టమ్' గ్రిడ్‌కు చేరుతున్న లక్షలాది చెక్కుల్లో ఐదు శాతంపైగా చెక్కులు సంతకాలు సరిగ్గాలేకుండా, రాత సరిగ్గా లేకుండా చెల్లుబాటు కాకుండాపోతున్నాయి. ప్రజల దస్తూరి సరిగ్గా లేకపోవడం, సంతకాలు కూడా సరిగ్గా చేయలేకపోతుండటం, అక్షర దోషాలు కుప్పలు తెప్పలుగా రాస్తుండటంతో ఇవి చెల్లుబాటు కాకుండా పోతున్నాయి.

- ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నవారు కొందరు కావాలనే చెక్కులపై సంతకాలను మార్చి చేస్తున్నట్లు తేలింది. అలాగే మరికొంత మంది బ్యాంకు ఖాతాను మూసివేసినప్పటికి అదే బ్యాంకుకు చెందిన చెక్కులను జారీ చేస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో తిరస్కరణకు గురవుతున్న చెక్కులు సుమారు 30 శాతంగా ఉంటున్నాయని బ్యాంకర్లు పేర్కొంటున్నారు.

ఏటా ఐదు కోట్లు!

దేశంలో ఏటా వివిధ కారణాలతో చెల్లుబాటు కాకుండా పోతున్న చెక్కుల సంఖ్య 5.50కోట్లు. గత రెండేళ్లుగా ఈ చెల్లని చెక్కుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం బ్యాంకింగ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. గత ఆర్థిక సంవత్సరం దక్షిణాది రాష్ట్రాల్లో బ్యాంకులకు మొత్తం 34.68 కోట్ల చెక్కులొస్తే అందులో 1.88 కోట్ల చెక్కులు చెల్లుబాటు కాలేదు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ బ్యాంకుల నుంచి రోజూ సగటున పది లక్షల్లోపు చెక్కులు చెల్లింపుల కోసం వస్తుంటాయి. వాటిలో ఐదు శాతం చెక్కులు చెల్లుబాటు కాకుండా పోతున్నాయి.

ఇద్దరికీ బాదుడే

చెక్కు జారీ చేశాక అది చెల్లుబాటు కాకపోతే బ్యాంకులు భారీగానే జరిమానా బాదేస్తున్నాయి. ఇటు చెక్కు జారీ చేసినవారికి, దాన్ని స్వీకరించి బ్యాంకులో జమ చేసిన వారికీ ఆ బ్యాంకులు అపరాధ రుసుం బాదేస్తుంటాయి. జారీ చేసిన చెక్కు, అందులో దొర్లిన లోపాల ఆధారంగా రూ.50 నుంచి రూ.750 వరకూ ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. ఖాతాలో తగిన నిధులు లేకుండా చెక్కు ఇస్తే జరిమానాలు మరింత ఎక్కువగా ఉంటాయి.

ఏడాదికే మారుతున్న సంతకాలు

మారుతున్న జీవన శైలి, యాంత్రీకరణ తదితర కారణాలతో ప్రజలు రాతకు దూరమవుతున్నారు. అదే సందర్భంలో అక్షరదోషాలు పెరుగుతున్నాయి. ఇక సంతకాల విషయంలో బ్యాంకులో ఖాతాదారుడు పెట్టిన రెండు, మూడు సంతకాలతోనూ చెక్కుపైన చేసిన సంతకం సరిపోలని పరిస్థితులున్నాయి. ఏడాదిలోపే సంతకాల శైలి మారిపోతోంది. దాంతో చెక్కుల విషయంలో ఇబ్బందులు వస్తున్నాయనేది బ్యాంకర్ల అభిప్రాయం.

50 శాతం తగ్గుతున్నాయి

చెక్కులు, డీడీలు ఉపయోగించడం గణనీయంగా తగ్గిపోతోందని చెక్ ట్రంకేషన్ సిస్టమ్ అధికారులు 'ఈనాడు'తో అన్నారు. ఇప్పుడు 'నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్' (ఎన్ఈఎఫ్‌టీ), 'రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ సర్వీసెస్' (ఆర్‌టీజీఎస్) విధానంలోనే ఎక్కువగా చెల్లింపులు చేస్తున్నారని, గతంతో పోల్చితే ఇప్పుడు చెక్కులు 50 శాతం తగ్గాయనేది తమ అంచనా అని తెలిపారు. చాలా మంది వ్యాపారులు కూడా ఇప్పుడు ఈ లావాదేవీలే నిర్వహిస్తున్నారు. గతంలో ఒక్కో వ్యాపారి సగటున రోజుకు పాతిక చెక్కులు కూడా జారీ చేసేవారుండేవారట. ఇప్పుడు పదిలోపే అది కనిపిస్తోందని బ్యాంకర్లు చెబుతున్నారు. డిమాండు డ్రాఫ్టులైతే మరీ తగ్గిపోతున్నాయట. మా బ్యాంకులో ఒకప్పుడు కనీసం రోజుకు వంద డీడీలు రాసేవాళ్లం.. ఇప్పుడు రోజుకు పది రాయడం కూడా ఒక్కోసారి గగనంగా మారిపోతోందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి ఒకరు తెలిపారు.

మూడేళ్లకోసారి కొత్త సంతకాలు తీసుకోవాలి

"సంతకాల శైలి చాలా వేగంగా మారిపోతోంది. ఎప్పటికప్పుడు బ్యాంకర్లు ఖాతాదారుల నుంచి కొత్తగా సంతకాలు సేకరించి అప్‌డేట్ చేయాల్సిన అవసరముంది. గతంలో ఐదేళ్లకొకసారైనా ఇలా కొత్తగా సంతకాలు సేకరించాలని చెప్పాం. ప్రస్తుతం ఏడాదిలోపే కొందరి సంతకాల శైలి మారిపోతోంది. దాంతో కనీసం మూడేళ్లకొకసారైనా తమ ఖాతాదారుల నుంచి కొత్తగా సంతకాలు తీసుకుని అప్‌డేట్ చేయాలని బ్యాంకర్లను కోరాం"

– చెక్ ట్రంకేషన్ గ్రిడ్ చెన్నై ఉన్నతాధికారి

రాష్ట్ర వ్యాప్తంగా నంద్యాల నమూనా

ఈనాడు అమరావతి: నంద్యాల ఉప ఎన్నికలో విజయం సాధించిన విధానాన్ని ఒక నమూనాగా తీసుకుని, రాష్ట్రంలో అన్ని చోట్లా దాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్ణయించారు. ప్రతికూల పరిస్థితుల్లో మొదలు పెట్టి, మంచి మెజార్టీతో గెలిచేందుకు నంద్యాలలో అనుసరించిన వ్యూహాలు, ఎదురైన అనుభవాలు, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలన్నీ పొందుపరిచి 'ఎల్లో నంద్యాల' పేరుతో ఒక పుస్తకం రూపొందించాలని పార్టీ నాయకుల్ని ఆయన ఆదేశించారు. సెప్టెంబరు 4, 5 తేదీల్లో విజయవాడలో పార్టీ రాష్ట్రస్థాయి కార్యశాల నిర్వహించనున్నారు. విజయానికి అనుసరించిన వ్యూహాల గురించి అక్కడ వివరిస్తారు. నంద్యాల ఎన్నిక కోసం పనిచేసిన మంత్రులు, శాసనసభ్యులందర్నీ శుక్రవారం మళ్లీ ఆ నియోజకవర్గంలో పనిచేసిన చోటుకు వెళ్లాల్సిందిగా చంద్రబాబు ఆదేశించారు. అక్కడ సమావేశాలు నిర్వహించాలని, ఎన్నికల్లో తెదేపాకి మద్దతిచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పాలని, నంద్యాల అభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని, ప్రారంభించిన పనులన్నీ పూర్తి చేస్తామని భరోసా ఇవ్వాలని సూచించారు.

నంద్యాల ఉప ఎన్నికలో గెలిచిన భూమా బ్రహ్మానందరెడ్డి, మంత్రులు భూమా అఖిల ప్రియ, కాలవ శ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు మంగళవారం సాయంత్రం ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిశారు. పక్కా ప్రణాళికతో వెళితే పులివెందులలోనైనా గెలుస్తామని, ఎన్నికల్లో వ్యూహం ముఖ్యమని ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో 80 శాతం ఓట్లు తెదేపాకే రావాలని స్పష్టం చేశారు. ఒక సంక్షోభం వంటి పరిస్థితిని అవకాశంగా ఎలా మార్చుకోవచ్చో నంద్యాలలో చూపించామని, ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లోను విజయం సాధిస్తామని ఆయన పేర్కొన్నారు.

నంద్యాల ఎన్నికను విజయవాడ నుంచి పర్యవేక్షించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలతో ఏర్పాటు చేసిన బృందంతో మంగళవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి నివాసంలో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమావేశమయ్యారు. వీరిలో మంత్రులు అచ్చెన్నాయుడు, పి.నారాయణ, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, గద్దె రామ్మోహన్‌రావు, ఎమ్మెల్సీ వై.బి.రాజేంద్రప్రసాద్ ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా వారితో కాసేపు మాట్లాడారు. రాష్ట్రంతో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న 25 మంది ఎమ్మెల్యేలను నంద్యాల ఎన్నికల కోసం ఎంపిక చేశారు. వారిలో 18 మంది క్షేత్రస్థాయిలో పనిచేయగా, కొందరికి ఇక్కడి నుంచి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పనిచేసిన 18 మందిని మళ్లీ సెప్టెంబరు ఒకటో తేదీన నంద్యాలకు వెళ్లినప్పుడు స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి.... ఇంకా ఏం చేస్తే నంద్యాలలో మరింత మెజార్టీ వచ్చేదో తెలుసుకోవాలని, అందరి అనుభవాలను క్రోడీకరించి పుస్తకం రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో వెనుకబడి ఉన్నాయని భావిస్తున్న నియోజకవర్గాలకు నంద్యాలను ఒక నమూనాగా చూపించేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని, నంద్యాలలో గెలుపుని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలోని మిగతా నియోజకవర్గాల్లోను అన్ని సామాజిక వర్గాల మద్దతు పొందేందుకు ఈ పుస్తకం ఒక కరదీపికగా ఉండాలని ఆయన సూచించారు.

ఉద్యోగుల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం

- ఉద్యోగ సంఘ నేతలతో చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం తనను కలిసిన ఉద్యోగ సంఘం నేతలకు చెప్పారు. ఏపీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌బాబు ఆధ్వర్యంలో పలువురు ఎన్జీఓ నాయకులు మంగళవారం ముఖ్యమంత్రిని కలిశారు. కారుణ్య నియామకాల్లో ఇంటర్మీడియెట్ విద్యార్హతను కల్పించడం, కారుణ్య నియామకం వద్దనేవారికి ఇచ్చే పరిహారాన్ని భారీగా పెంచడంతోపాటు, మచిలీపట్నం, శ్రీకాకుళం, చిత్తూరు పట్టణాల్లో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి అద్దె భత్యాన్ని 20శాతానికి పెంచడం, సచివాలయం ఉద్యోగులతో సమానంగా శాఖాధిపతుల కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సీఆర్‌డీఏ పరిధిలో ఉచిత బస్‌పాస్‌లను మంజూరు చేయడం వంటి విషయాల్లో సానుకూల నిర్ణయాలు తీసుకున్నందుకు ఎన్జీఓ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ ఎన్ఎంయూ ఏర్పాటై 50సంవత్సరాలవుతున్న నేపథ్యంలో వచ్చే నెల 12న విజయవాడ ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న పద్మావతి ఘాట్‌లో నిర్వహించనున్న సంఘం స్వర్ణోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. తప్పకుండా వస్తానని సీఎం చెప్పినట్లు నేతలు వెల్లడించారు. ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఏపీఎన్జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారి వీరంద్రబాబు, ఎన్ఎంయూ నేతలు వై.శ్రీనివాసరావు, వి.శివారెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.



ముఖ్యమంత్రికి ఎన్జీవో నేతల కృతజ్ఞతలు

గ్రహం అనుగ్రహం

30-8-2017 బుధవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; భాద్రపద మాసం; శుక్ల పక్షం
నవమి: తె. 4-20 తదుపరి దశమి
జ్యేష్ఠ నక్షత్రం: రా. 2-15 తదుపరి మూల
అమృతఘడియలు: సా. 4-31 నుంచి 6-17 వరకు
వర్జ్యం: ఉ. 5-54 నుంచి 7-40 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-37 నుంచి 12-26 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ. 5-48; సూర్యాస్తమయం: సా. 6-14

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	22.1	27.1
రాజమహేంద్రవరం	24.0	32.0
గుంటూరు	24.0	34.0
విశాఖపట్నం	24.2	30.2
కర్నూలు	24.3	33.7
ఒంగోలు	24.3	33.7
విజయవాడ	24.5	33.0
అనంతపురం	24.6	32.9
తాడేపల్లిగూడెం	25.0	30.5
శ్రీకాకుళం	25.0	32.0
తిరుపతి	25.4	33.5
నరసాపురం	25.5	30.9
నెల్లూరు	26.0	32.0
కడప	26.0	33.0



శ్రీకాకుళం జిల్లా మందస మండలం మహేంద్రగిరులపై కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఈ వరద ప్రవాహం కళింగదళ్ జలాశయంలోకి వచ్చి చేరింది. జలాశయం మొత్తం నిండి, పరుపు మీద నుంచి పాల నురుగును తలపించేలా నీరు జాలువారుతున్న దృశ్యం చూపరులను ముగ్ధులను చేస్తోంది. – న్యూస్‌టుడే, మందస

'మెడ్‌టెక్ జోన్' ప్రాజెక్టు వ్యయం పెంపుదల అవాస్తవం

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో ప్రతిష్ఠాత్మక 'మెడ్‌టెక్ జోన్' ప్రాజెక్టు వ్యయం రూ.1100 కోట్లు మాత్రమేనని రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది. విశాఖపట్నంలో వైద్య పరికరాల తయారీ కేంద్రం వ్యయాన్ని నిబంధనల్ని అతిక్రమించి రూ.2400 కోట్లకు పెంచారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని వెల్లడించింది. విజయవాడలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, సలహాదారు, మెడ్‌టెక్ జోన్ సీఈఓ జితేంద్రకుమార్ శర్మతో కలిసి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. మంత్రి కామినేని మాట్లాడుతూ జుదీష్‌కుమార్ నకిలీ ఐడీని సృష్టించి అపోహలు సృష్టించినందున సైబర్ క్రైం పోలీసులు చర్యలు తీసుకున్నారని చెప్పారు. వైద్య పథకాలను తప్పుదోవ పట్టించేందుకు యత్నించిన డాక్టర్ పవన్ మధ్యవర్తి ద్వారా చేసిన తప్పులను ఒప్పుకున్నారని, తన ప్రమేయం ఇందులో లేదన్నారని వివరించారు. ఈ ప్రాజెక్టుకు సీఎండీగా కూడా వ్యవహరిస్తున్న పూనం మాలకొండయ్య మాట్లాడుతూ ఈ సంస్థకు తాను వ్యక్తిగతంగా జవాబుదారీతనంగా ఉన్నట్లు చెప్పారు. సీఈఓ జితేంద్రకుమార్ మాట్లాడుతూ... ''ప్రాజెక్టు వ్యయం రూ.1100 కోట్లే. నాలుగైదేళ్లలో పూర్తి చేయాలి. ఒకవేళ 240 యూనిట్ల (పరిశ్రమలు)ను పూర్తి చేయడానికి ఆరు దశలకు పొడిగిస్తే వ్యయం రూ.1400 కోట్లు అవుతుందని అంచనా. ఎల్1 బ్లాక్ లిస్టులో లేదు. ఇప్పటివరకు కేవలం ఎల్ఓఐ మాత్రమే ఇచ్చాం. మరికొన్ని అంశాలపై స్పష్టత వచ్చాకనే వర్క్ ఆర్డరును ఇస్తాం. ప్రాజెక్టుపై అపోహలు, సందేహాల నివృత్తికి సిద్ధం...'' అని వివరించారు.

పవన విద్యుత్ ప్రాజెక్టులపై 23న ప్రజాభిప్రాయ సేకరణ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ దక్షిణాది విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలో ఏర్పాటు చేయనున్న 41 పవన విద్యుత్తు ప్రాజెక్టులపై వచ్చే నెల 23న ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ఏపీ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేసే ఈ పవన విద్యుత్తు ప్రాజెక్టుల నుంచి 832.6 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. దేశ వ్యాప్తంగా పవన విద్యుత్తు రంగంలో ఛార్జీలు తగ్గడం, మరికొన్ని ఇతర కారణాలతో ఈ 41 పీపీఏలను వెనక్కి ఇచ్చేయాలని విద్యుత్తు పంపిణీ సంస్థలు గతంలో ఏపీఈఆర్సీని కోరాయి. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఒక పీపీఏ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. మూడు నెలల్లోపు ఈ సమస్యను పరిష్కరించాల్సిందిగా ఏపీఈఆర్సీకి హైకోర్టు సూచించింది. ఈ పరిస్థితుల్లో సదరు పీపీఏలను మళ్లీ పరిగణనలోకి తీసుకోవాలంటూ డిస్కంలు ఈఆర్సీకి నివేదించాయి. దీంతో ఆ ప్రాజెక్టులపై ఎవరికైనా అభ్యంతరాలున్నాయా అనే దానిపై ఈఆర్సీ ప్రజాభిప్రాయం సేకరించనుంది. వచ్చే నెల 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు కమిషనర్, ఏపీఈఆర్సీకి మెయిల్ ద్వారా లేదా 23వ తేదీ హైదరాబాద్‌లోని ఏపీ ఈఆర్సీ కార్యాలయంలోని కోర్టు హాలులో కానీ వ్యక్తిగతంగా హాజరై ప్రజలు అభ్యంతరాలు తెలపొచ్చని ఏపీఈఆర్సీ కోరింది.

3275 కోట్లతో గృహ నిర్మాణాలు

- **మంత్రులు, న్యాయమూర్తులు, సీనియర్ అధికారులకు బంగ్లాలు**
- **ఎమ్మెల్యేలు, అధికారులు, ఉద్యోగులకు బహుళ అంతస్తుల భవనాలు**
- **గృహనిర్మాణ ప్రాజెక్టులకు బ్యాంకుల నుంచి రుణం తీసుకోవాలని యోచన**

ఈనాడు – అమరావతి

రాజధాని అమరావతిలోని పరిపాలనా నగరంలో పెద్ద ఎత్తున గృహ నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) ప్రణాళికలు సిద్ధం చేసింది. రాష్ట్ర మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు, ఎమ్మెల్యేలు, అఖిల భారత సర్వీసుల అధికారులు, ఇతర అధికారులు, ఉద్యోగులకు రూ.3,275 కోట్లతో నివాస గృహాలు నిర్మించనుంది. ఎమ్మెల్యేలు, అఖిల భారత సర్వీసుల అధికారులు, ఇతర అధికారులు, ఉద్యోగులకు బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు నిర్మిస్తారు. వీటికి రూ.2,099 కోట్లు ఖర్చవుతుందని అంచనా. మంత్రులు, న్యాయమూర్తులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు బంగ్లాలు నిర్మిస్తారు. వీటికయ్యే వ్యయం సుమారు రూ.676 కోట్లు. ఈ మొత్తంపై జీఎస్టీ కూడా కలిపితే ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.3275 కోట్లు. వీటిలో ఎమ్మెల్యేలు, అఖిల భారత సర్వీసుల అధికారులు, నాన్ గెజిటెడ్ అధికారుల (ఎన్‌జీఓ)కు అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి సీఆర్‌డీఏ ఇప్పటికే టెండర్లు పిలిచింది. గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులకు అపార్ట్‌మెంట్లతో పాటు, బంగ్లాల నిర్మాణానికి టెండర్లు పిలవాల్సి ఉంది. టెండర్ పత్రంలో సీఆర్‌డీఏ నిర్ణయించిన ధరల ప్రకారం అఖిల భారత సర్వీసుల అధికారులకు నిర్మించే ఫ్లాట్‌కి రూ.1.42 కోట్లు ఖర్చవుతోంది. ఎమ్మెల్యేల కోసం నిర్మించే ఫ్లాట్‌కి రూ.1.40 కోట్లు, అత్యల్పంగా నాలుగో తరగతి ఉద్యోగులకు నిర్మించే ఫ్లాట్‌కి రూ.37 లక్షలు వ్యయమవుతోంది. మంత్రులు మొదలుకుని, నాలుగో తరగతి ఉద్యోగుల వరకు నిర్మించేవన్నీ క్వార్టర్లు మాత్రమే..! ప్రభుత్వ పదవి/ఉద్యోగంలో ఉన్నంత వరకే వారు ఆ క్వార్టర్లలో ఉండేందుకు అవకాశం ఉంటుంది. పదవి/ఉద్యోగ విరమణ చేసినా, బదిలీపై వేరే చోటుకి వెళ్లినా... ఈ క్వార్టర్లను ఖాళీ చేసి వెళ్లాలి. వాటిని వేరే వారికి కేటాయిస్తారు.

194 బంగ్లాలు..!

- మంత్రులు, న్యాయమూర్తులతో పాటు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు విడిగా మొత్తం 194 బంగ్లాలు నిర్మించనున్నారు.
- అపార్ట్‌మెంట్లన్నీ స్టిల్ట్+12 అంతస్తులుగా నిర్మిస్తారు. వీటిలో మొత్తం 3,840 ఫ్లాట్‌లుంటాయి.
- ఎమ్మెల్యేలు, అఖిల భారత సర్వీసుల అధికారులకు నిర్మించే అపార్ట్‌మెంట్లలో మాత్రం బేస్‌మెంట్ కూడా ఉంటుంది.
- గెజిటెడ్ ఆఫీసర్స్ టైప్-1, గెజిటెడ్ ఆఫీసర్స్ టైప్-2, నాన్ గెజిటెడ్ అధికారులు, క్లాస్ డి (నాలుగో తరగతి ఉద్యోగులు) అని నాలుగు కేటగిరీలుగా విభజించి, వారికి హోదాకు తగ్గట్టుగా అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్ పరిమాణం నిర్ణయించారు.
- ఫ్లాట్ల పరిమాణంలో ఉద్యోగుల హోదాలను బట్టి హెచ్చు తగ్గులున్నాయి తప్ప, నిర్మాణంలో వాడే సామగ్రి విషయంలో అందరికీ ఒకేలాంటివి వినియోగిస్తున్నారు.
- మొత్తం 61 బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తుండగా... వీటిని మూడు ప్యాకేజీలుగా విభజించారు.
- అపార్ట్‌మెంట్ల నిర్మాణంతో పాటు... ఆ ప్రాంగణంలో రహదారులు, మురుగు నీటి పారుదల వ్యవస్థలు, మురుగు నీటి శుద్ధి కేంద్రాలు వంటి వ్యవస్థల ఏర్పాటు, వీధి దీపాలు వంటి పనులు, ప్రహరీ వంటివన్నీ కలిపే టెండరు ప్యాకేజీలు సిద్ధం చేశారు.
- ఎమ్మెల్యేలు, ఏఐఎస్ అధికారులకు నిర్మించే అపార్ట్‌మెంట్లలో ఒక్కో అంతస్తుకి రెండు ఫ్లాట్‌లే ఉంటాయి. నాన్‌గెజిటెడ్ అధికారుల అపార్ట్‌మెంట్లలో కొన్నింటిలో 8 ఫ్లాట్‌లు, కొన్నింటిలో 6 ఫ్లాట్‌లు చొప్పున ఉంటాయి. గెజిటెడ్ అధికారుల కోసం నిర్మించే అపార్ట్‌మెంట్లలో ఒక్కో అంతస్తులో నాలుగు ఫ్లాట్‌లుంటాయి. నాలుగో తరగతి ఉద్యోగుల అపార్ట్‌మెంట్లలో ఒక్కో అంతస్తుకి 10 ఫ్లాట్‌లుంటాయి.

హెచ్‌ఆర్‌ఏతో రుణం చెల్లింపు..!

పరిపాలనా నగరంలో గృహ నిర్మాణ ప్రాజెక్టులకు అవసరమైన నిధుల సమీకరణకు సీఆర్‌డీఏ ప్రణాళిక రూపొందించింది. మొత్తం రూ.3,275 కోట్లలో 70 శాతం రుణంగా తీసుకుంటారు. 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. సుమారు రూ.2,200 కోట్లు రుణం తీసుకోవాలని అంచనా. ఈ రుణం కోసం హడ్కో, ఐఎఫ్‌సీ, ఏఐఐబీ, ఇతర బ్యాంకులను సీఆర్‌డీఏ సంప్రదిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా కోరుతోంది. రుణ వితరణ సంస్థలు, బ్యాంకుల నుంచి రుణం తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ప్రభుత్వం నిర్మించే క్వార్టర్లలో నివాసం ఉండే ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల ఇంటి అద్దె భత్యాన్ని(హెచ్‌ఆర్‌ఏ) మినహాయించి, తీసుకున్న రుణాలను ఆ మొత్తంతో తిరిగి చెల్లించాలన్నది ప్రతిపాదన. సచివాలయం, ఇతర ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగుల్లో ఐదో వంతు మాత్రమే ప్రభుత్వం నిర్మించే క్వార్టర్లలో నివాసం ఉండేందుకు మొగ్గు చూపుతారన్న అంచనాతో... దానికి సరిపడినన్ని ఫ్లాట్లే నిర్మిస్తున్నారు. వీటిలో నివాసం ఉండేవారి నుంచి హెచ్‌ఆర్‌ఏ రూపంలో రూ.150 నుంచి రూ.170 కోట్లు మిగులుతుందని అంచనా. దాన్ని రుణ వితరణ సంస్థలు, బ్యాంకులకు చెల్లిస్తారు. 26-27 ఏళ్లకు అసలు, వడ్డీ సహా మొత్తం రుణం తిరిగి చెల్లించగలమని అంచనా వేశారు.

నిమిషం ఆలస్యంగా నింగిలోకి

- **పీఎస్ఎల్‌వీ ప్రయోగంలో మార్పు**
- **అంతరిక్ష వ్యర్థాలు అడ్డువస్తాయని...**

శ్రీహరికోట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ 'షార్' నుంచి వాతావరణ పరిస్థితులన్నీ అనుకూలిస్తే గురువారం సాయంత్రం 7 గంటలకు నింగిలోకి పీఎస్ఎల్‌వీ-సి39 వాహకనౌక దూసుకెళ్లనుంది. షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాకెట్ సన్నద్ధత సమావేశం (ఎంఆర్ఆర్) సీనియర్ శాస్త్రవేత్త అలెక్స్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రాకెట్ కూర్పు, పరీక్షలు తదితర వాటిపై సుదీర్ఘంగా చర్చించారు. ముందుగా నిర్ణయించిన మేరకు గురువారం సాయంత్రం 6.59 గంటలకు ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపితే వ్యర్థాలు అడ్డువచ్చే అవకాశం ఉందన్న అంశం చర్చకు వచ్చింది. దీంతో రాత్రి లాంచ్ ఆథరైజేషన్ (ల్యాబ్) సమావేశం నిర్వహించారు. ఇందులో రాకెట్ ప్రయోగానికి అధికారికంగా అనుమతి ఇచ్చారు. దీనిని గుర్తించిన శాస్త్రవేత్తలు రాకెట్ ప్రయోగ సమయాన్ని నిమిషం ఆలస్యంగా అంటే రాత్రి 7 గంటలకు నింగిలోకి పంపాలని నిర్ణయించారు. ఈ మేరకు కౌంట్‌డౌన్‌లో మార్పు చేశారు. బుధవారం మధ్యాహ్నం 1.59కు బదులు కౌంట్‌డౌన్ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతుంది. నిరంతరాయంగా 29 గంటల పాటు కొనసాగనుంది. 1,425 కిలోల బరువు గల ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి మోసుకెళ్లనుంది. 2013 జులైలో పీఎస్ఎల్‌వీ ద్వారా నావిగేషన్ వ్యవస్థ కోసం ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఎ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపారు. అందులో ఉన్న గడియారాల్లో సాంకేతిక లోపం తలెత్తి అవి పనిచేయడం మానేసి సేవలందించడంలేదు. దీని స్థానంలో ప్రస్తుతం ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహాన్ని పంపుతున్నారు.

చెంగాళమ్మ సేవలో డాక్టర్ శివన్: రాకెట్ ప్రయోగానికి ముందు ఆనవాయితీలో భాగంగా సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ అమ్మవారిని ఇస్రో ప్రాజెక్టు మేనేజ్‌మెంటు కౌన్సిల్ ఛైర్మన్, స్పేస్ కమిషన్ సభ్యులు, వీఎస్ఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ శివన్ మంగళవారం రాత్రి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



రెండో ప్రయోగ వేదికపై పీఎస్ఎల్‌వీ-సి39 వాహకనౌక

స్వచ్ఛత పాటించే సంస్థలకు అవార్డులు

ఈనాడు, అమరావతి: స్వచ్ఛతలో మిన్నగా నిలిచే సంస్థలకు 'అవార్డు-2017' పేరుతో 'స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సంస్థ' పోటీలు నిర్వహిస్తోంది. 11 కేటగిరిల, మరో 41 సబ్ కేటగిరిల వారీగా పోటీలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గత ఏడాది కేవలం పురపాలక, నగరపాలక సంస్థలను గుర్తించి అవార్డులు అందజేశారు. ఈసారి అన్ని కేటగిరిల్లోనూ స్వచ్ఛతలో ముందుండే సంస్థలకు అవార్డులిచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించారు. గిరిజన, మైదాన ప్రాంతాలు, పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు, ఆలయాలు, బస్‌స్టేషన్లు, నివాస ప్రాంత సంక్షేమ సంఘాలు, పర్యాటక క్రీడలు, పాఠశాలలు పోటీల్లో పాల్గొనవచ్చు. ఇందుకోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. ఇందుకోసం జిల్లా, రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ కార్యాలయాల్లో, అందుబాటులోని అధికారులను సంప్రదించాలి. విజేతగా నిలిచే సంస్థలకు అక్టోబరు 2న బహుమతులు అందజేస్తామని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

ఏలేరును ఇలా నింపుతాం

- **60 రోజుల్లో 12 టీఎంసీలు తీసుకెళ్తాం**
- **డిసెంబరులోను 1400 క్యూసెక్కులు తీసుకెళ్లొచ్చు**
- **పురుషోత్తపట్నంపై సీఎంతో అధికారుల భేటీ**

ఈనాడు – అమరావతి

పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా అక్టోబరు నుంచి 2100 క్యూసెక్కుల నీటిని ఏలేరు జలాశయానికి మళ్లిస్తామని 60 రోజుల్లోనే 12 టీఎంసీల నీరు తీసుకెళ్లే వీలుందని జలవనరులశాఖ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకి నివేదించారు. సీఎం నివాసం వద్ద మంగళవారం మధ్యాహ్నం పురుషోత్తపట్నం ఎత్తిపోతలపై సమీక్ష జరిగింది. జలవవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, ఎస్ఈ సుగుణాకరరావు, మేఘా ఇంజినీరింగు ప్రతినిధి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల పర్యవేక్షణలో ఉండి కూడా సీఎం ఈ పథకంపై సమీక్ష నిర్వహించారు. "మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం, ఒత్తిడి చేయడం నా ఉద్దేశం కాదు. డబ్బులు ఖర్చు పెడుతున్నందున ఏలేరు జలాశయం నింపి ప్రజలకు చూపాల్సిన బాధ్యత మనపై ఉంది" అని అన్నారు. అక్కడ వాతావరణ పరిస్థితులు ఏ మాత్రం అనుకూలించడం లేదని, నల్లరేగడి మట్టి వల్ల పైపులైను పనులకు చాలా ఇబ్బందిగా ఉందని అధికారులు వివరించారు.

ఏలేరుకు 12 టీఎంసీల నీటిని తీసుకెళ్లే ప్రణాళిక ఇది...

- పురుషోత్తపట్నం వద్ద ప్రస్తుతం తొలిదశ పంపుహౌస్‌లో మూడు పంపులు సిద్ధమయ్యాయి. మరో పంపు వారంలో పూర్తవుతుంది. తొలిదశలో మరో వరుస పైపులైను ఇంకా 5 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉంది. సెప్టెంబరు మధ్యలో ఇది పూర్తవుతుంది. తొలుత 700 క్యూసెక్కులు, మరో పది రోజుల తర్వాత 1400 క్యూసెక్కుల నీటిని పోలవరం ఎడమ కాలువ ద్వారా తరలిస్తారు. ఈ నీటిని తొలుత ఏలేరు ఆయకట్టుకు నేరుగా ఓపెన్ ఛానల్ వ్యవస్థ ద్వారా పంపుతారు.
- సెప్టెంబరు నెలాఖరుకల్లా రెండో దశ పంపుహౌస్, పైపులైను కూడా పూర్తవుతుంది. బీహెచ్ఈఎల్ కంపెనీ అప్పటికి మోటార్లు కూడా పూర్తి స్థాయిలో అందిస్తుంది. తొలి దశ పంపుహౌస్, పైపులైను కూడా కొలిక్కి వస్తాయి.
- ఆరు పంపుల ద్వారా 2100 క్యూసెక్కుల నీరు నేరుగా ఏలేరు జలాశయానికి పంపుతారు. అక్టోబరు ఒకటి నుంచి నవంబరు నెలాఖరు వరకు 60 రోజుల్లో దాదాపు 1,30,000 క్యూసెక్కుల నీరు ఏలేరు జలాశయంలో నింపుతారు. ఇది దాదాపు 12 టీఎంసీలు ఉంటుంది. ఇప్పటికే ఏలేరులోకి దాదాపు 5.5 టీఎంసీల నీరు చేరింది. మరిన్ని ప్రవాహాలు వచ్చే అవకాశం ఉంది. ఈ లోపు ఏలేరు ఆయకట్టుకు నేరుగా పురుషోత్తపట్నం నీరు ఇవ్వడంతో ఆ మేరకు ఏలేరులో నీరు ఆదా అవుతుంది. అవసరమయితే డిసెంబరు నాటికి ఖరీఫ్ అవసరాలు తీరతాయి. డిసెంబరులోను 1400 క్యూసెక్కులు తీసుకెళ్లొచ్చు.

శ్రీకాకుళం వరదపై సీఎం సమీక్ష

శ్రీకాకుళం జిల్లాలో వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఒడిశాలో రెండు రోజులుగా కురిసిన వర్షాల ప్రభావంతో నాగావళి, తోటపల్లి, వంశధారకు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో సహాయ చర్యల తీరు తెన్నులపై ఆయన అధికారులతో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయమైన వైనంపై టెలీకాన్ఫరెన్సులో కలెక్టర్ తదితరుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. జలవనరులశాఖ, వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి పంటలకు నష్టం కలగకుండా చూడాలన్నారు. ప్రకృతి విపత్తుల నిర్వహణ బృందాలను కూడా సహాయ చర్యల్లో భాగస్తులను చేయాలని సీఎం సూచించారు.

గోదావరి తీరానికి వరదముప్పు

- **వచ్చే 72 గంటల్లో దేశంలోని పలు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు**
- **కేంద్రం ముందస్తు హెచ్చరిక**

దిల్లీ: వచ్చే 72 గంటల్లో దేశంలోని ప్రధాన నదీపరివాహక ప్రాంతాలన్నింటికీ వరద ముప్పు పొంచి ఉన్నట్లు కేంద్ర జలవనరులశాఖ తెలిపింది. ఈమేరకు ముందస్తు హెచ్చరికలు జారీచేసింది. తెలుగు రాష్ట్రాల్లో గోదావరి తీరంలోని జిల్లాలకు వరద ముప్పు ఎదురుకానున్నట్లు పేర్కొంది. ఎగువప్రాంతాల్లో కురిసేవర్షాల కారణంగా మహారాష్ట్రలోని నాసిక్, అహ్మద్‌నగర్, ఔరంగాబాద్, పర్భణి, నాందేడ్ జిల్లాల్లో గోదావరి పొంగిప్రవహించే అవకాశం ఉన్నట్లు తెలిపింది. అలాగే దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో కురిసే వర్షాలతో జగదల్‌పూర్, దంతేవాడల్లో ఇంద్రావతి నదికి ఓ మోస్తరుగా వరద వచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. దీనివల్ల తెలంగాణలోని నిజామాబాద్, జయశంకర్, భద్రాద్రికొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయగోదావరి జిల్లాలకు వరద ముప్పురావొచ్చని హెచ్చరించింది. సతారా, సాంగ్లి, కొల్హాపూర్, పుణే, షోలాపూర్, కర్ణాటకలోని బాగల్‌కోట్, విజయపుర, కలబుర్గిజిల్లాల్లోని ఉపనదులు, చికమగళూరు, శివమొగ్గ, బళ్లారి జిల్లాల్లో కృష్ణా, తుంగభద్ర నదుల్లో నీటిమట్టాలు పెరిగే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. వచ్చే 48 గంటల్లో తూర్పురాజస్థాన్, పశ్చిమమధ్యప్రదేశ్, దక్షిణ కర్ణాటకలోని కోస్తా, కనుమ ప్రాంతాలు, వచ్చే 72 గంటల్లో గుజరాత్, కొంకణ్, గోవాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ వర్షాలవల్ల మాహి, సబర్మతి, బనస్, కృష్ణాతోపాటు వాటి ఉపనదులు, తపతి, కావేరిలకు ఓ మోస్తరు వరద వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

1 నుంచి తుంగభద్ర కాల్వలకు నీటి విడుదల

ఈనాడు, బెంగళూరు: ఖరీఫ్ సాగు కోసం తుంగభద్ర నీటిని వచ్చే నెల ఒకటో తేదీ నుంచి విడుదల చేయనున్నట్లు కర్ణాటక కార్మికశాఖ మంత్రి సంతోశ్‌లాడ్ వెల్లడించారు. బెంగళూరులో మంగళవారం నిర్వహించిన జలాశయం సాగునీటి సంప్రదింపుల సమితి సమావేశానంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబరు ఒకటి నుంచి 15 వరకూ కుడి, ఎడమ గట్టు కాల్వలకు 15 రోజుల పాటు 2800 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తారు. ఆ తర్వాత సెప్టెంబరు 30 వరకూ 3500 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేయాలని తీర్మానించినట్లు సంతోశ్‌లాడ్ తెలిపారు.

చంద్రన్న బీమాకు కొత్తరూపు!

- **సహజ మరణానికి పరిహారం రూ.2 లక్షలకు పెంపు**
- **2.20 కోట్ల మందికి ప్రయోజనం కల్పించేలా చర్యలు**


ఈనాడు – అమరావతి

చంద్రన్న బీమాలో మార్పులకు రంగం సిద్ధమవుతోంది. ఈ పథకం ప్రారంభించి ఏడాదవుతున్న సందర్భంగా క్షేత్రస్థాయి అనుభవాలను పరిగణనలోకి తీసుకుని కార్మికులకు అదనంగా లబ్ధి చేకూర్చేలా కొన్ని మార్పులు ప్రతిపాదించారు. వీటిలో రెండు మార్పులు కీలకంగా కనిపిస్తున్నాయి. ఒకటి... సహజ మరణానికి పరిహారం రూ.2 లక్షల వరకు పెంచడం. రెండు... పాక్షికంగా వైకల్యం సంభవిస్తే పరిహారాన్ని రూ.3.62 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు తగ్గించడం. గతంలో ఈ పథకంలో చేరకుండా ఉండిపోయిన వారికి ఈ ఏడాది అవకాశం కల్పించనున్నారు.

తాజా మార్పులు...

- చంద్రన్న బీమాను రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్యాకేజీగా సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న జీవన్‌జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ఆమ్ ఆద్మీ బీమా యోజన పథకాలను కలిపి రాష్ట్రంలో కార్మికులకు ఎక్కువ మొత్తంలో ప్రయోజనం కల్పించేలా చంద్రన్న బీమాను రూపొందించారు.
- కార్మికులకు సహజ మరణం సంభవిస్తే ఇప్పటివరకు ఇది రూ.30 వేలు మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు రూ.2 లక్షల పరిహారం అందుతుంది. 50 ఏళ్ల వరకు వయసు ఉండి, సహజ మరణం సంభవిస్తేనే ఇంత మొత్తం ఇస్తారు. 51 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు సహజ మరణానికి రూ.30వేలే పరిహారంగా అందిస్తారు. 60ఏళ్ల తర్వాత సహజమరణానికి ఏ పరిహారమూ దక్కదు.
- ప్రమాదంలో మరణిస్తే ఏ కార్మికుని కుటుంబానికైనా రూ.5 లక్షలు పరిహారం అందుతుంది. మొదటి సంవత్సరంలోనూ ఇదే విధానం అమలు చేశారు.
- పూర్తి వైకల్యం సంభవిస్తే మునుపటిలాగానే రూ.5 లక్షల పరిహారం దక్కుతుంది. పాక్షిక వైకల్యం పొందిన కార్మికులకు రూ.2.50 లక్షల పరిహారమే అందుతుంది. కిందటి సంవత్సరం ఇది రూ.3.62 లక్షలుగా ఉండేది.
- 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న కార్మికుల కుటుంబాల్లోని పిల్లలకు రూ.1,200 ఉపకార వేతనం అందించనున్నారు.

7 లక్షల మందికి అదనంగా ప్రయోజనం



అక్టోబరు 2 నుంచి ఈ పథకం రెన్యువల్ అవుతుంది. రెండో సంవత్సరంలో మొత్తం లబ్ధిదారుల సంఖ్య మరో 7లక్షలు పెరిగి... 2.20 కోట్లకు చేరవచ్చని కార్మికశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కార్మికశాఖ వద్ద విస్తృతమైన డేటాబేస్ సిద్ధంగా ఉంది. అందులో నుంచి 70 ఏళ్లు దాటిన వారిని తొలగించి...17 ఏళ్లు నిండిన కొత్త యువతరాన్ని చేర్చాల్సి ఉంటుంది. ప్రస్తుతం 70 ఏళ్లు దాటి ఈ పథకం నుంచి బయటకు వెళ్లే వారి సంఖ్య కన్నా 17 ఏళ్లు నిండి కొత్తగా చేరే వారి సంఖ్యే ఎక్కువని అధికారులు వివరిస్తున్నారు. ఇలా మొత్తం 5 లక్షల మంది వరకు పెరుగుతారని, కిందటి సంవత్సరం వివిధ కారణాల వల్ల ఈ పథకం పరిధిలో కిరాని మరో 2 లక్షల మంది కూడా చేరతారని అంచనా వేస్తున్నారు. కార్మిక బీమా పథకాలకు ఎల్ఐసీని మాత్రమే ఏజెన్సీగా ఎంపిక చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రీమియం కింద దాదాపు రూ.320 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది దాదాపు రూ.500 కోట్ల వరకు కార్మికులకు బీమా రూపంలో దక్కినట్లు తెలిపారు.

రూ.1.20 కోట్లతో 'ధన' వినాయకుడు



గుంటూరు జిల్లా మంగళగిరిలోని పూల మార్కెట్ వద్ద మంగళవారం రాత్రి వినాయకుడి విగ్రహాన్ని రూ.1.20 కోట్ల కరెన్సీ నోట్లతో అలంకరించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘాలు, వర్తక వాణిజ్య సంఘాల ఛాంబర్ అధ్యక్షుడు, తెదేపా జిల్లా నేత సంకా బాలాజీగుప్తా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అలంకరణకుగాను రూ.రెండు వేలు, రూ.500 కరెన్సీ నోట్లను వినియోగించారు. ధన వినాయకుడిని చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. -న్యూస్‌టుడే, మంగళగిరి

రైల్వే ప్రాజెక్టుల నోడల్ అధికారిగా అర్జా శ్రీకాంత్

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేసి, సమన్వయం చేసేందుకు నోడల్ అధికారిని నియమించారు. ప్రస్తుతం దిల్లీలోని ఏపీ భవన్‌లో అదనపు కమిషనర్‌గా ఉన్న అర్జా శ్రీకాంత్‌కే ఆ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రవాణ, ఆర్ అండ్ బీ శాఖల ముఖ్యకార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐఆర్‌టీఎస్ అధికారి అయిన శ్రీకాంత్ రైల్వేలో సీనియర్ అధికారిగా పలు బాధ్యతలు నిర్వర్తించారు. విజయవాడ, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్ డివిజన్లలో పని చేసిన అనుభవం ఉంది.

నగల వ్యాపారిని మోసగించి దోపిడీ..

- 3 కిలోల బంగారంతో పరారీ
- విశాఖలో ఘటన

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ నగర పరిధిలో ఓ నగల వ్యాపారిని బెదిరించి సుమారు రూ.90 లక్షల విలువైన మూడు కేజీల బంగారు నగలు దోపిడీ చేసి ఎత్తుకుపోయారు. ఒడిశాలోని గుమడ ప్రాంతానికి చెందిన బల్లా వెంకటరమణ గుంటూరు జిల్లా మంగళగిరిలో బంగారు నగల వ్యాపారం చేస్తూ రాష్ట్రంలోని పలుప్రాంతాలకు నగలు సరఫరా చేస్తుంటారు. వెండి వస్తువులు సరఫరా చేసే వ్యాపారి రాకేష్‌లల్లూతో పరిచయం ఏర్పడింది. ఇటీవల మంగళగిరిలో వెంకటరమణను కలిసి బంగారం వ్యాపారం ఆరంభిస్తానని రాకేష్ నమ్మబలికాడు. మూడు కిలోల బంగారు వస్తువులు సిద్ధం చేసి విశాఖలో అందజేస్తే నగదు జమ చేస్తానన్నాడు. రాకేష్ కోరిన వస్తువులను వెంకటరమణ తయారు చేయించి మంగళవారం విశాఖకు తీసుకువచ్చారు. పీఎంపాలెంలోని తన నివాసంలో అందించాలని అక్కడే నగదు సిద్ధంగా ఉందని రాకేష్ లల్లూ నమ్మబలికాడు. మధ్యాహ్నం అక్కడికి చేరుకున్న వెంకటరమణ ఇంట్లోకి ప్రవేశించిన తర్వాత వ్యాపారి నగలు బయటకు తీయగానే ముందుగా ఏర్పాటు చేసిన నలుగురు వ్యక్తుల రాజస్థాన్‌కు చెందిన ముఠా పిస్తోలు, చాకు చూపించి చంపేస్తామని బెదిరించి నగలతో అక్కడి నుంచి ఉడాయించారు. బాధితుడి కేకలు విని ఇంటి యజమాని, తదితరులు తలుపులు తెరిచారు. బాధితుడు వెంకటరమణ ఫిర్యాదు మేరకు దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఈనాడు

చరిత్రాత్మక విజయం!

యుద్ధం చెయ్యకుండా శత్రువు మెడలు వంచడమే అద్భుతమైన యుద్ధకళ- క్రీస్తుపూర్వం అయిదో శతాబ్దానికి చెందిన చైనా యోధుడు, సమర వ్యూహ విశారదుడు సున్ జు చెప్పిన మాట అది. చైనా, భూటాన్, ఇండియా సరిహద్దుల మధ్య డోక్లామ్ త్రికూడలి చెంత ఏకపక్షంగా రహదారి నిర్మాణానికి, తద్వారా ఉద్రిక్తతల ప్రజ్వలనానికి కారణమైన బీజింగ్ విషయంలో మోదీ ప్రభుత్వం ఆ యుద్ధకళనే ప్రదర్శించింది. ప్రబల ఆర్థిక సైనికశక్తిగా తాను ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనుకొన్న చైనా అధినాయక గణానికి తత్వం బోధపడేలా- వివాదాస్పద ప్రాంతంపై మడమ తిప్పేది లేదని భీష్మించడంతోపాటు, దౌత్యపరమైన ఒత్తిళ్లతో బీజింగ్ మెత్తబడేలా చెయ్యడంలో మోదీ సర్కారు అభినివేశం సంస్తుతిపాత్రమైనది. జూన్ 16న రహదారి నిర్మాణ వస్తుసామగ్రితో డోక్లామ్‌లో దిగబడిన చైనా, పది వారాలుగా సమర సింహనాదాలతో వాతావరణాన్ని ఉద్రిక్తభరితం చేసింది. బేషరతుగా భారత్ బలగాలు వెనుతిరగకుంటే 1962నాటి యుద్ధానుభవాలు పునరావృతమవుతాయనీ హెచ్చరించింది. భారత్ సరిహద్దులకు సమీపాన టిబెట్ పర్వత పీఠభూమిలో చైనా సైన్యం యుద్ధవిన్యాసాలూ నిర్వహించింది! అలాంటి చైనా- 'చారిత్రక ఒడంబడికలకు అనుగుణంగా ప్రాదేశిక సమగ్రతను కాపాడుకొంటూ సార్వభౌమత్వ పరిరక్షణను కొనసాగిస్తాం' అన్న ప్రకటనతో ఉద్రిక్తతల్ని ఉపశమింపజేసేలా తక్షణ చర్యలు తీసుకోవడం విశేషం. వివాదాస్పద పరగణాలో దశాబ్దాలుగా చైనా దళాల గస్తీ- ఇండియా, భూటాన్లకు నిరభ్యంతరకరం! రహదారి నిర్మాణ పనుల నిలిపివేతకు హామీ ఇచ్చిన బీజింగ్ అదనపు బలగాల్ని ఉపసంహరించడంతో సిక్కిం సరిహద్దుల్లో యథాపూర్వస్థితి నెలకొన్నట్లయింది. యుద్ధోన్మాద పెడబొబ్బలతో బీజింగ్ అధికార మీడియా రెచ్చిపోతున్నప్పుడు ఎక్కడా మాట తూలకుండా సంయమనం పాటించడంలో, బీరాలు పలికి వెనక్కి తగ్గారన్న అప్రతిష్ఠ చైనా నేతాగణానికి చుట్టుకోకుండా జాగ్రత్త వహించడంలోనూ మోదీ ప్రభుత్వం కనబరచిన పరిణతి- భారత్ పెద్దరికాన్ని వేనోళ్ల చాటుతోంది!

అమెరికాను తోసిరాజని అగ్రరాజ్యాధిపత్యం కోసం విస్తరణ కాంక్షతో పావులు కదుపుతున్న చైనా- దక్షిణ చైనా సముద్రంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటం తెలిసిందే. నయానో భయానో భూటాన్‌ను దారికి తెచ్చుకొంటే, డోక్లామ్ రహదారి నిర్మాణం ద్వారా సిలిగురి కారిడార్ దాకా చొచ్చుకుపోయి భారత్ పక్కలో బల్లెంలా పాతుకుపోవచ్చునని భావించిన బీజింగ్ నేతాగణానికి తాజా పరిణామం ఏ మాత్రం మింగుడుపడనిదే! ఇండియాపై ప్రచ్ఛన్న యుద్ధాన్ని ఉధృతం చేసి, ఉగ్రవాద మిన్నాగుల్ని సరిహద్దులు దాటించి నరమేధం సాగిస్తున్న పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పడానికి మోదీ ప్రభుత్వం ఊహాతీతంగా మెరుపుదాడులు చేసింది. ఇండియా మరేమాత్రం మెతక దేశం కాదని, దెబ్బకు దెబ్బ రుచి చూపిస్తామని విస్పష్టంగా హెచ్చరించింది. మోదీ సర్కారు నెలకొల్పిన సరికొత్త సాధారణ స్థితి (న్యూ నార్మల్) అది! తన బలగాల చొరబాటు పట్ల కూడా భారత్ నుంచి అలాంటి సైనిక ప్రతిస్పందనే ఆశించి భంగపడిన బీజింగ్- కశ్మీరులోనూ చొరబడతామన్న హెచ్చరికలకూ భారత్ ప్రశాంతంగా ఉండటం, క్షేత్ర స్థాయిలో వీసమెత్తు బెసగకపోవడంతో దిక్కుతోచనిదైంది. ఇండియా నుంచి భూటాన్‌ను వేరుచేసే పబ్బం గడుపుకోవాలన్న ఎత్తుగడలు ఫలించకపోవడంతోపాటు, జి-20 దేశాలతో విడివిడిగా భారత్ 'ఆక్రమణవాదం'పై ఇచ్చిన వివరణలకు మద్దతు కొరవడింది. అదే సమయంలో డోక్లామ్‌లో చైనా ఒంటెత్తు ధోరణిని అంతర్జాతీయ సమాజం దృష్టికి తెచ్చి, జపాన్ వంటి దేశాల మద్దతు కూడగట్టిన భారత్ చొరవ, చురుకుదనం- తమ పప్పులు ఉడకవన్న నిజాన్ని షి జిన్‌పింగ్‌కు తేటతెల్లం చేశాయి. చైనా ఏలికల్లో ఈ ప్రాప్తకాలజ్ఞతకు మోదీ ప్రభుత్వ పట్టుదల, దౌత్య దురీణతలే కారణమయ్యాయి!

'రాజకీయాలనేవి రక్తరహిత యుద్ధమైతే, నెత్తురు పారించే రాజకీయాలే సమరమంటే' అని మావో జెడాంగ్ ఏనాడో తేల్చి చెప్పారు. దాదాపు పాతిక దేశాలతో సరిహద్దు వివాదాలున్న చైనా- 2012 నాటి త్రైపాక్షిక ఒప్పందాన్ని తోసిపుచ్చి డోక్లామ్‌లో పాగా వెయ్యబోవడం వెనక విస్తృత రాజకీయ వ్యూహముంది. ఐరోపా, ఆసియా అనుసంధానమంటూ 440 కోట్ల జనావళికి ఆర్థిక ప్రయోజనాలందించే పేరిట బీజింగ్ తలకెత్తుకొన్న ఒక బెల్ట్- ఒకే రోడ్డు (ఓబీఓఆర్) ప్రాజెక్టులో అంతర్భాగం కావడానికి ఇండియా భూటాన్లు ససేమిరా అన్నాయి. ఒక దెబ్బకు రెండు పిట్టలు చందంగా పని సానుకూలపరచుకొనే వ్యూహంలో భాగంగా డోక్లామ్‌లో పాగా వేసిన చైనా- ఇండియాను అష్ట దిగ్బంధం చేసే భౌగోళిక ఎత్తుగడతో ముందడుగు వేసింది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాల కూటమి (బ్రిక్స్) శిఖరాగ్రం వచ్చేవారం చైనాలోనే జరగనున్న నేపథ్యంలో- భారత్‌తో పొలిమేర పేచీ బీజింగ్ నేతాగణానికి తలవంపులు. కమ్యూనిస్టు పార్టీ 19వ మహాసభల్లో మరోసారి సర్వం సహాధినేతగా ఎన్నిక కావాలనుకొంటున్న జిన్‌పింగ్‌కు డోక్లామ్ విషమ పరీక్షగా మారడం ఇబ్బంది కలిగించేదే. అంతకుమించి ఏడాదికి 5000 కోట్ల డాలర్ల వాణిజ్య మిగులు సాధ్యపడుతున్న ఇండియాతో శత్రుత్వం కొనితెచ్చుకొంటే- కోరి కొరివితో చైనా తలగోక్కున్నట్లే! పైపెచ్చు 275 కోట్ల జనావళికి ఆవాసమైన అణ్వాయుధ శక్తి సంపన్నమైన రాజ్యాలు రెండూ యుద్ధ క్షేత్రంలో తలపడటం అన్నది ప్రపంచశాంతికే శరాఘాతం. అంతటి ముప్పును తప్పించేలా, చైనాను ఒప్పించేలా చక్కగా పని చేసింది మోదీ ప్రభుత్వ పరిణత వ్యూహం. ఈ నిశ్శబ్ద విజయం- చరిత్రాత్మకం!

వ్యక్తి స్వేచ్ఛకు 'సుప్రీం' రక్షరేకు!



డాక్టర్ ఎస్.అనంత్

భారత రాజ్యాంగం మూడో భాగంలోని 21వ అధికరణలో పొందుపరచిన ప్రాథమిక హక్కుల్లో వ్యక్తిగత గోప్యత కూడా అంతర్భాగమని సర్వోన్నత న్యాయస్థానం ఏకగ్రీవంగా చరిత్రాత్మక తీర్పునిచ్చింది. గతంలో వెలువడిన పలు తీర్పుల్లో వ్యక్తిగత గోప్యత ప్రస్తావన ఉన్నా, దాని గురించి సమగ్ర తీర్పు రావడం ఇదే మొదటిసారి. ఈ తీర్పు లోగడ ప్రాథమిక హక్కులపై సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక తీర్పుల సరసన నిలుస్తుంది. 1973నాటి కేశవానందభారతి తీర్పులో సర్వోన్నత న్యాయస్థానం ప్రాథమిక హక్కులనేవి రాజ్యాంగ మౌలిక చట్రంలో భాగమని, వాటిని పార్లమెంటు చట్టాలతో మార్చలేమని తేల్చిచెప్పింది. గోప్యతపై అది ఇచ్చిన తాజా తీర్పు ఈ పూర్వ తీర్పు అంత కీలకమైనది. గూగుల్, ఫేస్‌బుక్ వంటి సంస్థలతో ముడివడిన వ్యాజ్యాలతో సహా అనేక గోప్యతా కేసుల పరిష్కారం మీద తాజా తీర్పు ప్రభావం చూపనుంది. ప్రభుత్వంతో సహా పలు సంస్థలు తమ పరిధి దాటి పౌరుల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకొంటే పౌర ప్రయోజనాల రక్షణకు తాను ముందుకొస్తానని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సాంకేతికత విజృంభిస్తున్న ఈ రోజుల్లో కోర్టు వ్యాఖ్యలు ఎంతో ప్రాముఖ్యం సంతరించుకొన్నాయి. ప్రజాస్వామ్యాన్ని మరింత పరిపుష్టం చేసే తీర్పు ఇది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు కాదనే వాదనలోని డొల్లతనం దీంతో బట్టబయలైంది. 50-60 ఏళ్ల కిందటివారితో పోలిస్తే ఈనాటి యువతరం చదువుల్లో, నైపుణ్యాల్లో, జీవితాశయాల్లో ఎంతో ముందుంది. నేడు భారత జనాభాలో 27 ఏళ్లలోపు యువతీయువకుల వాటాయే అత్యధికం. సాంకేతిక సాధనాలు, సామాజిక మాధ్యమాలను విరివిగా వాడే ఈ తరానికి వ్యక్తిగత గోప్యత విలువ, ప్రాముఖ్యాలు బాగా తెలుసు. నేడు స్మార్ట్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తుల సమాచారాన్ని సేకరించడం వివిధ సంస్థలకు మహా సులువైపోయింది. వారి నిఘా నేత్రం నుంచి పౌరులు తమను తాము రక్షించుకోక తప్పదు. మారిన పరిస్థితులకు, మారిన తరాలకు అనువైన తీర్పును సుప్రీం కోర్టు వెలువరించి మన్ననలు అందుకొంది.

డేటా భద్రతకు చర్యలు తప్పనిసరి

మునుపెన్నడూ లేని విధంగా టెక్నాలజీ మన జీవితాలకు కేంద్ర బిందువైంది. పెద్ద నోట్ల రద్దు తరవాత డిజిటల్ చెల్లింపులు విస్తరిస్తున్న ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్ లేదా సిమ్‌ను పోగొట్టుకునే వ్యక్తి తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. ఆధార్‌ను, బ్యాంకు ఖాతాలకు అనుసంధానించి మొబైల్‌లోనే ఆర్థిక లావాదేవీలు జరిపే సౌలభ్యం ఏర్పడటం ప్రస్తుతం ఒక వరమే అయినా, రేపు శాపంగా పరిణమించవచ్చు! పాస్‌వర్డ్‌లు, తద్వారా వ్యక్తుల వివరాలను కాజేసి బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ము లాగేసే ఉదంతాలు ఈ మధ్య పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. అంతర్జాలంలో, మొబైల్ ఫోన్లలో మన లావాదేవీలు, ఇతర వ్యవహారాలు ఎప్పటికప్పుడు డిజిటల్ అడుగుజాడలను వదులుతాయి. వీటి ఆధారంగా మన సమాచారాన్ని అవాంఛనీయ శక్తులు దొంగిలించి దుర్వినియోగం చేసే వీలుంది. ఇలా జరుగుతుందనే సంగతి మనలో చాలామందికి తెలియదు. ఉదాహరణకు గూగుల్, యాహూ, ఫేస్‌బుక్, ట్విటర్ సైట్ల గోప్యతా ఒప్పందాలను మనలో ఎంతమంది చదువుతున్నాం, చదివి అర్థం చేసుకోగలుగుతున్నాం?

వ్యక్తిగత గోప్యతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉందని కొందరు భావిస్తున్నారు. అయితే గోప్యత అనేది తిరుగులేని హక్కు కాదని కోర్టు స్పష్టీకరించిన విషయం వారు మరచిపోతున్నారు. నిజానికి సర్వోన్నత న్యాయస్థానమిచ్చిన తీర్పు సమతూకంగా ఉంది. వ్యక్తుల సమాచారాన్ని తమ వ్యాపార ప్రయోజనాల కోసం ఎడాపెడా వాడేసే ప్రైవేటు రంగానికి ఇది ఓ హెచ్చరిక. వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా గుర్తిస్తే దేశ భద్రతకు ముప్పు ఏర్పడుతుందని కొందరు గగ్గోలు పెట్టడం పూర్తిగా అర్థరహితం. జాతీయ ప్రయోజనాల రక్షణ కోసం, ప్రజల భద్రత కోసం అవసరమైతే ప్రాథమిక హక్కుల మీద కొంతకాలంపాటు సహేతుక ఆంక్షలు విధించవచ్చునని రాజ్యాంగం పేర్కొంటున్న సంగతినీ వీరు విస్మరిస్తున్నారు. ఒక వ్యక్తికి ప్రాథమిక హక్కులు ఉన్నంత మాత్రాన, దాని పేరిట ఎదుటి వ్యక్తి ప్రాథమిక హక్కులను ఉల్లంఘించకూడదని మన చట్టాలు స్పష్టీకరిస్తున్నాయి. గోప్యతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ సూత్రానికి విరుద్ధం కాదు. సర్వోన్నత న్యాయస్థానమిచ్చిన తీర్పు అవినీతిపై పోరాటానికి అడ్డు తగులుతుందనే వాదనా సరికాదు. కేవలం కోర్టు తీర్పులు, చట్టాలతోనే అవినీతిని నిర్మూలించడం సాధ్యమైతే ఆ పని ఎప్పుడో జరిగి ఉండేది. ప్రజల్లో మార్పు రానంతవరకు అవినీతిని పూర్తిగా అరికట్టలేం. లంచం పుచ్చుకొనేవాడిది ఎంత తప్పో... ఇచ్చే వాడిదీ అంతకన్నా పెద్ద తప్పు.

మరీ ముఖ్యంగా ఆధార్ కార్డును సుప్రీంకోర్టు తీర్పు నిషేధించడం లేదన్న సంగతిని గమనించాలి. ఆధార్ రాజ్యాంగ బద్ధమా కాదా అనే అంశం అయిదుగురు సభ్యుల ధర్మాసనం పరిశీలనలో ఉంది. తాజా తీర్పు ప్రభావం ఆ కేసు విచారణ మీద ఏ మేరకు ఉంటుందో తెలియదు. ఏదిఏమైనా ప్రస్తుతం ఆధార్ అవసరమైన కార్యకలాపాలు యథాప్రకారం కొనసాగుతాయి. సంక్షేమ పథకాలు దుర్వినియోగం కాకుండా చూడటానికి ప్రభుత్వం వివిధ పథకాలకు ఆధార్‌ను తప్పనిసరి చేసింది. అయితే ప్రైవేటు సంస్థలు ఆధార్ వివరాలను దుర్వినియోగం చేయకుండా తప్పక జాగ్రత్త పడవలసిందే. ఆధార్, ఇంకా ఇతర సాంకేతిక మార్గాల్లో సేకరించిన సమాచారం ప్రభుత్వం కన్నా ప్రైవేటు వ్యాపారాలకే బాగా ఉపయోగపడుతున్నది. ప్రభుత్వానికీ డబ్బు ఆదా అవుతోందని అధికార వర్గాలు చెబుతున్నా కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) మాత్రం అనుకున్న దానికన్నా తక్కువ ఆదా అవుతోందని తేల్చింది.



గోప్యత హక్కుకు రాజ్యాంగం దన్ను

పరిష్కారం ఏమిటి?

కొన్ని ప్రైవేటు బ్యాంకులు ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నంబర్ల సాయంతో కొత్త ఖాతాదారులను అన్వేషిస్తున్నాయి. ఆధార్ సమాచారాన్ని పరులతో పంచుకొనేది లేదని అధికార వర్గాలు హామీ ఇచ్చినా అది నెరవేరడం లేదనడానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలి? దీని గురించి ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేడు. మరి చట్టబద్ధ మార్గాల్లో ఫిర్యాదు చేయడం తెలియని సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటి? ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పుణ్యమా అని ఇటీవలి కాలంలో వ్యక్తుల వివరాలన్నీ సమాచార నిధి(డేటా బేస్)లో చేరిపోతున్నాయి. ఈ డేటాబేస్‌లో నిక్షిప్తమయ్యే వ్యక్తుల విద్యార్హతలు, బ్యాంకు ఖాతాలు, వస్తువుల క్రయవిక్రయాలు, ప్రయాణాలు, ఆస్తుల కొనుగోళ్లు, బీమా వివరాలను ఆధునిక టెక్ సాధనాలతో విశ్లేషించి వారి స్వభావం, అలవాట్లను అర్థం చేసుకుని భవిష్యత్తులో వారు ఎలా నడచుకొంటారో అంచనా వేసే సామర్థ్యం ప్రైవేటు సంస్థలకు లభిస్తోంది. తద్వారా వారికి తమ వస్తుసేవలు అమ్ముకునే వెసులుబాటును దొరకబుచ్చుకొంటున్నాయి. వ్యక్తుల డేటాబేస్‌లను సమష్టి శ్రేయానికి ఉపయోగించుకొంటే అభ్యంతరం లేదు కానీ, ఇలా ప్రైవేటు లాభాల కోసం వినియోగించడం పూర్తిగా ఆక్షేపణీయం. ఉదాహరణకు ఒక వ్యక్తికి మధుమేహం, హృద్రోగం వంటి వ్యాధులు ఉన్నాయనుకోండి. డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులతో అతడు కొనుగోలు చేసే మందుల వివరాలు డేటా బేస్‌లో చేరిపోతాయి. ఈ వివరాలను తెలుసుకున్న బీమా కంపెనీలు సదరు వ్యకికి ఆరోగ్య బీమా, జీవిత బీమాను నిరాకరించకమానవు. ఫలానా మందులకు బాగా గిరాకీ ఉందని తెలుసుకున్న ఫార్మా కంపెనీలు సదరు ఔషధాలకు కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరలకు అమ్మి విపరీతంగా లాభాలు కళ్లజూడవచ్చు. ఇవన్నీ వ్యక్తిగత గోప్యతకు భంగకరం. కాబట్టి ఆధునిక సాంకేతికతతో సేకరించే డేటాబేస్‌ను దుర్వినియోగం చేసే అవకాశం ప్రైవేటు కంపెనీలకే ఎక్కువ. అలాగని ప్రభుత్వాలు సవ్యంగా వ్యవహరిస్తున్నాయని కాదు. ఇటీవల ఝార్ఖండ్‌లో 13 లక్షల మంది లబ్ధిదారుల ఆధార్ సంఖ్యలు, ఇతర వివరాలు బహిర్గతమయ్యాయి. అది పొరపాటున జరిగిందని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం బాధ్యులను కనిపెట్టి చర్య తీసుకోవడంలో విఫలమైంది. ఇలాంటి అవకతవకలను నిరోధించడానికి డేటా రక్షణ చట్టం తీసుకురావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

ప్రభుత్వం ఆ పని వెంటనే మొదలుపెట్టాలి. ఇతరుల గోప్యతకు భంగం కలిగించడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించాలి. సమగ్ర డేటా రక్షణ చట్టం రూపకల్పన బాధ్యతను ప్రభుత్వం ఇప్పటికే శ్రీకృష్ణ కమిషన్‌కు అప్పగించింది. 'సమంజసమైన పరిమితుల్లో గోప్యత' పరిరక్షణ అంటే ఏమిటో ఈ చట్టంలో స్పష్టంగా నిర్వచించాలి. ఒకవేళ ప్రైవేటు సంస్థలు తమ వ్యాపారాలకు వ్యక్తుల సమాచారం చాలా అవసరమని అర్జీ పెట్టుకుంటే, సదరు వ్యక్తులకు అంటే వినియోగదారులకు కొంత రుసుము చెల్లించే షరతుపై ఆ సమాచారాన్ని అందించే వెసులుబాటు కల్పించాలి. వ్యక్తుల ఆధార్, పాన్, బ్యాంకు ఖాతా, ఇతర ఆర్థిక సమాచారాన్ని కంపెనీలు సొంతం చేసుకోకూడదని, ఆ సమాచారాన్ని సొంత డేటాబేస్‌లలో నిక్షిప్తం చేసుకోకూడదని ఈ చట్టం నిర్దేశించాలి. ఈ నియమాలను ఉల్లంఘించే వ్యక్తులు, సంస్థలను శిక్షించాలి.

పరిధి విస్తృతం



తీర్పులో కోర్టు చేసిన కొన్ని వ్యాఖ్యలు సమాజాన్ని విస్తృతంగా ప్రభావితం చేస్తాయి. గతంలో ఎంపీ శర్మ, ఖరక్ సింగ్ కేసుల్లో వెలువడిన తీర్పులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వాలు పౌరుల గోప్యతను హరించడానికి పూనుకొన్నాయి. ఆ అవాంఛనీయ కోర్టునిర్ణయాలను తాజా తీర్పుతో కొట్టివేశారు. జీవించడానికి, వ్యక్తిగత స్వేచ్ఛకు పౌరులకు హక్కు ఉందని భరోసా ఇచ్చే 21వ అధికరణ పరిధిలోకి గోప్యతా హక్కు కూడా వస్తుందని సర్వోన్నత న్యాయస్థానం ఉద్ఘాటించింది. ఇల్లు, కుటుంబం, దాంపత్య జీవనం, సంతానోత్పత్తి, మాతృత్వం, పిల్లలను కనడం, విద్యాభ్యాసం సాగించడం... ఇవన్నీ పౌరుల ఆంతరంగిక వ్యవహారాలని, అవి వ్యక్తిగత గోప్యత పరిధిలోకి వస్తాయని, సదరు పౌరుడి సమ్మతి లేకుండా ఈ సమాచారాన్ని ప్రచురించే అధికారం ఎవరికీ లేదని సుప్రీంకోర్టు గతంలో తీర్పు ఇచ్చి ఉంది. తాజా తీర్పు ఈ అంశాలను పునరుద్ఘాటించింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అనుక్షణం మన జీవితాల్లోకి తొంగి చూస్తున్న ఈ రోజుల్లో ఇది విస్తృత ప్రాముఖ్యమున్న తీర్పు!

కదులుతున్న కశ్మీర్ తేనెతుట్టె

జమ్ము కశ్మీర్‌లో 35-ఏ అధికరణ వ్యవహారం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. వివిధ పార్టీలు, వేర్పాటువాద సంస్థల్లో దీనిపై సుదీర్ఘ చర్చ జరుగుతోంది. దీని చెల్లుబాటుపై దాఖలైన మూడు వ్యాజ్యాలను దీపావళి అనంతరం విచారిస్తామని న్యాయస్థానం పేర్కొన్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. రాజ్యాంగాన్ని సవరించకుండా, పార్లమెంటులో ప్రవేశపెట్టకుండా కేవలం రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఈ అధికరణను రాజ్యాంగంలో చేర్చారని, కాబట్టి దానికి చెల్లుబాటు లేదని 2014లో దిల్లీకి చెందిన 'ఉయ్ ద సిటిజన్స్' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో వాజ్యం వేసింది. 35-ఏ అధికరణ తమ పిల్లలకు ఓటుహక్కు లేకుండా చేస్తోందని పేర్కొంటూ చారువాలి ఖన్నా, డాక్టర్ సీమ రజదాన్ భార్గవ అనే ఇద్దరు కశ్మీరీ మహిళలు నెల కిందట సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయవాది అయిన డాక్టర్ ఖన్నా గతంలో జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా పనిచేశారు. కశ్మీర్‌కు పశ్చిమ పాకిస్థాన్‌నుంచి వలస వచ్చిన శరణార్థులు తాము 35-ఏ వల్ల నష్టపోతున్నామంటూ మరో వ్యాజ్యం వేశారు. ఇది విచక్షణపూరితమైనదని కక్షిదారులు వాదిస్తున్నారు. జమ్ము కశ్మీర్‌లో సుమారు ఏడుశాతం మేర పాక్‌నుంచి వచ్చి స్థిరపడిన శరణార్థులు ఉన్నారని, వారంతా ఆ రాష్ట్రంలో ద్వితీయశ్రేణి పౌరులుగా బతుకులీడ్వాల్సి వస్తోందని, ప్రభుత్వపరంగా వారి పిల్లలూ లబ్ధి పొందేందుకు అనర్హులవుతున్నారన్న ఆవేదన వినిపిస్తోంది. ఈ వ్యాజ్యంపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టులో కేంద్రం పేర్కొన్న నేపథ్యంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ అంశాన్ని అవసరమైతే విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి నివేదిస్తామని సుప్రీం కోర్టు స్పష్టం చేయడంతో దీని ప్రాధాన్యం మరింత పెరిగింది.

రాజకీయ పక్షాల ఆగ్రహం

జమ్ము కశ్మీర్ పేరు చెప్పగానే దానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణ తొలుత గుర్తుకు వస్తుంది. నిజానికి 35-ఏ గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. నిన్నమొన్నటి వరకు అసలు ఇది ఉన్నట్లూ చాలామందికి తెలియదు. దీని చెల్లుబాటుపై వ్యాజ్యాలూ దాఖలు కావడం, రాజకీయ వర్గాల్లో వాద ప్రతివాదాలు చెలరేగడంతో ఈ అంశం ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. శాశ్వత నివాసులు అన్న పదాన్ని నిర్వచించడానికి- వారికి ప్రత్యేక హక్కులు, అధికారాలు కల్పించేందుకు రాష్ట్ర శాసనసభకు 35-ఏ అధికరణ అధికారం కల్పిస్తోంది. దీనిని 1954 మే 14న రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా రాజ్యాంగంలో చేర్చారు. దీని ప్రకారం జమ్ము కశ్మీర్‌కు చెందిన మహిళ ఆ రాష్ట్రం వెలుపలి వ్యక్తిని వివాహం చేసుకున్నట్లయితే ఆమెకు, ఆమె సంతానానికి ఆ రాష్ట్రంలో ఆస్తి హక్కులు, ఉపాధి అవకాశాలు ఉండవు. శాశ్వత నివాసులుగా గుర్తింపు పొందినవారు మాత్రమే అక్కడి కళాశాలల్లో ప్రవేశాలకు, ఉపకార వేతనాలకు, ప్రభుత్వ ఉద్యోగాలకు, ఇతరత్రా సర్కారీ సాయాలకు అర్హులు. ఆ రాష్ట్రంలో స్థిరాస్తుల కొనుగోలుకు, స్థిర నివాసానికీ వారే అర్హులు. శాశ్వత నివాసులుగా గుర్తింపు లేనివారికి ఈ హక్కులేమీ ఉండవు. అలాంటి ప్రత్యేక హక్కులు, అధికారాలు రాజ్యాంగ విరుద్ధమా, కాదా; అందులో లింగపరమైన విచక్షణ ఉందా; విధానపరమైన వైఫల్యాలేమిటి వంటి అంశాలను లోతుగా పరిశీలించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది.

విస్తృత చర్చ జరగాలన్న కేంద్రం వాదనపై కశ్మీర్‌కు చెందిన పార్టీలు మండిపడుతున్నాయి. 35-ఏ పై ఒక్క భాజపా తప్ప ఆ రాష్ట్రానికి చెందిన పార్టీలన్నీ ఒకే గొంతు వినిపిస్తున్నాయి. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే అధికార, విపక్షాలు- పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్, నేషనల్ కాన్ఫరెన్స్‌తోపాటు వేర్పాటువాద సంస్థలు సైతం గట్టిగా వ్యతిరేకించాలని నిర్ణయించాయి. ప్రభుత్వం, విపక్షాలు, వేర్పాటువాద సంస్థలు ఒకే గొంతుతో మాట్లాడటం ఇటీవల కాలంలో ఇదే తొలిసారి. వేర్పాటువాద సంస్థల నాయకులు సయ్యద్ అలీ షా గిలానీ, మిర్వాయిజ్ ఒమర్ ఫరూక్, యాసిన్ మాలిక్ ఇప్పటికే బంద్‌లతో రాష్ట్రాన్ని హోరెత్తించారు. ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ స్వయంగా నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లాను కలిసి చర్చించారు. ఈ అధికరణను తొలగిస్తే కశ్మీర్‌లో త్రివర్ణ పతాకాన్ని మోసే వారు కూడా ఉండరని కిందటి నెల 29న దిల్లీలో జరిగిన ఓ సదస్సులో మాట్లాడుతూ ఆమె హెచ్చరిక స్వరం వినిపించారు. రాష్ట్రంలో భాజపాతో కలిసి ఆమె సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న విషయం ఇక్కడ గమనార్హం. 35-ఏను కొనసాగించాలని పీడీపీ కోరుతుండగా, మిత్రపక్షం భాజపా మాత్రం దానిపై విస్తృతచర్చ జరగాలని భావిస్తోంది. 2015లో రాష్ట్రంలో పీడీపీ-భాజపా సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ 370 అధికరణపై యథాతథ స్థితిని కొనసాగించాలని నిర్ణయించాయి. ఇక ఫరూక్ మరో అడుగు ముందుకేశారు. కేంద్రం తన విధానాన్ని మార్చుకోకపోతే 2008నాటి అమర్‌నాథ్ తరహా ఘటనలు పునరావృతమవుతాయని హెచ్చరించారు. అప్పటి ఘటనలో సుమారు 70మంది హతులయ్యారు. పీసీసీ అధ్యక్షుడు గులాం అహ్మద్ మీర్‌తో పాటు ఇతర చిన్నాచితకా పార్టీలు సైతం వీరికి మద్దతుగా నిలిచాయి. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారని మెహబూబా ముఫ్తీ చెబుతున్నా విశ్వసించలేకపోతున్నామని ఆయా పార్టీలు అంటున్నాయి. 35-ఏ రద్దు అంటే కశ్మీర్ విలీనాన్ని ప్రశ్నించడమేనని ఆ పార్టీలు వ్యాఖ్యానిస్తున్నాయి. 35-ఏ రద్దుకు పూనుకొంటే దాని ప్రభావం 370 అధికరణపైనా పడుతుందని హెచ్చరిస్తున్నాయి. ఏదో ఒకరోజు దాన్నీ రద్దు చేసేందుకు కేంద్రం పావులు కదుపుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



35-ఏ అధికరణపై వివాదం

సర్కారు తర్జనభర్జనలు

నిజానికి 35-ఏ అధికరణ రాజ్యాంగం ఆమోదించిన జమ్ము కశ్మీర్ స్వయం ప్రతిపత్తికి సంబంధించిన 370 అధికరణకు అనుబంధమే తప్ప మరొకటి కాదనీ వాదిస్తున్నాయి. అధికారం కోసమే మెహబూబా కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, కేంద్రంపై గట్టి ఒత్తిడి తీసుకురావడం లేదని విపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. అయితే మెహబూబా కూడా గట్టి పట్టుదలతో ఉన్నారు. రాజకీయంగా ఇది తనకు జీవన్మరణ సమస్య అని భావిస్తున్నారు. కేంద్రాన్ని ఒప్పించలేకపోయినా లేదా కోర్టు తీర్పు వ్యతిరేకంగా వచ్చినా రాజీనామా తప్ప మరో గత్యంతరం లేదని ఆమె భావిస్తున్నారు. అందుకే ప్రజల మద్దతు సమీకరించడంతో పాటు న్యాయపోరాటం చేయాలని భావిస్తున్నారు. ఆ క్రమంలో ఫాలీ నారిమన్ వంటి ఉద్ధండులతో సంప్రతింపులు జరిపేందుకూ సిద్ధపడుతున్నారు. భాజపా రహస్య అజెండాలో భాగంగానే ఈ విషయం ఒక్కసారిగా తెరపైకి వచ్చిందని విపక్షాలు వాదిస్తున్నాయి. మొదటినుంచీ 370 అధికరణను వ్యతిరేకిస్తున్న భాజపా సంకీర్ణ ప్రభుత్వ భాగస్వామిగా దాని జోలికి పోకుండా, తొలుత 35-ఏ పై దృష్టి పెట్టిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. 35-ఏని రద్దు చేసినట్లయితే దాని ప్రభావం 370 అధికరణపై పడుతుందని భాజపాయేతర పార్టీలు భావిస్తున్నాయి. 35-ఏపై విస్తృత చర్చ జరగాలన్న అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ అభిప్రాయంలో అంతరార్థమూ ఇదేనని ప్రతిపక్షాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

35-ఏ అధికరణ వ్యతిరేకుల వాదన మరో రకంగా ఉంది. రాజ్యాంగంలోకి ఒక కొత్త అధికరణాన్ని చేర్చేందుకు అవసరమైన విధి విధానాలను 368 అధికరణ నిర్దేశిస్తోంది. దాన్ని విస్మరించి, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా, రాజ్యాంగ సవరణ లేకుండా, ఆనాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుట్టుచప్పుడు కాకుండా రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా 35-ఏని రాజ్యాంగంలోకి చేర్చాయన్నది మరో వాదన. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో 370, 35-ఏ అధికరణలు రూపుదిద్దుకున్నాయని, అంతమాత్రాన వాటిని ఎల్లకాలం కొనసాగించాలనడం అర్థరహితమన్నది వారి అభిప్రాయం. ఇరువైపు వాదనలూ బలంగా వినబడుతున్నా, ఈ అంశం ప్రజల భావోద్వేగాలతోనూ ముడివడి ఉంది. ఇలాంటి విషయాల్లో చర్చలు, సంప్రతింపుల ద్వారా ఇరు పక్షాలూ ఓ సహేతుక నిర్ణయానికి రావాలి. న్యాయస్థానాల పాత్ర పెద్దగా ఉండదు. కీలక సరిహద్దు రాష్ట్రానికి సంబంధించి విషయంలో ఆచితూచి అడుగేయడం అవసరం!

– గోపరాజు మల్లపరాజు

ధర్మనిరతి

సీతాదేవి నారీ శిరోమణి. ఆమె వ్యక్తిత్వం, త్యాగం, నమ్రత, ధర్మపరాయణత, శాంతి గుణాల గురించి రామాయణ కర్త వాల్మీకి వివరించాడు. దశరథుడి ఆనతి తలదాల్చిన శ్రీరాముడు అడవులకు వెళ్లడానికి సంసిద్ధుడవుతాడు. తన తల్లి కైకేయికి తండ్రి ఇచ్చిన రెండు వరాల వివరాల్ని సీతకు చెబుతాడు.

అడవులకు తానూ వస్తానని, ఎటువంటి భోగభాగ్యాలూ భవనాలు తనకు వద్దని, భర్త లేనిదే తాను లేనని సీత అంటుంది. 'మీ సన్నిధే నాకు పెన్నిధి' అంటూ విలపిస్తుంది. భర్తను అనుసరించి అరణ్యాలకు వెళుతుంది. అదే సందర్భంలో అత్త కౌసల్యతో మాట్లాడుతూ- భర్తతో తనకు గల అనుబంధాన్ని ఆమె 'చంద్రుడు-వెన్నెల' బంధంగా వర్ణిస్తుంది. 'తంత్రి లేకుండా వీణ ఉండదు. చక్రాలు లేనిదే రథం కదలదు' అని పోలుస్తుంది. రాముడే తన పాలిట దైవమని ముకుళిత హస్తాలతో చాటుతుంది. అదీ సీతాదేవి పతిభక్తి.

వనవాస సమయంలోనూ సీత అనుక్షణమూ రాముడి సేవలో గడుపుతుంది. భర్తతో పాటు చిత్రకూటం నుంచి పంచవటికి వెళ్లేటప్పుడు, మార్గమధ్యంలో అత్రి మహాముని ఆశ్రమాన్ని సందర్శిస్తుంది. అక్కడ అనసూయాదేవి ఆమెకు దాంపత్య ధర్మాల గురించి ఉపదేశిస్తుంది. తన భర్త ఘన వ్యక్తిత్వంతో స్తుతిపాత్రుడయ్యాడని, ఆయన కారుణ్యాది సకల గుణ సమన్వితుడని సీత కీర్తిస్తుంది. శ్రీరామచంద్రుడు ధర్మంపైనే మనసు నిలిపినవాడని శ్లాఘిస్తుంది. భార్య కర్తవ్య పాలనకు సంబంధించి కౌసల్య చేసిన ఉపదేశం తన హృదయంలో నిలిచిపోయిందని చెబుతుంది. వివాహ సమయంలో తన జనని బోధించిన వాటినీ సీత జ్ఞాపకం చేసుకుంటుంది. అదీ ఆమె ధర్మనిరతి.

పరాక్రమశాలి అయిన రావణుడిని చూసి దేవతలు సైతం భయపడేవారు. అతడితో సీత నిర్భయంగా మాట్లాడటం- ఆమె వ్యక్తిత్వాన్ని ఎంతో ఇనుమడింపజేసింది. ఎటువంటి ప్రలోభానికీ లొంగలేదు. భయానికి లోను కాలేదు. ఆపద కలిగినా చలించలేదు. ఆమె తన ధర్మాన్ని తాను ఏనాడూ విస్మరించలేదు. త్యజించలేదు. అదీ సీత ధీరత్వం.

అశోక వనంలో సీతను ఉంచిన రావణుడు అనేక ఎత్తుగడలకు పాల్పడ్డాడు. ఆమెను భయపెట్టాలని శతవిధాల ప్రయత్నించాడు. అణువైనా చలించని ఆమె, కడదాకా స్వధర్మాన్ని నమ్మింది. దృఢంగా నిలిచింది.



అంతర్యామి

రావణుడిని తిరస్కరిస్తూనే వచ్చింది. ఏ విధమైన జంకునూ సీత తన మనసులోకి రానివ్వలేదు. అదీ ఆమె నిర్మలమైన, ధర్మ పరిపూర్ణమైన హృదయం. ధర్మబలం మీద సీతాదేవికి పూర్తి విశ్వాసం ఉంది. స్వధర్మ పాలన పైనే సర్వదా ఆమె ధ్యాస. అనంత మనోధైర్యం కలిగిన మహిళా రత్నం ఆమె.

సీతను అశోక వనంలో హనుమంతుడు దర్శిస్తాడు. తనను రాముడి దూతగా పరిచయం చేసుకొని, ఆయన అంగుళీయకాన్ని ఆమెకు ఇస్తాడు. ఆమె పట్ల మాతృభావం కనబరుస్తాడు. సీతారాముల్ని సేవించడమే హనుమ జీవిత లక్ష్యం. అదే ఆయనకు పరమావధి. సీత పాతివ్రత్య ధర్మగుణాన్ని హనుమ వేనోళ్ల కొనియాడతాడు. అదీ ఆమె గుణసంపన్నత.

అగ్నిప్రవేశం చేసిన సీతాదేవిని అగ్నిదేవుడు తిరిగి రాముడి ఎదుట నిలుపుతాడు. ఆమె ఉదాత్తతను అగ్ని శ్లాఘించడంతో, రామచంద్రుడు ఆనందంగా స్వీకరిస్తాడు.

అయోధ్యకు తిరిగి వచ్చిన సీతాదేవి- పెద్దలతో పాటు అక్కడి వృద్ధ స్త్రీలు, అత్తమామల చరణాలకు ప్రణామాలు చేస్తుంది. అందరినీ సమభావంతో సేవిస్తుంది.

అశ్వమేధ యాగ సమయంలో, కుశలవులు చేసిన రామాయణ గానాన్ని రాముడు వింటాడు. తన పుత్రులుగా గ్రహిస్తాడు. సీత అక్కడికి వచ్చిన తరవాత అనేక పరిణామాలు చోటుచేసుకుంటాయి. భూదేవిని సీత ప్రార్థిస్తుంది. ఆ తల్లి దివ్య సింహాసనంపై వచ్చి ఆమెను ఒడిలోకి చేర్చుకొంటుంది. అంతటి పరమ పునీత సీత. ఆమె ధన్య చరిత!

– వి.ఎస్.ఆర్.మౌళి

మేము సైతం...

పౌరాణిక, చారిత్రక ప్రాధాన్యం ఉన్న 'అమరావతి' పేరు పెట్టుకుని.. ఆ కీర్తిని మరో వెయ్యేళ్లు అజరామరంగా నిలిపే స్థాయిలో భవ్యమైన ఆధునిక రాజధాని నిర్మాణానికి సిద్ధమవుతున్న వేళ.. సహకారం అందించడానికి మేము సైతం అంటూ పదులకొద్దీ ప్రముఖ దేశాలు పోటీ పడుతున్నాయి.

రాజు ముందు తమ పాండిత్యాన్ని ప్రదర్శించడానికి పోటీపడే కవుల్లా.. దేవతల రాజు దేవేంద్రుడి రాజధాని 'అమరావతి' పేరు పెట్టుకున్న ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణంలో, నిర్వహణలో తమ ప్రతిభను చూపడానికి అంతర్జాతీయ సంస్థలు పోటీ పడుతున్నాయి.

నిన్న మొన్నటి వరకు గుంటూరు జిల్లాలో చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఒక ఊరైన 'అమరావతి' నేడు యావత్ ప్రపంచం దృష్టిని ఆకరిస్తోంది. నిర్మాణ, మౌలిక వసతులు, ప్రణాళికల రంగాల్లో అగ్రగామి అంతర్జాతీయ సంస్థల్ని నేడు రా రమ్మని ఊరిస్తోంది.

217 చ.కి.మీ. పరిధిలో నిర్మిస్తున్న ఈ నూతన నగరంలో ఏదో ఒక రూపంలో పాలు పంచుకునేందుకు, పెట్టుబడులు పెట్టేందుకు, సాంకేతిక, ఆర్థిక సహకారం అందించేందుకు సింగపూర్, జపాన్, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, చైనా ఇలా పలు దేశాలు, అక్కడి సంస్థలు ప్రణాళికలతో ముందుకు వస్తున్నాయి. ఈ దేశాల బృందాలు ఇప్పటికే అమరావతిలో పర్యటించాయి. కొన్ని దేశాలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలూ చేసుకున్నాయి.

స్క్రిప్ట్ పక్కాగా సిద్ధమైతే సగం సినిమా పూర్తయినట్టే అని సినీ పండితులు చెబుతారు. నిర్మాణానికి కూడా అంతే. ఈ నేపథ్యంలో రాజధాని నిర్మాణంలో పలు అంశాలపై అనేక దేశాలు అందిస్తున్న వివిధ ప్రణాళికలపై ప్రత్యేక కథనం..

- **అజరామర అమరావతి నిర్మాణానికి పదుల సంఖ్యలో దేశాలు ● అవకాశాలు అందిపుచ్చుకునేందుకు పోటీ**
- **పెట్టుబడులు, సాంకేతిక సహకారానికి ఆసక్తి ● కార్యాచరణ ప్రారంభించిన పలు సంస్థలు**



సింగపూర్ గురించి చెప్పేదేముంది..



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తర్వాత అమరావతి ప్రాజెక్టులో ఎక్కువ పాత్ర పోషిస్తోంది సింగపూరే. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలోనే సింగపూర్ లాంటి నగరాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే ఆ దేశానికి కీలక బాధ్యతలు అప్పగించారు. అమరావతి నగరం, కేంద్ర రాజధాని ప్రాంతం, మొత్తం రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ)కు వ్యూహ ప్రణాళికను సింగపూర్ సంస్థలే రూపొందించాయి.

- అమరావతిలో 1691 ఎకరాల్లో అంకుర ప్రాంత అభివృద్ధికి ప్రధాన అభివృద్ధిదారుగా సింగపూర్‌కి చెందిన అసెండాస్-సింగ్‌బ్రిడ్జి, సెంబ్‌కార్ప్ సంస్థల కూటమి ఎంపికమైంది.
- ఆంధ్రప్రదేశ్, అమరావతి అభివృద్ధికి సింగపూర్ సహకారానికి సంబంధించి రెండు ప్రభుత్వాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దీని అమలు పర్యవేక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు, సింగపూర్ మంత్రి ఈశ్వరన్ సారథ్యంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటైంది.
- సీఆర్‌డీఏ ప్రాంతంలో పరిశ్రమల అభివృద్ధికి 'క్యాపిటల్ రీజియన్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రమోషన్ ఏజెన్సీ' ఏర్పాటుకు సింగపూర్ ముందుకు వచ్చింది.
- తమ దేశానికి చెందిన 'సెంటర్ ఫర్ లివబుల్ సిటీస్' సంస్థ ద్వారా అమరావతిలో భూ నిర్వహణ, నగర నిర్వహణ ప్రణాళికల రూపకల్పనలో సింగపూర్ ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది.

జపాన్ రవాణా ప్రణాళిక



అమరావతిపై మొదటి నుంచి ఆసక్తి కనబరుస్తున్న దేశాల్లో జపాన్ ఒకటి. మొత్తం సీఆర్‌డీఏ ప్రాంతానికి సమగ్ర ట్రాఫిక్, రవాణా అధ్యయనాన్ని జపాన్ చేపట్టింది. రెండేళ్లలో ఇది పూర్తవుతుంది.

- సీఆర్‌డీఏ పరిధిలోని వివిధ పట్టణ ప్రాంతాల్ని రాజధానితో అనుసంధానం చేయడం, వాటి మధ్య పరస్పర అనుసంధానానికి చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేస్తుంది.
- రాజధాని మొత్తానికి సమాచార ప్రసార సాంకేతిక పరిజ్ఞానం (ఐసీటీ) నెట్‌వర్క్ ప్రణాళిక రూపకల్పనకు ముందుకు వచ్చింది.
- అమరావతిలో క్రీడా, ఎలక్ట్రానిక్ నగరాల అభివృద్ధిలో భాగస్వామ్యానికి జపాన్ ఆసక్తిగా ఉంది. 2020 ఒలింపిక్స్ నిర్వహిస్తున్న అనుభవంతో రాజధానిలో క్రీడా నగరాన్ని అభివృద్ధి చేస్తామని జపాన్ ప్రతిపాదించింది.
- ఆంధ్రప్రదేశ్, జపాన్ మధ్య సహకారానికి అక్కడి మినిస్ట్రీ ఆఫ్ ల్యాండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ట్రాన్స్‌పోర్టు (ఎంఎల్‌ఐటీ)తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది.
- రాజధానిలో ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందించేందుకు జపాన్‌కు చెందిన జైకా, జేబిక్ వంటి సంస్థలు ఆసక్తిగా ఉన్నాయి.
- తాగునీరు, మురుగునీటి శుద్ధి, విపత్తుల నుంచి రక్షణ, డేటా కేంద్రాల నిర్వహణలో ప్రాజెక్టులు చేపట్టేందుకు జపాన్ సిద్ధంగా ఉంది.

స్టేడియం నిర్మాణానికి బ్రిటన్ ఆసక్తి



అమరావతి, ఆంధ్రప్రదేశ్‌తో సహకారానికి బ్రిటన్ రెండు విభాగాలను ఏర్పాటు చేసింది. అమరావతిలో వాణిజ్యం, పెట్టుబడుల ప్రోత్సాహానికి అవసరమైన సమావేశాలు, రహదారి ప్రదర్శనల నిర్వహణ వంటి కార్యక్రమాల్ని ఒక విభాగం చూస్తుంది. అమరావతిలో మౌలిక వసతుల అభివృద్ధి, ఆకర్షణీయ నగరంగా తీర్చిదిద్దేందుకు సహకారం అందించేందుకు మరో విభాగం కృషి చేస్తోంది.

- అమరావతిలో అంతర్జాతీయ స్థాయి స్టేడియం నిర్మాణానికి బ్రిటన్ ముందుకు వచ్చింది.
- వివిధ అంశాలపై అధ్యయనానికి నిధులిచ్చేందుకు బ్రిటన్‌కు చెందిన అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (డీఎఫ్‌ఐడీ) ఆసక్తిగా ఉంది.
- తాగునీరు, మురుగునీటి పారుదల వ్యవస్థ, ప్రైవేటు పెట్టుబడిదారులను ఆకర్షించడం, వాతావరణ మార్పులు, ఆకర్షణీయ నగరాల నాయకత్వం, నవకల్పన సంస్థల ఏర్పాటు తదితర అంశాల్లో బ్రిటన్ సహకరించనుంది.
- రాజధానిలో భూగర్భ జలవనరులు, కృష్ణా నది పరీవాహక ప్రాంతం గతంలో ఎలా ఉండేది, రాబోయే కొన్నేళ్లలో ఎలా మారనుంది వంటి అంశాలపై బ్రిటన్‌కు చెందిన బ్రిటిష్ జియోలాజికల్ సర్వే సంస్థ అధ్యయనం చేయనుంది. ఆ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది.
- పరిపాలన నగరం బృహత్ ప్రణాళిక, శాసన సభ, హైకోర్టు భవనాల ఆకృతులు రూపొందిస్తోంది కూడా బ్రిటన్‌కు చెందిన నార్మన్ ఫోస్టర్-పార్టనర్స్ సంస్థే.

మౌలిక వసతుల ప్రణాళికలో చైనా పాత్ర



రాజధాని ప్రాథమిక ప్రణాళిక దశ నుంచి చైనా ఆసక్తి కనబరిచింది. రాజధానిలో కీలకమైన మౌలిక వసతుల ప్రణాళిక రూపకల్పనలో చైనాకు చెందిన గుజౌ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్స్ కార్పొరేషన్ (జీఐఐసీ) కీలక పాత్ర పోషించింది. ఆర్వీ అసోసియేట్స్‌తో కలిసి ఆ సంస్థ ప్రణాళిక రూపొందించింది. గుజౌ, అమరావతి మధ్య సోదర నగర సహకారానికి ఒప్పందం జరిగింది.

జల నిర్వహణలో ఆస్ట్రేలియా సాయం

జలవనరుల సుస్థిర నిర్వహణలో సాయపడేందుకు ఆస్ట్రేలియా ముందుకు వచ్చింది. ఆస్ట్రేలియాతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. అమరావతిలో నివాస భవనాల నుంచి వచ్చే వ్యర్థ జలాల్ని అక్కడే శుద్ధి చేసి పునర్వినియోగానికి అనుగుణంగా మార్చే ప్రాజెక్టుకు 'కోపరేటివ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ వాటర్ సెన్సిటివ్ సిటీస్' (సీఆర్‌సీ) సంస్థ సాంకేతిక సహకారం అందిస్తుంది. ఆ సంస్థతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు చేపడుతోంది.



ఇంధన రంగంలో జర్మనీ ఆసక్తి

రాజధానిలో ఇంధన, రవాణా రంగాల అభివృద్ధికి నిధులు సమకూర్చేందుకు ఆ దేశానికి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ ఆసక్తిగా ఉంది. విజయవాడలో లైట్ రైల్ రవాణా వ్యవస్థపై ఈ సంస్థ అధ్యయనం చేసింది.

ఆకర్షణీయ అమరావతికి ఫ్రాన్స్ తోడ్పాటు

అమరావతిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సహకారం అందించేందుకు ఫ్రాన్స్ ముందుకు వచ్చింది. అమెరికాలోని వివిధ ఫ్రెంచి కంపెనీల ప్రతినిధులు ఇటీవల అమరావతిని సందర్శించారు. వారిలో సలహాదారులు (కన్సల్టెంట్), గుత్తేదారులు, సాంకేతిక సహాయం అందించేవారు ఉన్నారు. ఫ్రాన్స్‌లోని మార్సిలే నగరంతో అమరావతికి సోదర నగర ఒప్పందం ఉంది. అమరావతిలో రవాణా ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు అక్కడి సంస్థలు ఆసక్తిగా ఉన్నాయి.



మరికొన్ని దేశాలు..

కెనడా: రాజధానిలో రహదారులు, మౌలిక వసతుల ప్రాజెక్టులకు అవసరమైన పరికరాల సరఫరా, ఇంధన ప్రాజెక్టులు, ఎలక్ట్రిక్ వాహనాల సరఫరాకు ఈ దేశం ఆసక్తి కనబరుస్తోంది.

స్విట్జర్లాండ్: ఈ దేశ బృందం ఇటీవలే అమరావతిలో పర్యటించింది. బిల్డింగ్ ఎనర్జీ ఎఫిషియంట్ ప్రాజెక్ట్ (బీప్) ద్వారా సాంకేతిక, పర్యావరణ, జల నిర్వహణలో సహకారం అందించేందుకు ముందుకు వచ్చింది.

నెదర్లాండ్స్: ఈ దేశానికి చెందిన ఆర్కాడిస్.. టాటా సంస్థతో కలిసి రాజధానికి వరద నియంత్రణ ప్రణాళిక, బ్లూ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోంది.

డెన్మార్క్: రాజధానిలో సైకిల్ ట్రాక్‌లు, మోటారు రహిత రవాణా వ్యవస్థల రూపకల్పనలో పాలు పంచుకునేందుకు ఆసక్తిగా ఉంది.

అమెరికా: ఈ దేశానికి చెందిన మెకన్సీ, సీహెచ్ 2ఎం సంస్థలు సీఆర్‌డీఏకి కీలకమైన కన్సల్టెన్సీ సర్వీసులందిస్తున్నాయి.

రష్యా: ఈ దేశ బృందం అమరావతిని సందర్శించింది. నిర్మాణంలో పాలుపంచుకోవాలన్న ఆసక్తి వ్యక్తం చేసింది.

మలేసియా: 'కెపాసిటీ బిల్డింగ్'లో సహకారానికి సిద్ధంగా ఉంది. అమరావతి ప్రణాళిక రూపకల్పన దశలో.. పుత్రజయ నగర నిర్మాణంలో తమకెదురైన అనుభవ పాఠాలను వివరించింది.



బ్యాంకు ఉద్యోగాల పరీక్ష మరింత కఠినం

- **ఎస్‌బీఐ తరహాలోనే ఐబీపీఎస్ నిర్వహణ**
- **వడపోతకు మరింత కసరత్తు**
- **సిద్ధమవుతున్న అభ్యర్థులు**

ఈనాడు - అమరావతి

ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగాల నియామక ప్రక్రియలో కఠినత్వం పెరుగుతోంది. లక్షల్లో వస్తున్న దరఖాస్తులకు తగ్గట్టే వడపోత ఉంటోంది. ప్రతి నోటిఫికేషన్‌కు ప్రశ్నల్లో కఠినత్వాన్ని పెంచుతున్నారు. ఎస్‌బీఐ ప్రొబేషనరీ అధికారుల(పీవో) మెయిన్స్ తరహాలోనే ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రొబేషనరీ అధికారుల నియామకాల ప్రధాన పరీక్షలోనూ మార్పులు చేపట్టారు. ఆంగ్లంలో వ్యాసం, లేఖారచనను నిర్ణీత సమయంలోనే పూర్తి చేయడం తదితర కీలక మార్పులు ఇందులో ఉన్నాయి. ఈ పరీక్షలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్) నిర్వహిస్తోంది. తొమ్మిది బ్యాంకుల్లో 3,562 ప్రొబేషనరీ అధికారుల ఉద్యోగాల భర్తీకి ఐబీపీఎస్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వరంగ బ్యాంకులు 20 వరకు ఉండగా ప్రస్తుతం తొమ్మిది బ్యాంకుల నుంచి వచ్చిన ఖాళీలను మాత్రమే ప్రకటించారు. ప్రాథమిక, ప్రధాన పరీక్ష నిర్వహణ, మౌఖిక పరీక్షలు జరిగేలోపు వివిధ బ్యాంకుల ఖాళీల వివరాలు అంది పోస్టులు భారీగా పెరుగుతాయని సంబంధిత వర్గాలు అంచనా వేస్తున్నాయి. కిందటేడాది ఇలాగే 8,842 ఉద్యోగాల భర్తీని మాత్రమే నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నియామకాల సమయానికి ఎక్కువ సంఖ్యలో భర్తీ చేశారు. ప్రతి ఏడాది 20 వేల నుంచి 25వేల వరకు ప్రొబేషనరీ అధికారుల పోస్టులను భర్తీ చేస్తున్నారు. ప్రాథమిక, ప్రధాన పరీక్షలు రెండింట్లోనూ కొన్ని సబ్జెక్టులు ఉమ్మడిగా ఉండడం అభ్యర్థులకు అనుకూలాంశమని శిక్షణ రంగ నిపుణుడు జీఎస్ గిరిధర్ తెలిపారు. ప్రధాన పరీక్ష లక్ష్యంతోనే సిద్ధమవడం కలిసి వస్తుందని పేర్కొంటున్నారు.

నియామకాలపై అభ్యర్థుల దృష్టి

పల్లె స్థాయికి బ్యాంకు శాఖలు విస్తరించినందున ఉద్యోగాలూ పెరిగాయి. ప్రతి ఏడాది భర్తీ చేసే ఉద్యోగాల క్యాలెండర్‌ను జనవరిలోనే ప్రకటిస్తుండడం అభ్యర్థులకు అనుకూలమవుతోంది. క్లర్క్ ఉద్యోగాలకు మినహా ప్రొబేషనరీ, స్పెషలిస్టు అధికారుల నియామకాలకు మౌఖిక పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారానే ప్రిలిమ్స్, మెయిన్స్ జరుగుతున్నాయి. సిలబస్ విషయంలోనూ అవసరాల మేరకు మార్పు చేస్తున్నారు. త్వరలో క్లర్క్ ఉద్యోగాల భర్తీ ప్రకటన రానుంది. ప్రతి ఏడాది దేశవ్యాప్తంగా క్లర్క్ ఉద్యోగాలు 30 వేల నుంచి 35వేల వరకు, పీవో ఉద్యోగాలు 20వేల నుంచి 25వేలు, స్పెషలిస్టు అధికారుల ఉద్యోగాలు పదివేల నుంచి 15 వేలు, గ్రామీణ బ్యాంకుల్లో నాలుగువేల నుంచి ఐదువేల వరకు ఆయా పోస్టులను భర్తీ చేస్తున్నారు. క్లర్క్ ఉద్యోగాలకు దేశవ్యాప్తంగా 20లక్షల వరకు దరఖాస్తులు వస్తుండగా.. తెలుగు రాష్ట్రాల నుంచి నాలుగు లక్షల వరకు అందుతున్నాయి. పీవో పోస్టులకు దేశవ్యాప్తంగా 14 లక్షల నుంచి 15 లక్షలు, తెలుగురాష్ట్రాల నుంచి రెండు నుంచి మూడు లక్షల మంది వరకు దరఖాస్తు చేస్తున్నారు. మార్కెటింగ్‌తో ముడిపడిన స్పెషలిస్టు అధికారుల ఉద్యోగాలకు కూడా భారీగానే దరఖాస్తులు వస్తున్నాయి. ఏడేళ్ల కిందటి వరకు నియామకాలు ఆయా బ్యాంకుల పర్యవేక్షణలో భిన్న పద్ధతుల్లో జరిగేవి. ఐబీపీఎస్ ఏర్పడ్డాక నిర్వహిస్తున్న ఉమ్మడి పరీక్ష అభ్యర్థులకు ప్రయోజనకరంగా ఉంటోంది. ఒకే సిలబస్, ఒకే సన్నద్ధతతో సాధించిన ర్యాంకుకు అనుగుణంగా ఉద్యోగాలు పొందుతున్నారు. కొందరు విద్యార్థులు బ్యాంకు ఉద్యోగాల కోసం రెండు, మూడేళ్ల వరకు సమీప పట్టణాల్లో శిక్షణ పొందుతున్నారు.

విశాఖ 'సిట్' గడువు పెంపు!

2 నెలలపాటు పెంచే అవకాశం ● త్వరలో ఉత్తర్వులు

ఈనాడు అమరావతి: విశాఖ నగరం, పరిసర ప్రాంతాల్లో చోటు చేసుకొన్న భూ కుంభకోణాలపై విచారణకు ఏర్పాటు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) గడువు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు, ప్రైవేట్ ఆస్తులకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల్ని తారుమారు చేయడం, మాయం చేయడం లాంటి మోసాలకు పాల్పడి ఆక్రమణలు సాగించారు. ఈ కుంభకోణాలపై జూన్‌లో సీనియర్ ఐపీఎస్ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో సిట్ వేశారు. ఈ బృందం విచారణ గడువు సోమవారంతో ముగిసింది. వేల సంఖ్యలో వచ్చిన ఫిర్యాదుల్ని విచారించి చర్యలు చేపట్టాలంటే కనీసం మరో రెండు నెలలపాటు గడువు పెంచాలని సిట్ ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన దస్త్రాన్ని సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ) పరిశీలిస్తోంది. సిట్ కోరిన విధంగా గడువు పెంచే అవకాశాలున్నాయని జీఏడీ వర్గాలు తెలిపాయి. త్వరలోనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ కానున్నాయి. రికార్డుల తారుమారు, దస్త్రాలు గల్లంతు చేయడం లాంటి మోసాలపై సుమారు 3వేల ఫిర్యాదులు సిట్‌కు అందాయి. ఇందులో 300 వరకూ కీలకమైనవి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. భూ కుంభకోణాలపై మరింత లోతుగా వెళ్లాలంటే 2 నెలల గడువు పెంపు తప్పనిసరని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం కూడా గడువు పెంపుపై సానుకూలంగానే స్పందించనుందని సమాచారం.

విభిన్న ప్రతిభావంతులకు డైట్ ఛార్జీల పెంపు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 4 విభిన్న ప్రతిభావంతుల వసతిగృహాల్లోఉంటూ కళాశాల విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల డైట్ ఛార్జీలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.850లను రూ.1050 పెంచింది. ఈ మేరకు రాష్ట్ర స్త్రీ శిశు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యదర్శి కె. సునీత మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురంలో బాలుర దివ్యాంగుల వసతిగృహంలో 100 మంది, గుంటూరులోని దివ్యాంగ బాలుర వసతిగృహంలో 70 మంది, మచిలీపట్నంలోని దివ్యాంగుల వసతిగృహంలో 65 మంది, తిరుపతిలోని అంధుల హోంలో 70 మందికి ఈ నిర్ణయంతో లబ్ధి చేకూరనుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జెరూసలేం పర్యటనకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, అమరావతి : రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో పవిత్ర జెరూసలేం యాత్రను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఇన్‌ఛార్జి ఎండీ ఉషాకుమారి ప్రకటించారు. 8 రోజులు 7 రాత్రుల పాటు ఉండే ఈ పర్యటనకు ఒక్కో యాత్రికుడి నుంచి రూ.87,309లు వసూలు చేసేలా నిర్ణయించినట్లు తెలిపారు. వార్షికాదాయం రూ.3 లక్షల్లోపు ఉన్న వారికి ఈ మొత్తంలో రూ.40 వేలు, రూ.3 లక్షలపైన ఆదాయం ఉన్న వారికి రూ.20 వేలు చొప్పున క్రిస్టియన్ మైనారిటీ ఆర్థిక సంస్థ ద్వారా రాయితీగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం www.christianminorities.ap.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

కొత్తగా 4 మండలాల్లో ఆయిల్‌పామ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఇప్పటికే ఆయిల్ పామ్ సాగులో ఉన్న ప్రాంతంతోపాటు మరో నాలుగు మండలాలను కూడా ప్రభుత్వం ఎంపిక చేసింది. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి, నగరి, విజయపురం, కేవీబీపురం మండలాల్లో కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టనున్నారు. ఈ మండలాలను గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్‌కు కేటాయిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

విజయవాడలో సిటీ బస్సు దగ్ధం

- ప్రయాణికులు సురక్షితం

విజయవాడ, న్యూస్‌టుడే/ఈనాడు అమరావతి: నగరంలో మంగళవారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. సీఎన్‌జీతో నడిచే ఆర్టీసీ సిటీ బస్సులో గ్యాస్ లీకై జాతీయ రహదారిపై దగ్ధమైంది. డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులందరూ బస్సు నుంచి దిగడంతో సురక్షితంగా బయటపడ్డారు. ఉదయం 8 గంటల సమయంలో ఆటోనగర్ నుంచి రైల్వేస్టేషన్‌కు బయలుదేరిన ఈ బస్సులో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులతో సుమారు 70 మంది ప్రయాణికులున్నారు. బయలుదేరిన కాసేపటికే బస్సులో గ్యాస్ వాసన వస్తుండడంతో సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురు బస్టాపు దాటిన తర్వాత డ్రైవర్ బస్సును ఆపి ప్రయాణికులందరినీ కిందకు దించేశారు. బస్సు కింది భాగంలో లీకేజీ అవుతున్న సిలిండర్ల వద్ద పరిశీలిస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సెకన్ల వ్యవధిలో బస్సు అంతా అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి బస్సు మొత్తం దగ్ధమైంది. సిలిండర్లు పేలకుండా సిబ్బంది తగిన చర్యలు తీసుకున్నారు. ఈ ఘటన సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ రోడ్డుపై వెళుతున్న ఓ మహిళ శిరోజాలకు నిప్పురవ్వలు అంటుకోగా, వెంటనే స్థానికులు ఆర్పివేశారు.




దగ్ధమవుతున్న సిటీ బస్సు

కారణాలపై లోతైన పరిశీలన: తొమ్మిదేళ్లుగా సీఎన్‌జీ బస్సులు నడుపుతున్నా ఎప్పుడూ ఇలాంటి ప్రమాదం జరగలేదని, మొదటిసారిగా బస్సు అంతా దగ్ధమైందని ఆర్టీసీ అధికారి రామారావు చెప్పారు. నిర్వహణ లోపాలు లేవని చెబుతున్నారు. విజయవాడ నగర పరిధిలోని డిపోల్లో వందల బస్సులు సీఎన్‌జీతో నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రమాదానికి కారణాలను స్పష్టంగా గుర్తించేందుకు ఆర్టీసీ ఇంజినీరింగ్ వర్గాలు లోతైన పరిశీలన ప్రారంభించాయి. ప్రయాణ సమయంలో ఇంజిన్‌పై ఒత్తిడి పెరిగితే బరస్ట్ డిస్క్ ద్వారా గ్యాస్ విడుదలవుతుంది. ఇలాంటి పరిస్థితిలో డ్రైవర్ బస్సును ఆపి తగిన చర్యలు తీసుకుంటారు. అప్పుడప్పుడూ సీఎన్‌జీ బస్సుల విషయంలో ఇలాంటి సాంకేతిక సమస్య తలెత్తుతుంటుందని, దాన్ని సరి చేస్తుంటారని అధికారులు తెలిపారు. మంగళవారం నాటి ఘటనలో పరిస్థితి మరోలా ఉంది. గ్యాస్ లీకేజీని పసిగట్టిన డ్రైవర్ సిలిండర్లను పరిశీలించే లోగానే నిప్పు పుట్టి బస్సు కాలిపోవడం మొదలైంది. బరస్ట్ డిస్క్ దగ్గర నిప్పు ఎలా పుట్టిందనేది అధికారులకు అంతుపట్టడం లేదు. దగ్ధమైన బస్సు అశోక్ లేల్యాండ్ కంపెనీది. ప్రమాదంపై ఆర్టీసీ అధికారులు సమాచారం ఇవ్వడంతో.. సాంకేతికపరమైన లోపాలను పరిశీలించేందుకు నిపుణుల బృందాన్ని పంపిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ బృందం దగ్ధమైన బస్సును పరిశీలించనుంది.

వ్యవసాయ విద్యార్థుల డిమాండ్ సహేతుకం

- **జీవో 16ను కొనసాగించాలి**
- **జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్**

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ అధికారుల నియామకాల్లో గతంలో ఉన్న జీవో.16నే కొనసాగించాలన్న బీఎస్సీ వ్యవసాయ విద్యార్థుల డిమాండ్ సహేతుకమైనదేనని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఈ సమస్యను కేవలం రాష్ట్రంలోని 11 వ్యవసాయ కళాశాలల్లోని 3వేల మంది విద్యార్థులదిగా కాక.. లక్షలాది రైతులు, వారి కుటుంబాలకు చెందినదిగా భావిస్తున్నామన్నారు. విద్యార్థి సంఘం ప్రతినిధులు పవన్‌ను కలిసి సమస్యను వివరించారు. జీవో 16ను ఉమ్మడి రాష్ట్రంలో ఉండగా చంద్రబాబునాయుడు ప్రభుత్వమే జారీ చేసిందనీ, తెలంగాణలో ఇప్పటికీ ఇదే అమలులో ఉందని తెలిపారు. ఇటీవలి జీవో 64 వల్ల సాంకేతిక పరిజ్ఞానం లేని వాళ్లు ఏదొక సర్టిఫికెట్ సంపాదించి ఉద్యోగం చేజిక్కించుకుంటున్నారని వివరించారు.



స్పందించిన పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటిగా లేదని కొందరు చేనుకు దూరమవుతుంటే, అప్పులపాలై మరికొందరు ఆత్మహత్యలు చేసుకొంటున్నారన్నారు. ఈ దుస్థితి పోవాలంటే నిపుణులైన వ్యవసాయ అధికారుల అండ అవసరమని చెప్పారు. అలాంటి అధికారులు రావాలంటే ప్రతిభకు పట్టం కట్టాలని స్పష్టం చేశారు. మేలైన వ్యవసాయ విద్య అందాలంటే ఐసీఏఆర్ లాంటి సంస్థల అజమాయిషీ తప్పనిసరనీ, అయితే ఆ సంస్థకు చట్టబద్ధమైన అధికారం కల్పించలేదని చెప్పారు. బీసీసీఐ లాంటి సంస్థలు అనధికారికంగా ఏర్పాటైన రాజ్యమేలుతుంటే ఐసీఏఆర్‌కు ఆపాటి అధికారాలు లేకపోవడం శోచనీయమన్నారు. తప్పుడు పత్రాలతో వ్యవసాయశాఖలో ఉద్యోగాలు పొందిన వారిపై తక్షణ విచారణకు డిమాండ్ చేశారు. సమస్యకు ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించని పక్షంలో జనసేన తనవంతు పాత్రను పోషిస్తుందని స్పష్టం చేశారు.

పంచాయతీరాజ్ శాఖలో ముగ్గురు ఇన్‌ఛార్జి ఎస్ఈల నియామకం

ఈనాడు, అమరావతి: పంచాయతీరాజ్ (పీఆర్) ఇంజినీరింగ్ విభాగంలో ముగ్గురు కార్యనిర్వాహక ఇంజినీర్ల (ఈఈ)ను ఇన్‌ఛార్జి పర్యవేక్షక ఇంజినీర్లు (ఎస్ఈ)గా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. తాత్కాలిక ప్రాతిపదికన ఇన్‌ఛార్జి ఎస్ఈలుగా నియమితులైన వారిలో కె.ప్రభాకర్‌రెడ్డి, ఏవీ సుబ్రహ్మణ్యం, ఎస్.దామోదర్‌రెడ్డి ఉన్నారు.

పోలవరం వ్యర్థాల సమస్యలు పరిష్కరించండి

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా వస్తున్న వ్యర్థాలు సమీప గ్రామాల్లో డంపింగ్ చేస్తున్నారంటూ జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ)లో దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ స్వతంతర్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. డంపింగ్ ద్వారా వచ్చే సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ సీఎస్‌ను ఆదేశించింది. వ్యర్థాల డంపింగ్ వల్ల సమీప గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పిటిషనర్ ఆరోపణలు చేయడంతో ఆ సమస్య రాకుండా చూడాలని ధర్మాసనం పేర్కొంది.

ఒమన్‌లో మోసపోయిన 900 మంది భారతీయులు

శంషాబాద్,న్యూస్‌టుడే: ఒమన్ దేశంలో నాలుగు మాసాలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో 900 మంది భారతీయ కార్మికులు నరకం చూశారు. పరిస్థితి ప్రాణాల మీదకు రావడంతో మస్కట్ చిరు మెగా యూత్ ఫోర్స్ ప్రతినిధులకు సమాచారం అందించారు. వారు తెలంగాణకు చెందిన 70మంది, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 170మంది కార్మికులు ఒమన్‌లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను భారత రాయబార కార్యాలయానికి వివరించారు. ఈ క్రమంలో అధికారులు కార్మికులను స్వదేశానికి పంపేందుకు ఏర్పాట్లు చేశారు.

కేసులు ఏ దశలో ఉన్నాయో చెప్పండి

- తెలుగుదేశం ప్రజాప్రతినిధులపై కేసుల ఉపసంహరణపై హైకోర్టు ఆరా
- ఏపీ సర్కారుకు ఆదేశం..
- సెప్టెంబర్ 19కి విచారణ వాయిదా



ఈనాడు, హైదరాబాద్: ఏపీలో అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులపై నమోదైన కేసులను ఉపసంహరించుకునేందుకు జారీ చేసిన జీవోలకు సంబంధించిన కేసులు దిగువ కోర్టుల్లో ఏదశలో ఉన్నాయో తెలియజేయాలని ఏపీ సర్కారును హైకోర్టు ఆదేశించింది. జీవోలవారీగా ఎన్ని కేసులు ఉపసంహరించారు? ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? ఆ కేసుల నేరాల వివరాలు తదితరాలతో ప్రమాణపత్రం దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వచ్చే నెల 19వ తేదీకి వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈమేరకు ఆదేశించింది. ఈలోపు దిగువ కోర్టుల్లో కేసుల ఉపసంహరణ కోసం వ్యాజ్యాలు విచారణకు వస్తే వాయిదా తీసుకుంటామని అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ఇచ్చిన హామీని ధర్మాసనం నమోదుచేసింది.

తెదేపా నేతలపై నమోదైన కేసులను ఉపసంహరించుకునేందుకు వీలుగా ప్రభుత్వం వివిధ సందర్భాల్లో జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ మంగళగిరి వైకాపా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ. . ఓ మాజీ ఎమ్మెల్యేపై హత్య, అత్యాచారంలాంటి కేసులను సైతం ఉపసంహరించుకోడానికి జీవో జారీ చేశారని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. కేసుల ఉపసంహరణ కోసం పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆదేశించే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు.

వ్యాజ్యంపై ఏజీ అభ్యంతరం: మూడేళ్ల కిందటి జీవోలను సైతం పిటిషనర్ సవాలు చేశారని ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ అభ్యంతరం తెలిపారు. జీవోలన్నింటిని ఒకే పిల్ రూపంలో సవాలు చేయడానికి వీల్లేదన్నారు. అవి వివిధ సందర్భాల్లో వివిధ అంశాలకు సంబంధించిన కేసులని పేర్కొన్నారు. కేసుల ఉపసంహరణపై పిటిషనర్‌కు అభ్యంతరం ఉంటే దిగువ కోర్టులకు వెళ్లాలని సూచించారు. కేసుల ఉపసంహరణ అంశాన్ని సుప్రీంకోర్టు సైతం దిగువ న్యాయస్థానాల నిర్ణయానికి వదిలేసిందన్నారు. కేసుల ఉపసంహరణకు సంబంధించి పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆదేశించే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. జీవోలవారీగా పరిశీలించి జోక్యం కేసుకోవాలని కోరారు. ఈ వ్యాజ్యంలో అందరు ప్రతివాదులకు నోటీసులు జారీ చేయవద్దని కోరారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, జిల్లా కలెక్టర్లు, ఎస్పీల తరఫున నోటీసులు అంగీకరిస్తామని తెలిపారు. పిటిషన్ దాఖలు వెనుక పిటిషనర్‌కున్న ఉద్దేశాన్ని పరిశీలించాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. పిటిషనర్ రాజకీయంగా వైరి కావొచ్చని, వ్యవహారం కోర్టు దృష్టికి వచ్చాక తాము విచారించవచ్చని పేర్కొంది. వ్యాజ్యంలో అధికారులుగా ఉన్న ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. కేసుల స్థితిగతులపై వివరాలు సమర్పించేందుకు ఏజీ అభ్యర్థన మేరకు విచారణను వాయిదా వేసింది.

గిరిజన భాషా దినోత్సవమూ జరుపుకోవాలి

- ఏపీ మంత్రి ఆనంద్‌బాబు
- జవాబుదారీ విధానాలు అమలు చేయాలి: గమాంగ్
- హెచ్‌సీయూలో జాతీయ సదస్సు ఆరంభం



గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఆనంద్‌బాబు తదితరులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రతి ఏటా తెలుగుభాషా దినోత్సవం(ఆగస్టు 29న)తో పాటు గిరిజన భాషా దినోత్సవాన్ని కూడా జరుపుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. గిరిజన భాష, సంస్కృతి పరిరక్షణతోపాటు వారి అభ్యున్నతికి సరికొత్త విధానాలను అమలుచేయాల్సిన అవసరముందన్నారు. ఇందుకు అవసరమైన పరిశోధనలు జరగాలన్నారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్స్ ఇన్ పబ్లిక్ సిస్టమ్స్(సీఐపీఎస్), హెచ్‌సీయూ సంయుక్త ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో 'రీవిజిటింగ్ ట్రైబల్ పాలసీస్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్స్' అనే అంశంపై రెండురోజుల జాతీయ సదస్సును మంగళవారం ప్రారంభించారు. దీనికి ఆనంద్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ వంటి విశ్వవిద్యాలయాలతోపాటు పరిశోధన సంస్థలు మెరుగైన ప్రతిపాదనలు చేస్తే వాటి అమలుకు తమవంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్ మాట్లాడుతూ గిరిజనులు ఆమోదించేలా జవాబుదారీతనంతో కూడిన విధానాలను రూపొందించి అమలుచేయాల్సిన అవసరముందన్నారు. అంతకుముందు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ప్రో వీసీ ప్రొఫెసర్ బి.పి.సంజయ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి నివేదిత పి.హరన్, సీఐపీఎస్ సంచాలకురాలు డా.పద్మ, సదస్సు సమన్వయకర్త ప్రొఫెసర్ బి.వి.శర్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలల ప్రధాన ఆచార్యుల బదిలీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని మూడు వ్యవసాయ కళాశాలల ప్రధాన ఆచార్యులను, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాల సహాయ పరిశోధక సంచాలకుల(ఏడీఆర్)ను ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బదిలీ చేసింది. వర్సిటీ పరిపాలన భవన్ లాంలో పనిచేస్తున్న డాక్టరు లోకనాథరెడ్డిని బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్‌గా, బాపట్ల ఆహార శాస్త్ర సాంకేతిక (ఫుడ్ సైన్స్ టెక్నాలజీ) కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టరు విష్ణుశంకరరావును, బాపట్లలో పనిచేస్తున్న డాక్టరు రాంబాబును రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్‌గా నియమించింది. తిరుపతి పెనుమాళ్ల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టరు ఎం.సుబ్బారావును నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్‌గా, మార్టేరు పరిశోధన స్థానం శాస్త్రవేత్త కృష్ణప్రసాద్‌ను అనకాపల్లి ఏడీఆర్‌గా, నంద్యాల పరిశోధన స్థానం శాస్త్రవేత్త మునిరత్నంను మార్టేరు ప్రాంతీయ వ్యవసాయపరిశోధన స్థానం ఏడీఆర్‌గా బదిలీ చేసింది. వర్సిటీ ఉపకులపతి డాక్టరు వి.దామోదరనాయుడు మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేశారు.

ఒకే గొడుగు కిందకు భూ సంబంధ శాఖలు

తిరుపతి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు సంబంధిత శాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు ప్రత్యేక పోర్టల్‌ను ఆవిష్కరించనున్నట్లు రాష్ట్ర భూ పరిపాలనశాఖ ప్రధాన కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా చెప్పారు. మంగళవారం ఆయన తిరుపతిలో అధికారుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి సర్వే నంబరుకు చెందిన వివరాలన్నీ ఈ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. సరికొత్త సాంకేతికతతో కూడిన ఈ పోర్టల్‌ను రెవెన్యూశాఖ ఆరు నెలల్లో అందుబాటులోకి తెస్తుందని పేర్కొన్నారు. పోర్టల్‌లో రెవెన్యూ, పురపాలక, సర్వే, రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్ శాఖలు భాగస్వామ్యం అవుతాయన్నారు.

సిఫారసులపై ఎల్-1 టిక్కెట్ల జారీ నిలిపివేత

- తితిదే నివేదనకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి వీఐపీ బ్రేక్ దర్శనానికి ఎల్-1 టిక్కెట్లను ఇకపై సిఫార్సులపై కేటాయించరాదని తితిదే నిర్ణయించింది. ఈ నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా అమోదముద్ర వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తే ఆరుగురు పరిమితితో ఎల్-1 శ్రేణి కింద టిక్కెట్లను దేవస్థానం జారీ చేస్తుంది. ఈ టిక్కెట్లు పొందేవారికి శ్రీవారి దర్శన సమయంలో హారతితో పాటు తీర్థం, శఠారీ మర్యాదలు చేస్తారు. వీటిని అందుకోవడానికి ఎల్-1 టిక్కెట్ల కోసం పైరవీలు ఎక్కువయ్యాయి. వీటిని నియంత్రించడానికి తితిదేకు సాధ్యంకాని పరిస్థితిలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యను నివేదించింది. టిక్కెట్లు కేటాయింపునకు నిర్దేశించుకున్న కొలమానాన్ని వివరించింది. నివేదికను పరిశీలించిన ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో చర్చించిన అనంతరం... తితిదేకు ప్రభుత్వ నిర్ణయాన్ని ఉత్తర్వుల రూపంలో తెలిపారు. ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మినహా ఇతరులకు ఎల్-1 శ్రేణి టిక్కెట్లు జారీ చేయవద్దని, తరచూ వచ్చే ప్రముఖులను నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు అమలుకు తితిదే చర్యలు తీసుకుంది. దీంతో నిత్యం 500 వరకు ఎల్-1 టిక్కెట్లు ఇస్తుండగా వీటి సంఖ్య మంగళవారం 120 పడిపోయింది.

గరుడసేవ.. 4 చక్రాల వాహనాలకు పరిమితి

రానున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ పర్వదినాన తిరుమలకు వచ్చే నాలుగు చక్రాల వాహనాలపై పరిమితి విధించనున్నట్లు తిరుమల జేఈవో శ్రీనివాసరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. "గరుడ సేవ రోజున నాలుగు చక్రాల వాహనాలను పార్కింగ్ సామర్థ్యం మేరకు అనుమతించి, ఆ తర్వాత వచ్చే వాటిని అలిపిరిలో క్రమబద్ధీకరిస్తాం. అక్కడే పార్కింగ్ సౌకర్యం కల్పిస్తాం. అలిపిరి నుంచి ఆర్టీసీ బస్సులను నడిపి భక్తుల ప్రయాణానికి చర్యలు తీసుకుంటాం"అని వివరించారు.

సీహెచ్‌సీల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

- గిరిజనులకు చేరువగా వైద్య సేవలు
- పూనం మాలకొండయ్య వెల్లడి



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 115 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో(సీహెచ్‌సీ) పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగపడబోతున్నాయి. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి పారిశుద్ధ్య బాధ్యతల్ని టెండర్ల ద్వారా ఎంపిక చేసిన సంస్థలకు అప్పగించనున్నారు. ఈ కేంద్రాల్లో 30 నుంచి 50 పడకలు ఉన్నాయి. వీటిల్లో పొరుగుసేవల సిబ్బంది ద్వారా, ఆస్పత్రి అభివృద్ధి కమిటీల ద్వారా ప్రస్తుతం పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయి.

నూతన టెండర్ల విధానం ద్వారా బోధన, జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడ్డాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య తెలిపారు. వీటి స్ఫూర్తితో సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోనూ పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపరచేందుకు పిలిచిన టెండర్లను అనుసరించి త్వరలో సంస్థల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. వచ్చే నెలాఖరులోగా ఈ పథకం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

మరోవైపు.. గిరిజనులకు వైద్య సేవలను మరింత దగ్గర చేసే చర్యల్లో భాగంగా గిరిజన ప్రాంతాల్లో ఉన్న సుమారు 40 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలపాటు పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని పూనం మాలకొండయ్య తెలిపారు. ఈ కేంద్రాల్లో ప్రస్తుతం ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే వైద్య సేవలు అందుతున్నాయనిచెప్పారు. మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులకు సకాలంలో వైద్య సేవలు అందేందుకు మూడు చక్రాల మినీ అంబులెన్సులను కూడా సమకూరుస్తున్నామని చెప్పారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన చిన్నారుల్లో ఇప్పటివరకు కోటి మందికి ఎమ్మార్ వ్యాక్సినేషన్‌ను వేసినట్లు పూనం మాలకొండయ్య తెలిపారు.





త్రిపురాపురంలో పట్టుబడిన విలువైన రంగురాళ్లు ★ నర్సింగపాడు కొండ వద్ద లభించిన రాయి

గుంటూరు జిల్లాలో క్రిస్టల్ రాళ్ల అక్రమ తవ్వకాలు

నకరికల్లు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లాలో విలువైన రంగు రాళ్ల అక్రమ తవ్వకాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నకరికల్లు మండలం త్రిపురాపురం గ్రామంలో మంగళవారం తహశీల్దార్ ఎం.లీలాసంజీవకుమారి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి.. గడిబోయిన కొండలు అనే వ్యక్తి ఇంట్లో 300 కిలోలకు పైగా రంగురాళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇవి క్వార్జ్ నుంచి క్రిస్టల్‌గా మారిన రాళ్లుగా మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ షేక్ షరీఫ్ ప్రాథమికంగా నిర్ధారించారు. బుధవారం ఉన్నతాధికారుల సమక్షంలో పరీక్షలు నిర్వహించాక పూర్తి వివరాలు వెల్లడవుతాయని చెప్పారు. కొంతకాలంగా ఇక్కడి నర్సింగపాడు సర్వే నెంబరు 97లోని పురిబోడులో ఈ రాళ్ల తవ్వకాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. నర్సింగపాడు కేంద్రంగా నకరికల్లు, త్రిపురాపురం, చల్లగుండ్ల, నర్సింగపాడు, దాచేపల్లి సమీప శంకరపురానికి చెందిన కొందరు వ్యక్తులు సదరు రాళ్లను సేకరించి విక్రయిస్తున్నట్లు సమాచారం. మంగళవారం స్వాధీనం చేసుకున్న వాటిలో మూడు రాళ్లు రూ.10 వేలకు అమ్మకానికి ఉంచినట్లు అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్ జానీభాషా పాల్గొన్నారు.

వసుంధర




లేయర్డ్ ఫ్యాషన్...ఇప్పుడు అమ్మాయిల దుస్తుల్లో ఇదో హాటెస్ట్ ట్రెండ్. దుస్తులు ఏవైనా సరే... రెండుమూడు పొరల్లో ఒకదాని మీద మరొకటి ఉన్నట్టుగా కనిపించడమే ఈ నయా ధోరణి. ఏఏ దుస్తులకు ఈ తరహా నిండుదనం తెచ్చిపెడుతుందో... ఎవరికి నప్పుతుందో.. ఆ కిటుకులు చెప్పేస్తున్నారు డిజైనర్ దీప్తీ గణేష్.

అలల అలజడితో అందంగా!



పార్టీలకు ఈ లేయర్డ్(పొరల డిజైన్)దుస్తుల్ని ఎంచుకుంటే సౌకర్యంగా ఉండటమే కాదు కొత్తగా కనిపించేలా చేస్తాయి. ముఖ్యంగా ప్రయాణాల వేళ మరింత అనువుగా ఉంటాయి. ఈ డిజైన్‌ని ఎంపిక చేసుకోవడం వల్ల మరో ప్రత్యేకత అన్నిరకాల శరీరాకృతుల వారికి చక్కగా నప్పడమే. రెండు అంతకంటే ఎక్కువ పొరల్లో డిజైన్ చేసుకోవడం వల్ల దుస్తులు నిండుగా కనిపిస్తాయి. బాగా సన్నగా ఉండి.. కాస్త లావుగా కనిపించాలనుకునేవారికి ఇవి బాగుంటాయి. ఇలాంటివారు పొట్ట పైభాగానికి ఒంటికి అతుక్కునేలా ఉండి కిందకు వచ్చేసరికి పొరలు, పొరలుగా ఉండేలా చూసుకుంటే చాలు. లావుగా ఉండేవారికి కాస్త ఎబ్బెట్టుగా కనిపించే పొట్ట, నడుము కింది భాగాన్ని కనిపించకుండా చేసేందుకు ఈ డిజైన్ చక్కని ఎంపిక. వీటిని డిజైన్ చేయించుకునేందుకు సిల్క్, షిఫాన్, జార్జెట్, రేయాన్, వంటి వస్త్రరకాలు బాగుంటాయి.

లేయర్డ్ టాప్స్: జీన్స్ మీదకైనా, లెగ్గింగ్‌లకు జతగా అయినా చక్కగా నప్పుతాయివి. జార్జెట్, షిఫాన్, రేయాన్ వంటి వస్త్రాలు ఉండేలా చూసుకుంటే బాగుంటుంది. ఒక వరస తరవాత ఇంకోటి వచ్చేలా ప్రతి అంచుని మరో రంగుల్లో పైపింగ్ చేయించుకుంటే కొత్తగా ఉంటుంది. ఈ పొరల డిజైన్ స్పాగెట్టీ టాప్‌లకూ, మోకాలివరకూ ఉండే గౌన్లకూ, అనార్కలీలకూ కూడా చక్కగా నప్పుతాయి. అలానే కోల్డ్‌షోల్డర్, బెల్ స్లీవ్స్ వంటివాటికీ ఈ లేయర్‌లు బాగుంటాయి. రెండు రంగుల నెట్ వస్త్రాన్ని ఎంచుకుని వాటికి పైపింగ్ చేయడం వల్ల డ్రెస్ డిజైన్ ఎగిసిపడుతున్న తరంగాల్లా కనిపిస్తుంది.




- **స్కర్టు:** సాధారణంగా రెండు లేదా అంతకుమించి పొరల్లోనే ఉంటుంది. దీనికి భారతీయ శైలిని మేళవించాలంటే కలంకారీ తరహాలో ప్రయత్నించొచ్చు. ఒక్కో వరసలో ఒక్కో డిజైనును ఎంచుకుని రూపొందిస్తున్నారు. అదే పాశ్చాత్య శైలిలో అయితే జియోమెట్రికల్ ఆకృతుల్లో అంటే గళ్లు, త్రికోణం, వజ్రం వంటి ఆకృతుల్లో వచ్చేలా ప్రతిపొరనీ ఎంచుకోవచ్చు. దీంతో కాస్త విభిన్నంగా కనిపిస్తుంది. డిజైను ఏదయినా.. పొడుగ్గా ఉండేలా చూసుకోవాలి. ఇక నడుము కింది భాగం కనిపించకుండా ఉండాలనుకున్నప్పుడు మాత్రం పొడవాటి లేయర్డ్ స్కర్ట్‌ల ఎంపిక బాగుంటుంది.

- **లెహెంగా:** ఇది సాధారణంగా రెండు రకాల్లో వాడుకలో ఉంది.

1. రెండు పొరల్లో: మొదటి రకం కోసం పారదర్శకంగా కనిపించే నెట్, జార్జెట్ వంటివాటిని పై పొరగా, బెనారస్, కంచి పట్టు, బ్రొకేడ్ వంటి ధగధగలాడే వస్త్రాలను లోపలి పొరలుగా ఎంచుకుంటారు. లోపలి మెరుపు ఎక్కువగా ఉన్నప్పుడు దాని ప్రభావాన్ని తగ్గించుకునేందుకు ఇది చక్కని ఆలోచన. పైన నెట్ వస్త్రం సాదా రంగులో ఉంటుంది కాబట్టి దాని అంచులకు బ్రొకేడ్ లేదా ఎంబ్రాయిడరీని జత చేసుకోవచ్చు.


2. పొరలు అసమతుల్యం(లేయర్డ్‌అసెమెట్రికల్): ఒకేరకమైన వస్త్రాన్ని ఉపయోగించి ఒకవైపు గేదరింగ్స్ వచ్చి అంచులు అసమతుల్యంగా కనిపిస్తాయి. అయితే దీనికి కాస్త అధునికతను జోడించి నయాగా ఎసెమెట్రికల్ లేయర్డ్ లెహెంగాగా డిజైన్ చేస్తున్నారు. దీనికోసం హ్యాండ్‌లూమ్ సిల్క్‌ని ఎంచుకోవచ్చు. ప్రతి పొర అంచులూ పీకో చేయిస్తే లెహెంగా ఆకృతి చక్కగా కనిపిస్తుంది. అలానే పొరలను కూడా ప్రింటెడ్, ప్లెయిన్ కాంబినేషన్‌తోనూ ఎంచుకోవచ్చు. లేయర్లు ఎక్కువ కావాలనుకున్నప్పుడు దాని వెడల్పు ఎక్కువగా కనిపించాలంటే టఫెటా సిల్క్ వంటి వస్త్రరకాలు దీనికి బాగుంటాయి.

– స్వాతి కొరపాటి

నిలిచి.. కూల్చింది!

'కళ్లుపోతాయ్.. స్వామీజీ గురించి అంత మాటంటావా?'

- ఒక్క గుర్మీత్ విషయంలోనేకాదు కటకటాలపాలైన ప్రతి మతగురువు విషయంలోనూ ముందు జరిగేది ఇదే. భక్తుల మధ్య ఉన్న ఆ నమ్మకమే బాబాలకున్న శక్తిమంతమైన కవచం. గుర్మీత్‌ని అలా నమ్మేవారిలో సామాన్యులే కాదు కేంద్ర సచివులూ ఉన్నారు. ఆ బలంతో అతను కనుసైగతో ఎంతటి రావణకాష్టాన్నైనా రాజేయగలడు. ఎన్ని జీవితాలనైనా కిక్కురుమనకుండా మట్టిలో కుక్కేయగలడు. అతని మహాసామ్రాజ్యానికి వ్యతిరేకంగా సామాన్య ఆడపిల్ల ఒంటరిగా నిలిచి న్యాయపోరాటం చేయాలంటే ఎంత తెగువకావాలి..? అదే చూపింది ఆ అమ్మాయి. సీబీఐ రూపంలో ఒక చిన్న ఆదరణ దొరకగానే తాచులా శివాలెత్తింది. చట్టం అండతో గురూజీని కటకటాల పాల్జేసింది. ఈమె గుర్మీత్ అకృత్యాలని తొలిసారి వెలుగులోకి తెచ్చిన సాధ్వీ కాదు. ఆ సాధ్వీని ధైర్యంగా రప్పించి తనతోపాటు సాక్షిగా నిలిపిన విద్యార్థిని! పేరు? చట్టప్రకారం దాన్ని ప్రచురించకూడదు. అంతేకాదు ఆమెని గుర్తుపట్టించే వివరాలూ చెప్పకూడదు. అవి లేకపోతేనేం? ఆ అమ్మాయి చూపిన సాహసం పదికాలాలపాటు గుర్తుండిపోతుంది.



అది 2009. పంచకుల కోర్టు హాలు. గుర్మీత్ సింగ్‌ని తొలిసారి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. అతను ఎప్పట్లాగే షోకిలారాయుడిలా అక్కడికి వచ్చాడు. అతనికి వ్యతిరేకంగా ముందుకొచ్చిన ఏకైక సాక్షి ఆ అమ్మాయి. ముందుగానే అందరూ హెచ్చరించారు. పోలీసులే అన్నారు.. 'అతనికి ఎదురుగా వెళుతున్నారు. మిమ్మల్ని అతను గుర్తుపెట్టుకుంటాడు మిమ్మల్ని. తర్వాత మీకు ప్రమాదం ఉండొచ్చు..' అని. ఆమె లెక్కచేయలేదు. చట్టం తనలాంటి సామాన్యురాళ్లకిచ్చిన అధికారాన్ని సమర్థంగా వినియోగించుకోవాలనుకుంది. తన ప్రాణాలు పోయినా సరే.. మరో నలుగురిలో ధైర్యం నింపాలనుకుంది. ధైర్యంగా ముందుకొచ్చి సాక్ష్యం చెప్పింది. 'అతన్ని చూసి అప్పుడే కాదు.. ఆ తర్వాత ఎప్పుడూ భయపడలేదు. ఇదిగో ఈరోజు కూడా నాకు భయంలేదు..!' అంటుందామె.

చదువుతున్న అమ్మాయిని..

డేరా సచ్చా సౌధకి ఎన్నో శాఖలున్నా ప్రధాన కేంద్రం ఉండేది హరియాణాలోని సిర్సాలో. లోపల ఎన్నో విద్యాసంస్థలున్నాయి. అందులోని ఓ కాలేజీలో చదువుతుండేది ఆమె. అక్కడి వసతిగృహంలోనే తలదాచుకునేది! ఆమెది సంప్రదాయ రైతుకుటుంబం. ఈమె పెద్దన్నయ్య గుర్మీత్ సింగ్‌కి పరమ భక్తుడు. ఆయనకి దగ్గరగా మెలిగే అనుచరగణంలో ఒకడు. అలా ఆ అమ్మాయికి అక్కడ చదివే అవకాశం దొరికింది. అన్నతో పాటూ ఈమెకూడా గుర్మీత్‌ని దేవుడిగానే పూజించేది. ఓ రోజు ఆ దేవుడిలాంటి వ్యక్తి ముసుగుతీసి.. ఈమె ముందు వికృతంగా నిలిచాడు. అకృత్యానికి పాల్పడ్డాడు. ఆ సంఘటన జరిగాక ఆమె ఆశ్రమం నుంచి బయటకొచ్చింది.

అన్నయ్యనీ చంపేశారు..

బయటకొచ్చాక ఊరుకోలేదు. పోలీసు స్టేషన్‌కి వెళతానంది. అది సాధ్యం కాదనుకున్నాక పెద్దన్నతో తన గోడు వెళ్లబోసుకుంది. అతను కోపంతో కుతకుత ఉడికిపోయాడు. ఆశ్రమంలో ప్రశ్నించడం మొదలుపెట్టాడు. దాంతో అతన్ని హత్యచేశారు. పాయింట్ బ్లాంక్‌లో తుపాకీతో కాల్చిచంపారు! అతను ప్రశ్నించడం మాత్రమే కాదు. ఆ సాధ్వీ రాసిన ఆ లేఖ అప్పుడే సంచలనం సృష్టిస్తోంది. ఆ ఆకాశరామన్న లేఖ ఇతనే రాశాడనే అనుమానంతోనే కాల్చిచంపారు! అంటుంది ఈ అమ్మాయి. ఆ లేఖపై విచారణ జరపాలని హైకోర్టు సిర్సా జిల్లా సెషన్స్ జడ్జిని ఆదేశించింది. పాపం.. ఆయన విచారణకి వస్తే ఎదుట నిలిచి ధైర్యంగా సాక్ష్యం చెప్పేవారేరి! దాంతో హైకోర్టు కేసుని సీబీఐకి అప్పగించింది. ఆ సంస్థ 130 మంది అమ్మాయిల జాబితా తయారుచేస్తే ధైర్యంగా ముందుకొచ్చి నిలిచిన ఒకే వ్యక్తి ఈ అమ్మాయే. తన తెగువనే గునపంగా చేసుకుని.. ఆ మహాసామ్రాజ్యాన్ని కుళ్లబొడవడం మొదలుపెట్టింది.

'నీకూ మీ అన్నగతే..!'

ఈ అమ్మాయి, తండ్రి విచారణకోసం వెళ్లిన ప్రతిసారీ గురూజీ అనుచరగణం మారణాయుధాలతోనే వచ్చేవారు. 'నీకూ మీవాడి గతే పడుతుంది..' అని బెదిరించారు. ఒకస్థాయిలో కాళ్లబేరానికీ వచ్చారట. 'నువ్వెంత అడిగితే అంతిస్తాం..!' అని. కానీ ఆ అమ్మాయి దేనికీ లొంగలేదు. ఆమెది సంప్రదాయ కుటుంబమైనా సరే బంధువులూ, స్నేహితులూ ఆమెకు వెన్నుదన్నుగా నిలిచారు. సీబీఐ కూడా అంతే! 2002 నుంచి ఆమెకి ప్రత్యేక భద్రత కల్పిస్తున్నారు. గతవారం తీర్పు చెప్పే రోజు నుంచి ఈ బలగాలని పెంచారు కూడా!! అంతేకాదు.. ఆమె తనకి నచ్చిన వ్యక్తినే పెళ్లి కూడా చేసుకుంది. ఇప్పుడామెకి ఇద్దరు పిల్లలు. వాళ్లపై దాడి జరుగుతుందనే భయమున్నా... న్యాయస్థానానికి వస్తూనే ఉందామె. ఒక అమ్మాయి చూపిన సాహసానికి.. కుటుంబం, సమాజం చిన్నపాటి మద్దతినిస్తే ఆమె ఎంతైనా సాధించగలదు అనడానికి ఇదో ఉదాహరణ కూడా!

నల్లమచ్చలకు నిమ్మరసం!



ఎంత మేకప్ వేసుకున్నా... ముఖానికి అక్కడక్కడ నల్లని మచ్చలు కొట్టొచ్చినట్లు కనిపిస్తే... ఆ అలంకరణ అందంగా అనిపించదు. పైగా ఆ మచ్చలు శాశ్వతంగా ఉండిపోతాయేమో అనే భయం కలిగిస్తాయి. కానీ వాటిని పోగొట్టుకోవడానికి ఈ వంటింటి చిట్కాలు చక్కగా ఉపయోగపడతాయి.

- **నిమ్మరసంతో..** ముఖంపై నల్లని మచ్చలకు ముఖ్య కారణం విటమిన్ సి లోపించడమే. రెండు చెంచాల నిమ్మరసంలో చిన్న దూది ఉండను ముంచి ముఖంపై మచ్చలున్నచోట రాయాలి. పది నిముషాల తరవాత చల్లని నీటితో కడగాలి. నిమ్మరసం రాసినప్పుడు ముఖంపై ఎండ పడకుండా చూసుకోవాలి.
- **గంధం పొడితో..** గంధం పొడికి రోజ్‌వాటర్‌ను, రెండు చుక్కల గ్లిజరిన్‌ను కలిపి పేస్టులా చేసుకుని రాత్రి నిద్రపోయే ముందు ముఖానికి రాసుకోవాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే మచ్చలూ పోతాయి. చర్మ ఛాయా మెరుగుపడుతుంది.
- **పచ్చి పాలతో..** లాక్టిక్ యాసిడ్ ఉండే పచ్చిపాలను ముఖంపై ఉండే మచ్చలకు రాసుకుని రాత్రంతా ఉంచుకొని తెల్లవారిన తరవాత కడిగితే.. మచ్చలు తగ్గుముఖం పడతాయి. అలాగే చెంచా మజ్జిగలో చెంచా నిమ్మరసం కలిపి మచ్చలపై రాస్తే క్రమంగా మచ్చలు మటుమాయమవుతాయి.
- **కలబంద గుజ్జుతో..** కలబంద గుజ్జును మచ్చలపై రాసి, అరగంట తరవాత కడిగేయాలి. ఇలా రోజూ చేస్తుంటే మచ్చలు పోయి చర్మం కాంతిమంతంగా మారుతుంది.
- **పెరుగుతో..** చెంచా పెరుగుకు రెండు చెంచాల ఓట్‌మీల్, చెంచా నిమ్మరసాన్ని కలిపి ముఖానికి రాసుకుని అరగంటాగి గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకోవాలి. ఇలా రోజుకోసారైనా చేస్తుంటే చర్మంపై పేరుకున్న నలుపుదనంతో పాటూ మచ్చలూ మాయమవుతాయి.

స్నేహబంధంలో నో కోపమ్స్!



స్నేహం ఒక మధురమైన బంధం. కోపాలూ, అలకలూ, చిలిపి తగాదాలు... ఇవన్నీ సహజమే. అయితే స్నేహితుల మధ్య అప్పుడప్పుడూ మనస్పర్థలూ, పొరపచ్చాలు రావచ్చు. ఇలాంటివి తలెత్తినప్పుడు ఎదుటివారిని నొప్పించకుండా, మీరూ బాధపడకుండా వాటినెలా అధిగమించాలో చూద్దాం!

- ఒక్కోసారి స్నేహితుల మధ్యలో తలెత్తే గొడవలకు స్పష్టమైన కారణం అంటూ ఉండదు. మరికొన్ని సార్లు మాత్రం తీవ్రంగా ఉంటుంది. ముందుగా అసలు సమస్య ఏమిటనేది తెలుసుకోవాలి. మీ స్నేహితురాలి కోపానికి, అసహనానికి కారణమైన విషయాన్ని కనిపెట్టాలి.
- మీ వల్ల ఏదైనా పొరపాటు జరిగితే దాన్ని మీ నేస్తం ఎలా స్వీకరించిందో తననే అడగండి. ఇలా చేయడం వల్ల ఆమె మీ గురించి ఏమనుకుంటుందో, అసలు సమస్య ఏమిటో స్పష్టంగా తెలిసిపోతుంది.
- జరిగిన గొడవ/ సమస్య గురించి కొందరు అదేపనిగా వాదిస్తుంటారు. ప్రశ్నలపై ప్రశ్నలు సంధిస్తుంటారు. మీరు అలా చేయకండి. తనను కాసేపు ఒంటరిగా వదిలేయండి. ఇలా చేయడం వల్ల ఆమెలో కూడా ఆవేశం తగ్గి ఆలోచించడానికి సమయం ఇచ్చినట్లవుతుంది. అలానే ఎదుటివారి కోపం చల్లారాక అసలు సమస్య ఏమిటో కనుక్కోండి. నెమ్మదిగా వారిని కదిలించండి.
- ఇద్దరు స్నేహితుల మధ్య భేదాభిప్రాయాలు వచ్చినప్పుడు సహజంగా మూడో వ్యక్తి సలహా తీసుకుంటారు. అయితే ఇది అన్నివేళలా సరికాదు. స్నేహితులిద్దరూ జరిగిన సంఘటన/ సమస్య గురించి అరమరికలు లేకుండా మాట్లాడుకుంటే తప్ప ఇద్దరికీ ప్రశాంతత ఉండదు. ఇందులో మూడో వ్యక్తి జోక్యం లేకపోతేనే బాగుంటుంది.
- ఒకవేళ తప్పు మీ వల్ల జరిగితే అంగీకరించడానికి ఇబ్బంది పడకండి. వీలైతే మీ ప్రియ స్నేహితురాల్ని క్షమించమని అడగండి. దాంతో పోయేదేమీ లేదు మీలోని అహం తప్ప. పొరబాటు అవతలివారిదే అయితే దాన్ని కూడా మనస్ఫూర్తిగా క్షమించండి. తరచూ ఆ గొడవనే తలుచుకోవడం వల్ల బాధ మరింత పెరుగుతుంది. అందుకే ఆ సంఘటనలను వీలైనంత త్వరగా మర్చిపోవడానికి ప్రయత్నించండి. అప్పుడే మీ స్నేహం బలంగా మారుతుంది.


అటూ ఇటూ?!.. నేనెప్పుడూ ఇంతేనా?



డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

? నేను బీటెక్ చదువుతున్నాను. నేను సొంతంగా ఏ నిర్ణయాన్నీ తీసుకోలేకపోతున్నాను. ప్రతిదానికీ ఎదుటివారిపై ఆధారపడుతున్నాను. నాకు నేను ఏ నిర్ణయం తీసుకున్నా.. అది కరెక్టా? కాదా? అనే ఆలోచన నిలవనివ్వదు. దాంతో ఎదుటివాళ్లు ఏది చెబితే అది చేస్తాను. ఇప్పుడు నా బీటెక్ విషయంలోనూ ఇలాగే అయ్యింది. మొదట నేను ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం తీసుకున్నా. అందరూ దానికంటే కంప్యూటర్స్ బావుంటుందని చెప్పగానే.. ఇందులో చేరాను. ఇది నేను ఆశించినంతగా లేదు! ప్రతి విషయంలోనూ నాకు ఇలాగే జరుగుతోంది. జీవితాంతం ఇలాగే ఉండిపోతానా.. అని భయమేస్తోంది. **- శ్రావ్య కనపర్తి,** కర్నూలు

✔ ఎక్కడిదాకో ఎందుకు..? మీ క్లాసులో ఉన్నవాళ్లనే అడిగిచూడండి.. ఈ కోర్సులో చేరడం పూర్తిగా వాళ్ల నిర్ణయమేనా అని! 80 శాతం మంది కాదనే చెబుతారు. తల్లిదండ్రులో, అధ్యాపకులో, సీనియర్‌లో.. ఇలా ఎవరో ఒకరు చెప్పినందువల్లే చేరామనీ అంటారు. మన భారతీయ కుటుంబ వ్యవస్థలో ఉన్న లక్షణం ఇది. ఇంటా, బయటా పెద్దల సలహా తీసుకోవడమన్నది తప్పనిసరి. చిన్నప్పటి నుంచి అలా అలవాటుపడ్డ మనం.. టీనేజీకి రాగానే సొంత నిర్ణయాలు ఎలా తీసుకోగలుగుతాం? అది మీకే కాదు.. మీ వయసులో ఎవరికీ సాధ్యం కాదు. మరి అందరూ మామూలుగా ఉండగా, మిమ్మల్ని మాత్రం ఈ విషయం ఎందుకు ఇంతగా బాధపెడుతోంది? మీ సమస్య నిర్ణయం తీసుకోలేకపోవడం కాదు. తగినంత ఆత్మస్థైర్యం లేకపోవడం.. అతిగా ఆలోచించం అనిపిస్తోంది. అందువల్లే మీరు ఏ నిర్ణయం తీసుకున్నా కొట్టుమిట్టాడుతున్నారు. మీ సమస్యకి అవే మూలం. మరి ఇందులో నుంచి ఎలా బయటపడాలి? నిర్ణయం తీసుకోలేకపోవడమే మీ సమస్య అంటున్నారు కాబట్టి.. దాని ద్వారానే ఆత్మవిశ్వాసం సాధించండి. నిర్ణయాలు తీసుకునే విషయంలో రెండు తరహాలవాళ్లుంటారు. ఉద్వేగాలకి ప్రాధాన్యమిచ్చేవాళ్లు ఓ రకమైతే(ఎమోషనల్ మైండెడ్), ప్రతిదీ ఆచరణాత్మకంగానే ఉండితీరాలి అనుకునేవాళ్లు ఇంకో రకం(ప్రాగ్మటిక్). మనలో మొదటివాళ్లు 80 శాతం ఉంటే.. మిగతావాళ్లు 15 శాతం మంది ఉంటారు. ఆరెండింటినీ సమపాళ్లలో చూసి ఓ నిర్ణయానికి వచ్చేవాళ్లే వివేకవంతులు(వైజ్ మైండ్). మీరు మొదటి కోవలోకే వస్తారు. కాబట్టి మీకిప్పుడు కావాల్సింది కొద్దిగా ఆచరణాత్మకత. దాన్ని కాస్త పెంచుకోండి. అదిపెంచుకుంటే చక్కటి నిర్ణయాలు మీరూ తీసుకోగలరు. అంతకంటే ముందు.. ఓ నిర్ణయం తీసుకున్నాక, అది అన్నిరకాలా మంచిదని అనుకున్నాక దాన్ని 'లాక్' చేసేయండి. దానిపై అతిగా ఆలోచించడం మానుకోండి. మీలోని అదే ఆత్మవిశ్వాసాన్ని కూలదోస్తోంది. అది తగ్గాలంటే రోజూ ఓ ఐదు నిమిషాలు శ్వాసనియంత్రణ వ్యాయామం చేయండి. తగిన నిద్ర, సరైన ఆహారం, వ్యాయామం మీ జీవితంలో భాగం చేసుకోండి. సమస్య తగ్గుతుంది. అప్పటికీ తగ్గకుంటే కౌన్సెలింగ్ తీసుకోవచ్చు. ఇందుకోసం పెద్దగా ఖర్చుపెట్టాల్సిన అవసరం కూడా లేదు. ఆన్‌లైన్‌లోనే మీకెన్నో కౌన్సెలింగ్ సైట్‌లు ఉచితంగా ఇటువంటి సేవలు అందిస్తున్నాయి. వాటిని ఉపయోగించుకోండి.



29న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	-------	-------	30,150	30,100
ఆర్నమెంట్	-------	-------	27,800	28,000
వెండి (కిలో)	-------	-------	40,200	40,500
	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	30,036	29,950	29,990	29,420
ఆర్నమెంట్	28,200	27,780	28,490	27,950
వెండి (కిలో)	40,800	40,100	40,400	39,500
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	30,430	30,000	-------	-------
ఆర్నమెంట్	28,300	27,950	2,849	2,795 గ్రా
వెండి (కిలో)	40,900	40,500	43.30	42.20 గ్రా

ఆ వాదనలు వద్దు!

కాలంతో పాటు వేగంగా రోజూ గడిచిపోతుంది. దానికితోడు భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలూ చేస్తేనే కానీ కుటుంబం నడవని పరిస్థితి. దాంతో పని వల్ల వచ్చే ఒత్తిడితో పాటు సాంకేతికత కూడా వారి మధ్య అగాధాన్ని పెంచుతోంది. దాంతో ఏకాంతంగా గడిపే సమయమూ తగ్గుతోంది. ఫలితంగా రుసరుసలూ, వాదనలే. మరి దాన్ని ఎలా సరిదిద్దుకోవాలంటే...



రోజంతా ఆఫీసులో పనిచేసి ఇంటికొచ్చాక కాసేపు విశ్రాంతికి టీవీనే చక్కని మార్గం అనుకుంటున్నారు. దాంతో ఉన్న కాసేపు సమయంలోనూ టీవీలకే అంకితం అయిపోతున్నారు. దానివల్ల ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకునే మార్గమే ఉండదు. ఆ సమయాన్ని ఇద్దరూ కలిసి పనిచేసేందుకో లేక కబుర్లు చెప్పుకునేందుకో కేటాయించుకోండి. అదీ లేదంటే వీధి చివర ఉన్న పార్కుకి కాసేపు నడకకో వెళ్లండి. దాంతో కాస్త సమయం చిక్కుతుంది. ఒకరికొకరూ దగ్గర అవుతారు.

- ఈ రోజుల్లో ఫోనులేకుండా క్షణం కూడా ఉండలేని పరిస్థితి. అంతర్జాలాన్ని అరచేతుల్లోకే తెచ్చేసింది. ఖాళీగా ఉంటే పక్కనే భాగస్వామి ఉన్నా మాట్లాడుకోవడం తగ్గిపోయింది. దానికి బదులుగా ఫేస్‌బుక్ చూడటం, వాట్సాప్‌లో ఛాటింగ్. దీనివల్ల మీ భావాలనూ, ఆలోచనల్ని యాంత్రికంగా మారిపోతున్నాయని గమనించండి. వీలైతే ఇద్దరికీ కాస్త ఏకాంతం దొరికినప్పుడు మొబైల్స్ ఆఫ్‌లో ఉంచుకోవడమే మేలు. అంతేకాదు పడకగదికీ ఫోన్‌లు తీసుకెళ్లే అలవాటుకి దూరంగా ఉండండి. అప్పుడే ఇది మీ లైంగిక జీవితానికి అవరోధకంగా మారదు.
- మీ భాగస్వామికీ అత్యవసరమైతే తప్ప మెసేజ్‌లూ, ఈమెయిళ్లూ పెట్టకండి. ఆ విషయమేంటో ఫోన్ చేసి పలకరించి చెప్పండి. వీలైతే నేరుగా చెప్పడానికే ప్రయత్నించండి. ఇది ఇద్దర్నీ మునుపటి కంటే ఎంతో దగ్గర చేస్తుంది. సాంకేతిక ఉపకరణాలని ఈ రోజుల్లో పూర్తిగా దూరం చేసుకోలేం. కాబట్టి భార్యాభర్తలిద్దరూ కొన్ని నియమాలు పెట్టుకోండి. నిర్దిష్ట సమయంలో మాత్రమే వాటిని వాడేలా చూసుకోండి. దానికితోడు ఆఫీసు పనులు ఇంటికొచ్చాక కూడా చేస్తుంటారు చాలామంది. ఇది వ్యక్తిగతంగా గడిపే సమయాన్ని తగ్గిస్తుంది.

సెన్సెక్స్ ▼ 362	నిఫ్టీ ▼ 117	రూపాయి 64.02 ▼	బంగారం 29,915 ▲	వెండి 40,030 ▲	ముడి చమురు 51.64 ▼
31388	9796	(ఒక అమెరికా డాలరుకు) 11 పైసలు	(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 520	ముంబయిలో కిలో రూ.లలో 805	(బ్రెంట్ ధర డాలర్లలో)

ఈనాడు బిజినెస్

ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	21,831	+22
నాస్‌డాక్	6,292	+09
నిక్కీ 225 (జపాన్)	19,363	−87
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,249	−18
షాంఘై(చైనా)	3,366	+03
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,337	−64
డాక్స్ (జర్మనీ)	11,946	−177

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.17	67.45
పౌండ్ స్టెర్లింగ్	75.27	87.28
యూరో	69.61	80.74
జపనీస్ యెన్/100	53.46	62.00
ఆస్ట్రేలియా డాలరు	46.09	53.33
సింగపూర్ డాలరు	42.93	50.86
థాయ్ బాత్/100	175.23	209.57
బహ్రెయిన్ దీనార్	157.33	180.53
కువైట్ దీనార్	175.09	218.04
సౌదీ రియాల్	15.41	18.34
యూఏఈ దిర్హమ్	15.80	18.51
మలేషియా రింగిట్	13.35	16.41
చైనీస్ యువాన్	6.84	11.10



మంగళవారం నిఫ్టీ కదలికలు



ఈటీఎఫ్‌లకు ఆదరణ పెరుగుతోంది

- నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ రూ.32,000 కోట్లు
- ఎస్ అండ్ పీ బీఎస్ఈ అధిపతి కోయెల్ ఘోష్

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం చేపట్టే అనుకూల విధానాల వల్ల భవిష్యత్తులో దేశంలో ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్(ఈటీఎఫ్)లకు ఆదరణ పెరగగలదని, ప్రస్తుతం దేశంలో ఈటీఎఫ్‌లు 500 కోట్ల డాలర్ల (దాదాపు రూ.32,000 కోట్లు) ఆస్తులను నిర్వహిస్తున్నాయని ఎస్ అండ్ పీ బీఎస్ఈ ఇండైసెస్ వ్యాపార అధిపతి (భారత్) కోయెల్ ఘోష్ అన్నారు. పెన్షన్ ఫండ్‌లు వంటివి ఈటీఎఫ్‌లో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయని, ప్రభుత్వ విధానాలను బట్టి వచ్చే రెండు, మూడేళ్లలో ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్‌లు నిర్వహించే ఆస్తుల విలువ ప్రస్తుతమున్న స్థాయి నుంచి రెట్టింపు కాగలదని భావిస్తున్నామని చెప్పారు. ఈటీఎఫ్‌లు షేర్లు, కమొడిటీలు, బాండ్ల తదితరాల్లో పెట్టుబడులు పెడతాయి. ఈ ఫండ్‌ల యూనిట్లు మామూలు షేర్లలాగానే స్టాక్ ఎక్స్ఛేంజీలలో ట్రేడవుతూ ఉంటాయి. షేర్ల మాదిరిగానే రోజు వారీగా ధరలు హెచ్చుతగ్గులకు గురవుతూ ఉంటాయి. ఒక ఇండెక్స్‌ను ప్రాతిపదికగా తీసుకుని ఈటీఎఫ్‌లు మదుపు చేస్తాయి. మార్కెట్ పనితీరు లేదా ఏదైనా రంగం పనితీరును ప్రతిబింబించే సూచీ (ఇండెక్స్) ఆధారం చేసుకుని ఈటీఎఫ్‌లు పెట్టుబడులు పెడతాయి.

సొంత ఆలోచనలు, అనుభవాలకు అనుగుణంగా చేసే మదుపును యాక్టివ్ పెట్టుబడి అంటారు. అలా కాకుండా మార్కెట్, ఆయా రంగం పనితీరును ప్రతిబింబించే ఇండెక్స్ ఆధారిత సాధనాల్లో మదుపు చేయడాన్ని పాసివ్ మదుపుగా వ్యవహరిస్తారు. దీని వల్ల మార్కెట్ పనితీరుకు అనుగుణంగా ప్రతిఫలాలు ఉంటాయి. ఇటువంటి మదుపునకు ఈటీఎఫ్‌లు ఉత్తమమైన సాధనాలని ఘోష్ వివరించారు. ఇటువంటి వాటిలో పెట్టుబడులు మార్కెట్ ఒడుదొడుకుల ప్రభావాన్ని తగ్గిస్తుందన్నారు. 'మ్యూచువల్ ఫండ్‌లు తాము మదుపు చేసిన పోర్టుఫోలియోను రోజు వారీ ప్రాతిపదికన వెల్లడించవు. నియమ నిబంధనల కారణంగా ఈటీఎఫ్ మేనేజర్లు రోజువారీ ప్రాతిపదికన పోర్టుఫోలియోను వెల్లడించడం వల్ల పారదర్శకత అధికంగా ఉంటుంది. ఈటీఎఫ్‌ల మదుపు పాసివ్ మదుపు అయినందున మేనేజర్లకు చెల్లించే రుసుములు, లావాదేవీ ఖర్చులు తక్కువగా ఉంటాయన్నా'రు. భారత మార్కెట్లలో ఇప్పటి వరకూ యాక్టివ్ మదుపు చేసే వారే ఎక్కువ. ఇప్పుడిప్పుడే పాసివ్ మదుపు కూడా పుంజుకుంటోందని ఘోష్ అన్నారు. ప్రస్తుతం దేశంలో 65 రకాల ఈటీఎఫ్‌లు ఉన్నాయన్నారు.



కోయెల్ ఘోష్

54 ఈక్విటీ సూచీలు

వివిధ రకాల సూచీలను (ఇండెక్స్‌లు) తయారు చేయడానికి 2013లో ఎస్ అండ్ పీ డోజోన్స్ ఇండైసెస్, బీఎస్ఈలు చేతులు కలిపాయి. ప్రస్తుతం 70 సూచీలు ఉండగా.. ఇందులో 54 ఈక్విటీ సూచీలని ఘోష్ చెప్పారు. ఈక్విటీ సూచీల్లో స్థూలంగా స్టాక్ మార్కెట్ ధోరణిని ప్రతిబింబించే ఎస్ అండ్ పీ బీఎస్ఈ సెన్సెక్స్, ఎస్ అండ్ పీ బీఎస్ఈ 100 వంటి సూచీలు 14 ఉండగా.. రంగాలు, పరిశ్రమలకు చెందిన షేర్ల పనితీరును ప్రతిబింబించే సూచీలు 19, థీమ్యాటిక్ సూచీలు 5, వ్యూహాత్మక సూచీలు 14, సస్టయినబిలిటీ సూచీలు 2 ఉన్నాయన్నారు. పెట్టుబడుల ఉపసంహరణ చేసిన ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును ప్రతిబింబించే సూచీ ఎస్ అండ్ పీ బీఎస్ఈ భారత్ 22 ఇండెక్స్‌ను వారం రోజుల క్రితం ప్రారంభించామని చెప్పారు.

ఎన్‌టీపీసీ ఇష్యూకు విశేష స్పందన

దిల్లీ: ఎన్‌టీపీసీలో వాటాను విక్రయించే నిమిత్తం ప్రభుత్వం నిర్వహించిన ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ఇష్యూకు తొలి రోజు అనూహ్య స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 5 శాతం వాటాకు సమానమైన 41.22 కోట్ల షేర్లను ప్రభుత్వం అమ్మకానికి ఉంచింది. సంస్థాగత మదుపరులకు 32.98 కోట్ల షేర్లు కేటాయించగా.. మార్కెట్ సమయం ముగిసేనాటికి 46.35 కోట్ల షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. అంటే 1.41 రెట్లు అధికంగా స్పందన లభించినట్లు మాట. ఇక ఇష్యూకు చివరి రోజైన నేడు చిన్న మదుపర్లు బిడ్డింగ్‌లో పాల్గొననున్నారు. ఎన్‌టీపీసీ ఓఎఫ్ఎస్ ఇష్యూకు తొలి రోజు భారీ స్పందన లభించినప్పటికీ, షేరు మాత్రం అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంది. బీఎస్ఈలో షేరు 2.8% వరకు కుంగి రూ.168.50 వద్ద స్థిరపడింది.

బీఎస్ఈ ఎస్ & పీ సూచీల నుంచి రిలయన్స్ కేపిటల్ తొలగింపు

ముంబయి: వచ్చే నెల 5 నుంచి బీఎస్ఈ ఎస్అండ్‌పీ సూచీల్లో రిలయన్స్ కేపిటల్ షేరు ఉండదని బీఎస్ఈ తెలిపింది. రిలయన్స్ కేపిటల్ తన స్థిరాస్తి రుణ వ్యాపారాన్ని వేరుచేస్తుండటమే ఇందుకు కారణమని తెలిపింది. విభజన అనంతరం స్థిరాస్తి రుణ వ్యాపారాన్ని రిలయన్స్ హోమ్ ఫైనాన్స్‌లో రిలయన్స్ కేపిటల్ కలపనుంది. రిలయన్స్ కేపిటల్ అనుబంధ సంస్థ రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ ఎక్స్ఛేంజీలో నమోదుకానుంది. అయితే వ్యాపార విభజన సెప్టెంబరు 5 నుంచి అమల్లోకి వస్తున్నందున ఆ ప్రకారంగానే సూచీల్లో మార్పులు చేయనున్నట్లు బీఎస్ఈ తెలిపింది. ఎస్అండ్‌పీ బీఎస్ఈ ఆల్‌క్యాప్, ఎస్అండ్‌పీ బీఎస్ఈ 200, ఎస్అండ్‌పీ బీఎస్ఈ 100, ఎస్అండ్‌పీ బీఎస్ఈ సెన్సెక్స్ నెక్స్ట్ 50, ఎస్అండ్‌పీ బీఎస్ఈ మిడ్‌క్యాప్, ఎస్అండ్‌పీ బీఎస్ఈ లార్జ్‌క్యాప్ సహా మొత్తం ఎస్అండ్‌పీ బీఎస్ఈ సూచీలు 11 వరకు ఉన్నాయి. వీటన్నింటి నుంచి రిలయన్స్ కేపిటల్‌ను బీఎస్ఈ తొలగించనుంది.

గృహ భద్రత ఉపకరణాలకు ఆదరణ

మార్కెట్ విలువ రూ.350 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ఇప్పుడిప్పుడే దేశంలో సీసీ కెమేరాల వంటి గృహ భద్రత ఉపకరణాలకు ఆదరణ లభిస్తోందని గోద్రెజ్ సెక్యూరిటీస్ సొల్యూషన్స్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ మెహెర్నోష్ పిథవల్లా తెలిపారు. గోద్రెజ్ అండ్ బాయిస్‌లో గోద్రెజ్ సెక్యూరిటీస్ ఒక భాగం. సంఘటిత రంగంలో గృహ భద్రత ఉత్పత్తిల మార్కెట్ రూ.300-350 కోట్ల వరకూ ఉందని, విస్తృతి రేటు 3 శాతమే ఉన్నందున భవిష్యత్తులో ఆకర్షణీయంగా పెరగనుందని చెప్పారు. ఇందులో రూ.230 కోట్ల విక్రయాలు తమవేనన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ విక్రయాలు రూ.280 కోట్లకు పెరగగలవని అంచనా వేస్తున్నట్లు విలేకరుల సమావేశంలో చెప్పారు. వైఫై ఆధారిత కొత్త సీసీ కెమేరాలను మార్కెట్‌లోకి విడుదల చేయనున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. కేవలం భద్రతకే కాక ఇంట్లో చిన్న పిల్లలు, వృద్ధులను పర్యవేక్షించడం వంటి అనేక అవసరాలకు సీసీ కెమేరా ఉపయోగపడతాయని, యాప్ ఆధారంగా ఇంట్లో ఏం జరుగుతుందో మొబైల్‌ఫోన్‌లో చూడొచ్చని చెప్పారు. ధర రూ.5,500 నుంచి రూ.9,900 వరకూ ఉంటుందన్నారు.

మూడేళ్లలో 10% వాటా

గృహ నీటి శుద్ధి పరికరాల విపణిలో బ్లూస్టార్ లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: గత ఏడాది చివర్లో గృహ వినియోగ వాటర్ ప్యూరిఫైయర్ల విపణిలోకి అడుగు పెట్టిన బ్లూస్టార్ వచ్చే మూడేళ్లలో 10 శాతం వాటాను చేజిక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయ గృహ నీటి శుద్ధి పరికరాల విపణి విలువ దాదాపు రూ.4,000 కోట్లుందని, ఏడాదికి ఇది 22 శాతం చొప్పున వృద్ధి చెందుతోందని బ్లూస్టార్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ (వాటర్ ప్యూరిఫైయర్ల విభాగం) గిరిశ్ హింగోరాని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విపణిలోకి కొత్త శ్రేణి ప్యూరిఫైయర్లను విడుదల చేసిన సందర్భంగా మాట్లాడారు. మొత్తం 21 మోడళ్లను బ్లూస్టార్ విడుదల చేసింది. భవిష్యత్తులో వాణిజ్యం కోసం వినియోగించే నీటి శుద్ధి వ్యవస్థల్లోకి కూడా కంపెనీ అడుగు పెట్టగలదని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి కంపెనీ వాటర్ ప్యూరిఫైయర్ల విక్రయాలు రూ.60 కోట్లకు చేరగలవని, వచ్చే ఏడాది ఈ విక్రయాలు రెట్టింపు కాగలవని బ్లూస్టార్ ప్రెసిడెంట్ సి.పి. ముకుందన్ మీనన్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగంలో రూ.30 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నామన్నారు. జమ్ములోని కంపెనీ కొత్త యూనిట్ వచ్చే ఏడాదిలో అందుబాటులోకి వస్తుందని, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో నిర్మిస్తున్న ప్లాంటు 2019-2020 నాటికి సిద్ధం కాగలదని తెలిపారు.



కొత్త శ్రేణి నీటి శుద్ధి పరికరాలను విడుదల చేస్తున్న చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ గిరిశ్ హింగోరాని. బ్లూస్టార్ ప్రెసిడెంట్ ముకుందన్ మీనన్

ఐకియాలో 800 ఉద్యోగాలు

- వచ్చే వేసవిలో విక్రయ కేంద్రం ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: ఫర్నిచర్ తయారీ, విక్రయ సంస్థ ఐకియా దేశంలో తొలి రిటైల్ కేంద్రాన్ని హైదరాబాద్‌లో 2018 ప్రథమార్ధంలో ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. హైటెక్ సిటీ సమీపంలో 13 ఎకరాల్లో నిర్మిస్తోన్న ఈ కేంద్రం కోసం ఈ స్వీడన్ సంస్థ దాదాపు రూ.1,000 కోట్ల వరకూ పెట్టుబడి పెడుతోంది. దాదాపు 4లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేస్తున్నామని ఐకియా ఇండియా డిప్యూటీ కంట్రీ మేనేజర్ పాట్రిక్ ఆంటోనీ తెలిపారు. నిర్మాణ పురోగతి, కొత్త ఉద్యోగుల నియామకాలకు సంబంధించి వివరించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో తొలి కేంద్రాన్ని ఇక్కడ ప్రారంభిస్తున్నామని, ముంబాయి, బెంగళూరు, దిల్లీలో కూడా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. 2025కల్లా దేశంలో 25 కేంద్రాలను ఏర్పాటు చేసే లక్ష్యంతో ఉన్నామన్నారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా 53 పంపిణీ సంస్థలతో ఒప్పందాలున్నాయనీ, ఇందులో 2 సంస్థలు హైదరాబాద్ నుంచి ఉన్నాయని తెలిపారు. ఫర్నిచర్ తయారీకి కలపను సేకరించడం సవాలుగా మారుతోందని, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఈశాన్య రాష్ట్రాల ప్రభుత్వాలతో కలప సేకరణకు సంబంధించి చర్చిస్తునట్లు పేర్కొన్నారు. భారత్ నుంచి 325 మిలియన్ యూరోల విలువైన ఎగుమతులు చేస్తున్నట్లు తెలిపారు. 2022 కల్లా దేశీయ విక్రయాల్లో 30శాతం వరకూ ఇక్కడ తయారైన ఉత్పత్తులే ఉంటాయన్నారు. సమీప భవిష్యత్తులో ఆన్‌లైన్‌లో ఫర్నిచర్‌ను విక్రయించే అవకాశాలున్నాయన్నారు. ఐకియా తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ జాన్ అహులియా మాట్లాడుతూ.. ఈ కేంద్రంలో 800లకు పైగా ఉద్యోగులను నియమించుకోనున్నట్లు తెలిపారు.



ఐకియా ఇండియా డిప్యూటీ కంట్రీ మేనేజర్ పాట్రిక్ ఆంటోనీ, పక్కన హైదరాబాద్ కేంద్రం హెడ్ జాన్ అహులియా

వేతనంలో 90 శాతం కోత

- ముందుకొచ్చిన ఒమాక్సే ప్రమోటార్లు
- ప్రాజెక్టుల పూర్తికి వినియోగిస్తామని ప్రకటన

దిల్లీ: తమ ప్రమోటర్లు వేతనంలో 90 శాతం కోత విధించుకున్నారని, డివిడెండ్‌లో వారి వాటా పూర్తిగా వదులుకున్నారని స్థిరాస్తి సంస్థ ఒమాక్సే వెల్లడించింది. ఇందువల్ల ఏడాదికి ఆదా అయ్యే రూ.15 కోట్లను ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసేందుకు వినియోగిస్తామని తెలిపింది. పెద్దనోట్ల రద్దుతో పాటు స్థిరాస్తి నియంత్రణ చట్టం రెరా, వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమల్లోకి వచ్చిన తరవాత స్థిరాస్తి రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను గమనించే తమ ప్రమోటర్లు ఈ నిర్ణయానికి వచ్చారని కంపెనీ వివరించింది. 'ఒమాక్సే పనితీరు సజావుగానే ఉంది. అయితే ప్రస్తుతం సవాళ్లు ఎదురవుతున్నాయన్నది వాస్తవం. ఈ రంగం తీరు కొత్తగా మారుతోంది. ఇది గతంలో ఎన్నడూ చూడనిదిగా ఉంది. సాధారణ పరిస్థితులు నెలకొనాలంటే, కొన్ని నెలలు పట్టొచ్చు. ఈ నేపథ్యంలో, స్థిరాస్తి రంగానికి చెందిన ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలి. అందుకే వేతనాల్లో 90 శాతం కోత విధించుకోవాలని నిర్ణయించాం' అని ఒమాక్సే సీఎండీ రోహ్‌తాస్ గోయెల్ పేర్కొన్నారు.

ఎగుమతుల్లో 20% వాటా

- చిన్న సాఫ్ట్‌వేర్ కంపెనీల నుంచి
- హైసియా లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత హైదరాబాద్ నుంచి సాఫ్ట్‌వేర్ ఎగుమతులు దాదాపు రూ.87,000 కోట్ల మేరకు ఉన్నాయి. ఇందులో రూ.9,000 కోట్ల ఎగుమతులు చిన్న, మధ్య స్థాయి కంపెనీల (ఎస్ఎంఈ) నుంచి జరుగుతున్నాయి. అంటే దాదాపు 10 శాతం ఎగుమతులు చిన్న కంపెనీల నుంచి జరుగుతున్నాయని హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) అధ్యక్షుడు రంగా పోతుల తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సాఫ్ట్‌వేర్ వార్షిక ఎగుమతులను రూ.1,20,000 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఇందులో చిన్న సంస్థల వాటాను 20 శాతానికి పెంచాలని భావిస్తున్నామని రంగా వివరించారు. చిన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలపై హైసియా ఏర్పాటు చేసిన వార్షిక సదస్సు సందర్భంగా ఆయన మాట్లాడారు.

700 పైగా కంపెనీలు..: హైదరాబాద్‌లో దాదాపు 700 సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉండగా.. అందులో 80% చిన్న మధ్య స్థాయి కంపెనీలే. హైదరబాద్ సాఫ్ట్‌వేర్ పరిశ్రమ దాదాపు 4.5 లక్షల మంది ఐటీ నిపుణులకు నేరుగా ఉపాధి కల్పిస్తోంది. ఇందులో 70 శాతం మంది పెద్ద కంపెనీల్లో పని చేస్తుంటే.. 30 శాతం మంది చిన్న కంపెనీల్లో పని చేస్తున్నారు. హైసియాలో దాదాపు 340 కంపెనీలకు సభ్యత్వం ఉంటే.. 60 శాతం చిన్న కంపెనీలే. కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాల్లో కొత్త సొల్యూషన్లను అందించడానికి చిన్న, మధ్య స్థాయి సాఫ్ట్‌వేర్ కంపెనీలను (ఎస్ఎంఈ) తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహించనుందని, అనుకూలమైన విధానాలను తీసుకురావడానికి కసరత్తు చేస్తోందని రంగా అన్నారు.


2017-18లో 22,000 ఉద్యోగాలు: హైదరాబాద్ ఐటీ పరిశ్రమ ఏటా దాదాపు 30,000 నిపుణులకు కొత్త ఉద్యోగాలను ఇస్తోందని, విదేశాల్లో రక్షణాత్మక విధానాలు, వీసా ఇబ్బందుల వంటి ప్రతికూల పరిస్థితుల కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2017-18) అదనంగా 22,000 ఉద్యోగావకాశాలను కల్పించే వీలుందని వివరించారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, కృత్రిమ మేధ, రోబోటిక్స్, భద్రత, 3డీ ప్రింటింగ్ వర్చ్యువల్ రియాలిటీ రంగాలు పరిశ్రమ వృద్ధికి దోహదం చేయగలవని ఐడీసీ దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్ జైదీప్ మెహతా తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఐటీ ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్ కూడా పాల్గొన్నారు.



హైసియా ఎస్ఎంఈ సదస్సులో ప్రసంగిస్తున్న ఐడీసీ దక్షిణాసియా ఎండీ జైదీప్ మెహతా. వేదికపై హైసియా అధ్యక్షుడు రంగా పోతుల, తెలంగాణ ఐటీ ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్

29వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా(ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	362
బెంగళూరు	382	చెన్నై	397
30న		చిత్తూరు	390
విజయవాడ/గోదావరి	359	నమక్కల్	387

ఎన్ఎస్ఈ

మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1801.50 (1815.70) 396845
ADANI PORT & 383.30 (387.50) 3419877
AMBUJA CEMEN 275.00 (279.35) 2313805
ASIAN PAINTS 1151.70 (1155.90) 578071
AUROBIND PHA 731.05 (743.35) 1324890
AXIS BANK LT 503.60 (510.60) 3266295
BAJAJ AUTO L 2726.60 (2742.05) 175171
BANK OFBAROD 140.05 (144.25) 14024022
BHARTI AIRTE 428.10 (434.40) 1894924
BHARTI INFRA 380.30 (386.70) 1102703
BOSCH LTD 21693.35 (21843.35) 9535
BPCL 504.10 (508.00) 3872671
CIPLA 568.90 (574.10) 608351
COAL INDIA L 238.25 (243.60) 3051560
DR. REDDYS 2042.05 (2049.40) 607366
EICHER MOTOR 30859.15 (31288.35) 30498
GAIL 379.00 (382.00) 911768
HCL TECH 852.55 (867.65) 972794
HDFC 1727.80 (1766.45) 3262401
HDFC BANK 1746.15 (1762.25) 1229649
HERO MOTOCOR 3945.70 (3959.20) 397802
HINDALCO IND 227.30 (233.55) 9095620
HINDUSTAN UN 1190.45 (1199.70) 1002082
ICICI BANK 299.50 (300.90) 12737088
INDIABULLS H 1202.30 (1223.25) 1555390
INDIAN OIL 434.50 (440.70) 5179416
INDUSINDBANK 1643.30 (1660.55) 514823
INFOSYS LTD 927.45 (941.00) 6684696
ITC 280.25 (282.45) 6141239
KOTAK MAHIND 964.40 (976.05) 1314765
LARSEN & TOU 1130.05 (1138.90) 1045267
LUPIN 989.30 (991.20) 1024339
M&M 1376.95 (1373.05) 537856
MARUTI SUZIK 7521.50 (7579.00) 368309
NTPC LTD 168.40 (173.30) 21689918
ONGC 157.25 (160.60) 7756416
POWER GRID C 215.30 (217.10) 6882489
RELIANCE IND 1532.15 (1566.55) 3466421
SBI 277.00 (279.35) 10335964
SUN PHARMA 481.80 (493.20) 2605383
TATA CONSULT 2470.85 (2487.30) 656301
TATA MOT DVR 220.25 (225.20) 2460328
TATA MOTORS 376.10 (379.30) 4689547
TATA POWER 76.95 (78.85) 4659510
TATA STEEL L 630.20 (635.85) 3443278
TECH MAHINDR 431.75 (427.75) 3282938
ULTRATECH 3931.60 (3984.15) 165202
VEDANTA LIMI 299.05 (301.35) 10967755
WIPRO 290.75 (290.70) 1759428
YES BANK LTD 1721.55 (1753.35) 1762697
ZEE ENTERTAI 518.25 (517.90) 1432981

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1351.25 (1364.35) 9926
ASHOK LEYLAN 105.05 (105.70) 6338922
BAJAJ FINANC 1773.40 (1829.95) 1482257
BAJAJ FINSER 5442.95 (5578.00) 150716
BEL 185.15 (188.85) 2863759
BHEL 126.85 (127.95) 2505658
BRITANNIA 4172.60 (4188.30) 165131
CADILA HEALT 498.60 (501.95) 1575472
COLGATE PALM 1096.80 (1100.25) 130593
CONTAINER 1259.90 (1286.90) 173199
CUMMINS INDI 902.25 (895.25) 238267
DABUR INDIA 309.25 (312.70) 879513
DIVIS LAB 687.45 (694.90) 958208
DLF LIMITED 181.60 (180.10) 24287507
EMAMI LIMITE 1075.65 (1076.80) 445766
GLAXOSMI CON 5349.85 (5356.40) 3190
GLAXOSMI PHA 2435.80 (2422.90) 5327
GLENMARK PHA 615.05 (625.60) 450356
GODREJ CONSU 915.10 (939.85) 464453
HAVELLS INDI 481.25 (489.35) 596181
HINDUSTAN ZI 284.10 (286.50) 1383936
HPCL 466.95 (463.30) 5017565
ICICI PRU LI 424.30 (431.50) 524868
IDEA CELLULR 87.45 (89.85) 7281004
INTERGLOBE A 1172.05 (1185.95) 413571
JSW STEEL LT 246.90 (244.50) 3793852
LIC HOUS.FIN 659.00 (656.60) 1952221
MARICO LIMIT 312.65 (318.25) 982750
MCDOWELL 2563.55 (2571.80) 259188
MOTHERSON 303.80 (311.75) 3338504
NHPC LTD 29.00 (29.20) 4957529
NMDC LTD 121.80 (122.40) 1544029
OIL INDIA 289.20 (288.10) 462720
ORACLE FIN S 3456.50 (3465.20) 24633
P&G HYG&HEAL 8246.45 (8265.50) 790
PETRONET LNG 222.95 (224.90) 2347177
PIDILITE IND 827.25 (836.15) 295714
PIRAMAL ENTE 2657.15 (2690.65) 113033
PNB 141.00 (144.85) 6956667
POWER FIN CO 120.70 (122.60) 3147013
RURAL ELEC C 164.45 (165.15) 7299993
SAIL 61.05 (61.50) 5909878
SHREE CEMENT 17363.15 (17565.40) 12630
SHRIRAM TRAN 971.60 (981.45) 369343
SIEMENS 1273.10 (1292.60) 156521
SUN TV LTD 701.40 (715.50) 642314
TITAN IND 600.45 (612.25) 1078030
TORRENT PHAR 1217.10 (1238.25) 64099
UNITED BREWE 802.10 (820.20) 199608
UPL LIMITED 840.15 (839.10) 1066800

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 174.95 (178.10) 696243
ADANI ENTERP 118.95 (119.20) 9812669
ADANI POWER 29.80 (30.30) 12705445
ALL BANK 67.10 (68.65) 2861290
AMARA RAJA 763.65 (772.20) 283480
ANANT RAJIND 54.55 (56.50) 555002
ANDHRA BANK 51.80 (52.65) 1860922
APOLLO HOSPI 1077.05 (1092.65) 210879
APOLLO TYRES 249.15 (252.60) 6524043
APTECH 301.90 (302.40) 3013746
BAJAJ ELECT. 337.10 (340.90) 186304
BAJAJ HIND 14.55 (14.90) 2536979
BAJAJ HOLDIN 2970.80 (2834.00) 72575
BALAJI TELE 166.65 (170.10) 309384
BALLARPUR IN 12.95 (13.20) 759242
BALRAMPUR CH 168.85 (173.05) 1520878
BANK OF MAHA 26.90 (27.00) 80329
BANK OFINDIA 141.65 (143.75) 5334375
BATA INDIA 675.75 (681.05) 707115
BGR ENERGY S 132.10 (135.35) 45075
BHARAT FORGE 1129.10 (1161.95) 570738
BHUSHAN STEE 68.05 (70.00) 457873
BIOCON LTD 342.55 (344.10) 1564031
BOMBAY DYE 93.70 (92.60) 14406918
CANARA BANK 337.45 (339.05) 1280751
CEAT LIMITED 1653.55 (1651.75) 730636
CENTRAL BANK 77.95 (80.30) 2642115
CHAMBAL FERT 147.80 (148.85) 651782
CHENNAI PETR 424.05 (417.05) 3091984
CITY UNIBANK 159.15 (159.00) 192981
CORPO BANK 45.10 (46.55) 174223
COX & KINGS 262.40 (264.05) 42788
D B REALTY L 36.05 (37.10) 204244
DELTA CORP L 185.05 (186.45) 6411137
DENA BANK 30.85 (31.40) 458033
DHANALAKBANK 34.25 (34.55) 278867
EDELWEISS CA 240.10 (237.50) 2863637
EDUCOMP SOLU 7.90 (8.00) 103052
EID PARRY 316.45 (320.10) 129309
EIH 133.65 (133.15) 304143
ESSAR SHIPPI 29.40 (30.65) 1308393
ESTER INDUST 37.25 (32.15) 517209
EXIDE INDUST 195.55 (200.05) 1501800
FEDERAL BANK 107.75 (109.65) 4854092
FINOLEX CABL 528.20 (534.20) 36832
G E SHIP LTD 387.10 (390.65) 41014
GAMMON INDIA 8.25 (8.35) 451080
GAMMON INFRA 3.80 (3.85) 5478098
GATI LIMITED 113.30 (114.40) 590376
GAYATRI PROJ 178.10 (179.85) 89396
GITANJALIGEM 60.75 (61.25) 147025
GMR INFRASTR 16.85 (17.45) 19985526
GODREJ IND 601.95 (613.80) 202420
GRASIM IND 1132.85 (1143.00) 857870
GUJ ALK&CHEM 439.75 (433.60) 167002
HCL INFOSYS 47.95 (46.90) 8599823
HEXA TECH 270.05 (274.00) 818894
HIMACHAL FUT 17.00 (17.50) 5434306
HINDU MOTORS 7.95 (8.00) 97030
HOUSING DEV 60.30 (62.10) 11190582
IDBI 55.45 (56.00) 2420587
IDFC 54.05 (55.00) 3161546
IFCI 23.60 (23.85) 4525691
IL&FS TRANS 80.35 (83.35) 168926
IND SWIFTLAB 33.05 (34.15) 34069
INDBULLS REL 224.60 (231.80) 7801806
INDIA CEM 171.00 (180.25) 5149649
INDIAN BANK 289.50 (293.95) 633505
INDO RAMA SY 26.90 (27.25) 21286
INDRAPRASTHA 1241.55 (1242.75) 437774
IND-SWIFTLTD 7.35 (7.40) 8258
INGERSOLL-R 798.20 (808.75) 6469
IOB 22.60 (22.95) 381171
IPCA LAB 415.25 (417.35) 39441
J&K BANK 78.35 (81.60) 421367
JAI CORP 78.60 (78.95) 616159
JAIN IRRIGAT 96.00 (98.20) 3099092
JAYPEE INFRA 16.05 (15.60) 15770015
JAYSHREE TEA 98.75 (100.55) 25964
JET AIRWAYS 545.70 (574.60) 2651717
JINDAL SAW 91.15 (91.20) 1012836
JINDAL STEEL 131.40 (135.85) 6335762
JK LAKSHMI C 414.05 (413.05) 203495
JK PAPER LIM 98.85 (100.05) 670466
JM FINANCIAL 126.35 (126.00) 854022

ఘనం (+)

నిఫ్టీ	29న	మార్పు %
TECH MAHINDRA	431.75	0.94
M & M	1376.95	0.28
ZEE ENTERTAINMENT	518.25	0.07
WIPRO	290.75	0.02

గ్రహణం (-)

నిఫ్టీ	29న	మార్పు %
BANK OF BARODA	140.05	-2.91
NTPC	168.40	-2.83
HINDALCO	227.30	-2.68
TATA POWER	76.95	-2.41
SUN PHARMA	481.80	-2.31

JP ASSOCIATS 21.25 (23.50) 121719305
JSW ENERGY L 65.35 (66.90) 11020497
JUBILANT FOO 1344.85 (1382.50) 658811
JUBILANT ORG 699.55 (718.10) 269074
JYOTHY LABS 382.75 (377.60) 23588
KARNATA BANK 147.90 (152.55) 1723261
KEC INTL LTD 312.05 (303.55) 823071
KOLTE PATIL 159.70 (161.85) 83988
KPIT CUMMINS 116.15 (118.10) 908673
L&TFIN.HOLD 189.65 (188.05) 20263224
LAK VIL BANK 174.70 (175.25) 515047
M & M FINANC 411.40 (418.40) 1376432
MANAPPURAM G 92.75 (95.60) 4767689
MMTC LIMITED 55.50 (56.35) 490900
MOSER-BEAR 4.35 (4.45) 287771
MPHASIS LTD 609.60 (614.45) 47531
MRPL 126.40 (128.00) 3421030
MTNL 19.25 (19.55) 1631473
NAGARJUNA OI 3.45 (3.60) 666737
NCC LIMITED 84.35 (86.50) 1897452
NETWORK18 FI 48.90 (50.30) 248563
NEULAND LAB 1209.95 (1225.85) 14161
NIIT LTD 90.95 (94.20) 380389
NIIT TECHNOL 498.25 (495.10) 248883
OMAXE LTD 202.50 (204.80) 434087
ONMOBILE GLO 57.90 (58.70) 188124
ORIENT PAPER 92.30 (94.30) 191021
ORIENTALBANK 124.45 (125.70) 2079794
PATEL ENGG 70.15 (71.00) 124001
PFIZER 1806.85 (1811.45) 4956
POLARIS SOFT 242.00 (242.15) 28131
POWERTRADING 114.25 (115.40) 1654710
PRAJ IND 67.40 (69.10) 190051
PRISM CEMENT 109.45 (110.05) 58151
PROVOGUE (IN 4.10 (4.15) 72405
PUNJ LLOYD 18.80 (19.20) 838999
PUNJAB & SIN 48.30 (49.00) 33840
PURAVANKARA 70.90 (71.35) 70484
PVP VENTURES 5.40 (5.40) 183295
PVR LIMITED 1261.50 (1276.25) 120692
RADICO KHAIT 161.50 (164.55) 621995
RAJ OIL MILL 1.30 (1.25) 4538
RAJESH EXPOR 731.35 (743.20) 400997
RALLIS INDIA 228.30 (231.00) 58710
RAMCO IND 255.05 (264.45) 200621
RAMCO SYS 353.35 (353.60) 87149
RAMKY INFRA 82.55 (83.10) 29065
RAYMOND 756.20 (765.15) 1037727
RELIANCE CAP 769.50 (788.05) 5147509
RELIANCE COM 22.55 (23.25) 19376067
RELIANCE INF 498.20 (483.80) 11154685
RELIANCE POW 39.75 (40.25) 4516296
ROLTA INDIA 53.00 (53.35) 214165
SAGAR CEMENT 822.95 (814.75) 3371
SAREGAMA 416.50 (426.30) 408238
SHANTHI GEAR 135.70 (133.55) 17195
SHIPPNG CORP 95.20 (94.90) 2334769
SHREE RENUKA 16.90 (17.35) 1701608
SINTEX IND 29.85 (30.65) 11955012
SOBHA DEVELO 376.75 (384.70) 59128
SOUTHINDBANK 27.55 (28.00) 6551979
SRS LIMITED 2.70 (2.80) 757402
STERLITE TEC 216.30 (223.25) 623732
SUJANA METAL 1.55 (1.65) 51858
SUN PHARMA 384.50 (389.45) 398750
SUND FASTNER 400.20 (397.65) 271245
SUZLON ENERG 16.25 (16.65) 30838027
SYND. BANK 64.55 (65.55) 1175926
TATA CHEM 586.60 (589.70) 339087
TATA COFFEE 132.55 (132.30) 280986
TATA COMMUN 648.00 (664.55) 476776
TATA GLOBAL 190.35 (193.30) 5679382
TATA METALIK 635.25 (636.20) 152166
TATA TELESER 6.55 (6.80) 1243840
THE INDIAN H 114.75 (112.85) 158179
TORRENT POWE 210.40 (213.65) 852495
TRIVENI ENGG 91.45 (93.85) 1206646
TTK PRESTIGE 6304.85 (6376.90) 780
TV TODAY NET 244.15 (243.30) 33100
TV18 BROADCA 36.15 (36.85) 2026142
TVS MOTOR 594.55 (604.65) 600362
UCO BANK 31.00 (31.50) 315183
UNION BANK 134.75 (136.65) 3037504
UNITECH 7.35 (7.65) 22134101
UNITED BANK 18.10 (18.45) 186832
USHA MARTIN 18.95 (19.20) 181596
VADILAL INDU 849.85 (857.15) 12264
VENKYS 1996.10 (2026.65) 88690
V-GUARD IND 182.95 (187.15) 598351
VIJAYA BANK 68.60 (70.85) 763401
VIP 216.20 (222.05) 780768
VOLTAS 520.05 (538.20) 1688156
ZEE LEARN LI 42.15 (42.80) 80916
ZUARI GLOBAL 119.15 (118.90) 3121
ZYDUS WELLNE 862.55 (878.35) 1605

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 759.45 (768.75) 2070
AMAR RAJA BA 764.20 (772.05) 15181
ANDHRA BANK 51.70 (52.75) 147447
ANDHRA CEMEN 9.96 (9.26) 133717
ANDHRA PAPER 291.45 (295.25) 3277
ANDHRA PETRO 30.50 (31.35) 20683
ANDHRA SUGAR 333.80 (337.40) 1986
ANJANI PORTL 241.65 (236.15) 6236
ASTRA MICROW 124.70 (125.20) 14546
AUROBINDO PH 731.45 (741.35) 74969
AVANTEL SOFT 252.05 (259.45) 2531
AVANTI FEEDS 1824.70 (1883.05) 17380
BALAJI AMIN 309.75 (311.80) 847
BARTRONICS 13.75 (13.95) 6680
BHAGIRA CHEM 183 (190.10) 4605
BHAGYA NAG 21.45 (21.65) 1652
BN RATHI SEC 33.35 (33.90) 6265
BRILLIANT SE 8.27 (8.68) 171291
CAMBRIDGE TE 79.35 (77.90) 23722
CONT COFFEE 275.05 (281.40) 99768
COROMAN FERT 435.75 (441.15) 18129
CYIENT LIMIT 527.50 (534.95) 1086
DIVI'S LAB 686.45 (694.60) 87745
DR REDDY 2043.55 (2045.95) 62911
GATI CORPN 113.50 (114.45) 104087
GAYATRI PROJ 177.70 (179.40) 2865
GMR INFRASTR 16.80 (17.45) 1719985
GOLDST INFRA 150.95 (143.90) 122309
GRANULES (I) 126.25 (130.15) 83723
GVK POWER 12.07 (12.03) 928476
HBL NIFE POW 47.60 (44.95) 135380
HERITAGE FOO 1462.90 (1423.70) 9323
IDL INDUSTRS 518.50 (525.05) 7575
ILFS ENGINEE 39.30 (40.65) 13864
INNAREDY COM 2.65 (2.70) 5203
IVRCL INFRAS 4.35 (5.01) 1241536
KAKATIYA CEM 342.70 (346.25) 4424
KAVERI SEED 540.35 (549.05) 55909
KCP LTD 103.60 (102.35) 20033
LANCO INDUS 352.90 (361) 15038
LANCO INFRAT 0.84 (0.88) 954292
LAURUS LABS 506.10 (513.20) 10679
MADHUCON PRO 28 (28.45) 17409
MIC ELECTRON 7.63 (7.82) 27566
MOLD-TEK.TEC 52.95 (53.15) 25775
MOLDTK PLA 289.90 (294.35) 4722
NAGARJAGRICH 35.10 (35.35) 10521
NAGARJAGRITE 3.90 (4.10) 2850
NATCO PHARMA 719.65 (714.20) 42029
NAVA BH VENT 121.40 (122) 18992
NCC 84.20 (86.55) 281337
NCL IND 234.80 (240.15) 21323
NEHA INTER 5.01 (4.75) 31108
NETTLINX 83.85 (84.30) 10970
NEULAND LAB 1226.25 (1235.95) 1649
NIHAR INFO 15 (16) 1914
NILE 600 (596.45) 5313
PANKAJ POLY 12.38 (12.14) 19984
PENNER IND 60.80 (63) 115606
PIONEER DIST 194.80 (200.10) 2434
PITTI LAMIN 59.90 (61.10) 14668
PRAJAY ENGS 9.04 (8.85) 19771
PREMIER EXPL 441.60 (446.55) 2299
PRISM CEMENT 109.20 (110.10) 11285
PRUDENTL PHA 3.79 (3.99) 172908
RAIN INDUSTR 139.40 (145) 263903
RAJ PACKAGIN 54.65 (59.25) 21678
SAMKRG PIST 259 (263.90) 9132
SATVAH. ISPA 42.55 (46.30) 41083
SMS PHARMA 77.05 (79.25) 6941
SPHERE GLOBA 45.65 (46.40) 3766
SREE RAYAL A 29.20 (30.85) 273083
STEEL EXCHAN 82 (82.60) 77623
SUJANA METAL 1.58 (1.66) 5373
SUJANA TOWER 4.02 (4.30) 5120
SURYALAKSH.C 93.10 (99.40) 18157
SUVEN PHARMA 163.45 (166.75) 21149
TAJ GVK HOTE 150.95 (153.50) 1878
TANLA 32.65 (32.75) 44545
TERA SOFTWAR 63.45 (63.65) 2993
VICEROY HOTE 18.65 (18.40) 48181
VISAKA IND 617.25 (627.05) 56176
VISTA PHARMA 31.85 (33.50) 29611
VIVIMED LABS 99.70 (102.55) 78853
YBRANT DIGIT 5.78 (6.18) 686598
ZENTECH 49.60 (50.50) 33283

ఏఎన్‌డీఏ పరిశీలన రుసుము పెంపు

ఈనాడు, హైదరాబాద్: అమెరికా విపణిలోకి జనరిక్ ఔషధాన్ని ప్రవేశపెట్టడానికి చేసే దరఖాస్తు పరిశీలన రుసుమును అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్‌ఎఫ్‌డీఏ) పెంచింది. అమెరికాలో జనరిక్ ఔషధాలను విడుదల చేయడానికి భారత కంపెనీలు అధికంగా అబ్రివియేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్ల (ఏఎన్‌డీఏ)ను దాఖలు చేస్తున్నాయి. ఏఎన్‌డీఏ రుసుమును లక్ష డాలర్ల మేరకు పెంచి 1.71 లక్షల డాలర్లు చేసినట్లు యూఎస్‌ఎఫ్‌డీఏ తెలిపింది. 2016లో యూఎస్‌ఎఫ్‌డీఏ 598 ఏఎన్‌డీఏలకు అనుమతి ఇవ్వగా అందులో 201 ఏఎన్‌డీఏలు భారత కంపెనీలకు చెందినవి. ఏఎన్‌డీఏల పరిశీలన రుసుము పెంపు ప్రభావం దేశీయ ఔషధ కంపెనీలపై ఉండే అవకాశం ఉంది.

అక్టోబరులో కొత్త పారిశ్రామిక విధానం!

దిల్లీ: ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానాన్ని అక్టోబరులో వెలువరచే అవకాశం ఉంది. పారిశ్రామిక సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతరత్రా ఆర్థిక వేత్తలు సహా అందరితోనూ చర్చలు జరపనున్నట్లు వాణిజ్య మంత్రి నిర్మలా సీతారామన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తయారీ, సూక్ష్మ, చిన్న మధ్య స్థాయి పరిశ్రమలు, సాంకేతికత, వినూత్నత, వ్యాపారాన్ని సులువుగా చేసుకునేలా వీలు కల్పించడం, మౌలిక వసతులు, పెట్టుబడులు, వాణిజ్య, ద్రవ్య విధానం, నైపుణ్యాలు, ఉద్యోగిత వంటి కీలక రంగాలకు విధానంలో చోటు ఉండొచ్చు. 1991లో ప్రవేశపెట్టిన విధానం స్థానంలో కొత్త పారిశ్రామిక విధానాన్ని తీసుకురావడానికి గత మేలో పారిశ్రామిక విధాన, ప్రోత్సాహకాల విభాగం ప్రక్రియను మొదలుపెట్టిన సంగతి తెలిసిందే.

ఆసుపత్రి గది అద్దెపై జీఎస్‌టీ లేదు

సీబీఈసీ స్పష్టీకరణ

దిల్లీ: ఆసుపత్రుల్లో గదికి చెల్లించే అద్దెకు జీఎస్‌టీ నుంచి మినహాయింపు ఉందని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) స్పష్టం చేసింది. వివిధ రకాల సేవలకు సంబంధించి జీఎస్‌టీ పన్ను రేట్లపై సందేహాలకు సమాధానాలిస్తూ ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే ఆహారం, పానీయాల సరఫరా సహా ఎలాంటి సేవకైనా 5 శాతం జీఎస్‌టీ చెల్లించాలని పేర్కొంది. మరోవైపు హోటళ్లో గదులు, అతిథి గృహాలపై ప్రకటిత (డిక్లేర్డ్) అద్దెపై కాకుండా చెల్లించిన మొత్తం అద్దె ప్రకారం పన్ను రేటు వర్తిస్తుందని పేర్కొంది. ప్రకటిత టారిఫ్‌లు కేవలం పన్ను రేట్ల స్లాబ్‌ను నిర్దేశించడానికి మాత్రమేనని పేర్కొంది. వెబ్‌సైట్‌ల్లో, ప్రచార ప్రతుల్లో, హోటల్ రిసెప్షన్ ప్రకటన బోర్డులో ఏదైతే అద్దెను నిర్ణయించారో దానిని ప్రకటిత అద్దెగా పరిగణిస్తారు. హోటళ్లలో గది అద్దె రూ.1000 లోపు ఉంటే జీఎస్‌టీ వర్తించదు. రూ.1000- రూ.2,500 లోపైతే 12%, రూ.2,500- 7,5000 మధ్య అద్దె ఉంటే 18% జీఎస్‌టీని చెల్లించాల్సి ఉంటుంది. అదే రూ.7,500 మించితే 28% జీఎస్‌టీ విధిస్తారు. ఒకవేళ అదనపు పడక (బెడ్)ను తీసుకుంటే గది అద్దెతో పాటు దీని అద్దెకు కలిపి ఎంతైతే చెల్లిస్తారో ఆ మొత్తంపై పన్ను వర్తిస్తుందని సీబీఈసీ తెలిపింది. అదే అధిక అద్దె విభాగం గదులకు ప్రకటిత ధర ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.



పెద్ద కార్లపై సెస్సు పెంపు

ఆర్డినెన్స్‌పై నేడు చర్చ



మధ్య తరహా, పెద్ద కార్లు, ఎస్‌యూవీలపై సెస్సును పెంచేందుకు ఆర్డినెన్సు జారీ చేసే అంశాన్ని నేడు కేంద్ర మంత్రివర్గం (కేబినెట్) పరిశీలించే అవకాశం ఉంది. ప్రస్తుతం జీఎస్‌టీలో ఈ కార్లపై 15 శాతం పన్ను రేటు ఉంది. దీనిని 25 శాతానికి పెంచుతూ ప్రభుత్వం ఆర్డినెన్సు తేవాలని భావిస్తుంది. నేడు కేంద్ర మంత్రివర్గం పరిశీలించనున్న అంశాల జాబితాలో సెస్సు పెంపు ఆర్డినెన్సు ఉందని ఓ అధికారి వెల్లడించారు. పలు రకాల పన్నులు జీఎస్‌టీ కిందకు తేవడంతో జులై 1వ తేదీ నుంచి చాలా ఎస్‌యూవీల ధరలు రూ.1.1 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు తగ్గాయి. ఇప్పుడు సెస్సు పెంచితే వీటి ధరలు పూర్వస్థితికి పెరుగుతాయి. మరోవైపు ఎస్‌యూవీలు, మధ్య తరహా, పెద్ద, విలాసవంత కార్లపై సెస్సు పెంపు ప్రతిపాదనకు ఇప్పటికే జీఎస్‌టీ కౌన్సిల్ కూడా ఆమోదం తెలిపింది. సెస్సు పెంచాలంటే జీఎస్‌టీ చట్టంలో మార్పులు చేయాల్సి ఉంటుంది.

పర్యాటక ఏజెంట్లు ఐటీసీ పొందొచ్చు

ఎయిరిండియా



జీఎస్‌టీ విధానంలో విమాన టికెట్ల అమ్మకంపై పర్యాటక ఏజెంట్లు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను (ఐటీసీ) పొందొచ్చని ఎయిరిండియా తెలిపింది. సెప్టెంబరు 1 నుంచి నెల రోజుల వరకు ట్రావెల్ ఏజెంట్లు ఈ సదుపాయాన్ని పొందొచ్చని పేర్కొంది. జీఎస్‌టీ అమలు అనంతరం పర్యాటక ఏజెంట్లు ఐటీసీ పొందే విషయంపై సందిగ్ధత నెలకొంది. అయితే పర్యాటక ఏజెంట్లు ఐటీసీని పొందే విషయంపై రానున్న కొన్ని నెలల్లో పౌర విమానయాన మంత్రిత్వశాఖ, విమానయాన పరిశ్రమ పరస్పరం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భావించి ఎయిరిండియా పై ప్రకటనను చేసింది. 'పర్యాటక ఏజెంట్లను ప్రథమ ప్రయాణికులుగా భావిస్తాం. మేం విధించిన జీఎస్‌టీపై వాళ్లు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకోవచ్చు. అందువల్ల పర్యాటక ఏజెంట్లు ప్రయాణ సేవ కింద వాళ్ల వినియోగదార్లకు ఇన్‌వాయిస్‌ను ఇవ్వొచ్చ'ని అందులో పేర్కొంది.

రూ.8000 కోట్లు ఇరుక్కుపోయాయ్

జేజీఈపీసీ

జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక రత్నాభరణాల ఎగుమతిదార్ల మూల ధనం దాదాపు రూ.8,000 కోట్లు వరకు ఇరుక్కుపోయిందని ఆభరణాలు, రత్నాల ఎగుమతుల ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) తెలిపింది. 'ఎగుమతిదార్లపై జీఎస్‌టీ విధింపుతో వజ్రాభరణాల ఎగుమతిదార్ల సొమ్ము రూ.4,000 కోట్లు ఇరుక్కుపోయింది. అంతే మొత్తంలో పసిడి ఆభరణాల ఎగుమతిదార్ల ధనం కూడా. ఈ మొత్తాన్ని తిరిగి ఎక్కడ నుంచి పొందాల'ని జీజేఈపీసీ జాతీయ ఛైర్మన్ ప్రవీణ్ శంకర్ పాండ్యా తెలిపారు. భారత్‌లో తయారీలో (మేకిన్ ఇండియా) కీలక పాత్ర పోషించే పరిశ్రమకు ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. అలాగే ప్రత్యేక నియంత్రణ సంస్థను కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు.

జులైలో జీఎస్‌టీ వసూళ్లు
రూ.92,983 కోట్లు



జీఎస్‌టీ విధానం అమల్లోకి వచ్చిన తొలి నెలలో పన్నుల వసూళ్లు రూ.92,983 కోట్లుగా నమోదయ్యాయని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. 'కొత్త పన్ను విధానం కింద 59.57 లక్షల మంది పన్ను చెల్లింపుదార్లు నమోదు చేసుకున్నారు. వీరిలో 64.4 శాతం మంది నుంచి పన్నులు వసూలయ్యాయి. మున్ముందు ఈ సంఖ్య పెరుగుతుంద'ని ఆయన చెప్పారు. మొత్తం పన్ను వసూళ్లలో కేంద్ర జీఎస్‌టీ కింద రూ.14,894 కోట్లు, రాష్ట్ర జీఎస్‌టీ కింద రూ.22,722 కోట్లు వచ్చాయి. సమీకృత (ఇంటిగ్రేటెడ్) జీఎస్‌టీ రూపేణా రూ.47,469 కోట్లు వసూలయ్యాయి. ఐజీఎస్‌టీ వసూళ్లలో దిగుమతులు రూ.20,964 కోట్లు దిగుమతులు ద్వారా వచ్చాయని జైట్లీ చెప్పారు. డీమెరిట్ వస్తువులపై సెస్సుల ద్వారా రూ.7,198 కోట్లు వచ్చాయని పేర్కొన్నారు. బడ్జెట్లో నిర్దేశించుకున్న లక్ష్యాలపై ఆయన మాట్లాడుతూ.. 'జులైలో కేంద్ర ప్రభుత్వం పన్ను ఆదాయ లక్ష్యం రూ.48,000 కోట్లు కాగా.. రాష్ట్రాలది రూ.43,000 కోట్లు. అంటే మొత్తం రూ.91,000 కోట్లు. ఈ ప్రకారంగా చూస్తే మేము లక్ష్యాన్ని అధిగమించినట్లేన'ని జైట్లీ వివరించారు. ఒకవేళ రాష్ట్రాలకు పరిహారం ఇచ్చేందుకు వసూలు చేస్తోన్న సెస్సులను మినహాయించినా కూడా, పన్ను చెల్లింపుదార్లు అందరూ రిటర్న్‌లను దాఖలు చేస్తే లక్ష్యాన్ని సాధించేస్తామని చెప్పారు.

రూ.32,320 కోట్లు చెల్లించండి

● వొడాఫోన్ ఒప్పందం కేసులో హచ్‌సన్‌కు ఐటీ నోటీసు

● ఇది చెల్లుబాటు కాదు: హెచ్‌టీఐఎల్

దిల్లీ: దేశంలో తమ మొబైల్ వ్యాపారాన్ని బ్రిటన్‌కు చెందిన వొడాఫోన్ గ్రూప్‌నకు విక్రయించిన ఒప్పందంలో ఆర్జించిన మూలధన లాభాలకు సంబంధించి పన్ను, వడ్డీ, జరిమానా రూపంలో రూ.32,320 కోట్లు చెల్లించాలని, హాంకాంగ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే హచ్‌సన్‌కు ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం నోటీసు జారీ చేసింది. 2007లో 11 బిలియన్ డాలర్ల (సుమారు రూ.70,400 కోట్ల)కు హెచ్‌సన్ తన మొబైల్ వ్యాపారాన్ని విక్రయించింది. రూ.7,900 కోట్ల పన్ను, రూ.16,430 కోట్ల వడ్డీతో పాటు రూ.7,900 కోట్ల జరిమానా (మొత్తం రూ.32,320 కోట్లు) చెల్లించాలని భారత ఐటీ విభాగం నుంచి నోటీసు అందినట్లు హాంకాంగ్ కుబేరుడు లైకా షింగ్‌కు చెందిన సీకే హచ్‌సన్ హోల్డింగ్స్ హాంకాంగ్ స్టాక్ ఎక్స్ఛేంజీకి తెలిపింది. తమ టెలికాం విభాగమైన హచ్‌సన్ టెలికమ్యూనికేషన్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (హెచ్‌టీఐఎల్) ఈ నోటీస్ అందుకుందని, దాని హేతుబద్ధతపై పోరాటం కొనసాగిస్తుందని వెల్లడించింది. పన్ను చెల్లించాలంటూ ఇప్పటివరకు వొడాఫోన్‌కు నోటీసులు జారీ చేసిన భారత ఐటీ విభాగం, హెచ్‌సన్‌కు తొలిసారిగా పన్ను నోటీస్ జారీ చేసింది.

- భారత మొబైల్ వ్యాపారంలో ఉన్న 67 శాతం వాటా మొత్తాన్నీ వొడాఫోన్‌కు విక్రయించినందుకు, రూ.37,400 కోట్ల లాభాలు పొందారంటూ, ముసాయిదా అంచనా ఆదేశాలను 2016 నవంబరు 24న హెచ్‌టీఐఎల్‌కు ఆదాయపు పన్ను విభాగం జారీ చేసింది.
- 2007 ఒప్పందంలో మూలధన లాభాలకు సంబంధించి రూ.7,900 కోట్ల పన్ను చెల్లించాలంటూ 2017 జనవరి 25 తేదీతో ఉన్న నోటీస్‌ను 2017 ఫిబ్రవరి 13న హెచ్‌టీఐఎల్ అందుకుంది. దీనితోపాటే వడ్డీ కింద రూ.16,430 కోట్లు చెల్లించాలని ఐటీ విభాగం కోరింది.
- 2017 జులై 3వ తేదీతో ఉన్న ఆదేశాల్లో మరో రూ.7,900 కోట్ల జరిమానా చెల్లించాలని ఉంది. ఇవి 2017 ఆగస్టు 9న అందినట్లు హెచ్‌టీఐఎల్ వెల్లడించింది.

పసిడి దిగుమతులపై జీఎస్‌టీ చెల్లించలేం

● బ్యాంకుల ఆందోళన ● త్వరలో డీజీఎఫ్‌టీతో సమావేశం

దిల్లీ: పసిడి దిగుమతులపై వర్తించే 3 శాతం ఏకీకృత వస్తువులు, సేవల పన్ను(ఐజీఎస్‌టీ)ను చెల్లించలేమని బ్యాంకులు అంటున్నాయి. ఈ విషయంపై వాణిజ్య బ్యాంకులతో మాట్లాడడానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ ఒక సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఆ మేరకు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. పసిడిని దిగుమతి చేసుకునే ఎమ్ఎమ్‌టీసీ వంటి ఏజెన్సీలు సైతం ఈ సమావేశంలో పాల్గొననున్నాయని ఆ అధికారి వివరించారు. భారత్‌లోకి బంగారాన్ని దిగుమతి చేసుకోవడానికి బ్యాంకులు, ఎమ్ఎమ్‌టీసీలకు ప్రభుత్వ అనుమతులున్న సంగతి తెలిసిందే. 'అంతక్రితం 3 శాతం ఐజీఎస్‌టీ లేదు. ఇపుడు మేం ఎందుకు అదనపు వ్యయం చేయాలని బ్యాంకులు ప్రశ్నిస్తున్నారు. ఎగుమతిదార్లపై ఆ వ్యయాన్ని బదిలీ చేయాలని బ్యాంకులు అంటున్నాయ'ని ఆ అధికారి తెలిపారు. ఈ నెల మొదట్లో బ్యాంకులు దిగుమతి చేసుకునే పసిడి, ఇతర లోహాలపై 3 శాతం ఐజీఎస్‌టీని చెల్లించాల్సి ఉంటుందని ఎక్సైజ్, కస్టమ్స్ కేంద్ర బోర్డు స్పష్టం చేసిన విషయం తెలిసిందే.



క్షి(వి)పణి కల్లోలం

● క్షిపణి ప్రయోగంతో ప్రపంచ మార్కెట్లు విలవిల

● మన సూచీలకు తాకిన సెగ ● 362 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

● 9800 దిగువకు నిఫ్టీ ● ఆజ్యంపోసిన రూపాయి ● దూసుకెళ్లిన పసిడి

ఉత్తర కొరియా దుందుడుకు చర్యలకు.. ఈసారి మార్కెట్లు బలయ్యాయి. జపాన్ మీదుగా క్షిపణి ప్రయోగం చేయడం ద్వారా బేర్‌ను నిద్రలేపింది. ఫలితంగా ప్రపంచ మార్కెట్లు చిగురుటాకులా వణికాయి. వరుసగా నాలుగు రోజుల పాటు లాభాల మీద ఉన్న సెన్సెక్స్, నిఫ్టీల జోరుకు కళ్లెం వేసింది. సూచీలను కకావికలం చేసి రూ.లక్షల కోట్ల సంపదను హరించేసింది. అమ్మకాలు వెల్లువెత్తడంతో రోజంతా నష్టాల్లోనే కదలాడిన మార్కెట్లు ఏ దశలోనూ కోలుకోలేక చతికిలపడ్డాయి. అంతర్జాతీయ భయాలతో రూపాయి బలహీనపడగా, పసిడి ధరలు దూసుకెళ్లాయి.

మార్కెట్ల జోరుకు ఊహించని కుదుపు. జపాన్ మీదుగా పసిఫిక్ సముద్రంలో ఉత్తర కొరియా చేసిన క్షిపణి ప్రయోగం.. మరోసారి అంతర్జాతీయ ఉద్రిక్తతలను పెంచింది. ఆసియా షేర్ల నష్టాలతో మొదలైన ఈ సెగ.. ఆ తర్వాత మన మార్కెట్లను తాకింది. ఫలితంగా అన్ని రంగ షేర్లకు తీవ్ర అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం సైతం ఇందుకు తోడైంది. విదేశీ మదుపర్లు భారీగా నిధులు వెనక్కి తీసుకోవడం సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ఇటీవల బాగా పెరిగిన షేర్లలో మదుపర్లు ముందు జాగ్రత్తతో లాభాలను స్వీకరించారు.

చివరి వరకూ నష్టాల్లోనే: సెన్సెక్స్ ఉదయం 31724.84 పాయింట్ల వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ఆద్యంతం అదే తీరు కొనసాగించిన సూచీ.. ఒకానొకదశలో 31,360.81 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 362.43 పాయింట్ల నష్టంతో 31,388.39 దగ్గర స్థిరపడింది. జులై 18 తర్వాత సూచీకిదే అత్యధిక ఒకరోజు నష్టం కావడం గమనార్హం. గత నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 491.97 పాయింట్లు పెరిగింది. ఇక నిఫ్టీ సైతం 116.75 పాయింట్లు కోల్పోయి 9,796.05 వద్ద ముగిసింది. గత తొమ్మిది నెలల్లో సూచీ అత్యధిక ఒకరోజు నష్టాన్ని చవిచూసింది. మార్కెట్లలో భారీ అమ్మకాలు వెల్లువెత్తిన నేపథ్యంలో దాదాపు రూ.1.38 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరైంది. నిన్న ట్రేడింగ్ ముగిసే నాటికి ఈ విలువ రూ.1,38,726.77 కోట్లు తగ్గి రూ.1,29,77,705 కోట్లుగా నమోదైంది.

బీఓబీ, టాటా పవర్ డీలా: నిఫ్టీ 50 సూచీ నుంచి వైదొలగనున్న నేపథ్యంలో బ్యాంక్ ఆఫ్ బరోడా, టాటా పవర్, టాటా మోటార్స్ డీవీఆర్, ఏసీసీ షేర్లు 3 శాతం వరకు డీలాపడ్డాయి. బీఓబీ 2.91% నష్టంతో రూ.140.05, టాటా పవర్ 2.4% తగ్గి రూ.76.95 వద్ద ముగిశాయి. టాటా మోటార్స్ డీవీఆర్ 2.19% కోల్పోయి రూ.220.25, ఏసీసీ 0.78 నష్టంతో రూ.1801.50 దగ్గర స్థిరపడ్డాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 29 డీలాపడ్డాయి. సన్‌ఫార్మా 2.35%, హెచ్‌డీఎఫ్‌సీ 2.20%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.17%, కోల్ ఇండియా 2.10%, ఓఎన్‌జీసీ 2.09%, భారతీ ఎయిర్‌టెల్ 1.51%, ఇన్ఫోసిస్ 1.45%, యాక్సిస్ బ్యాంక్ 1.39%, అదానీ పోర్ట్స్ 1.23%, కోటక్ బ్యాంక్ 1.07%, టాటా స్టీల్ 1.03% చొప్పున నష్టపోయాయి. మరోవైపు విప్రో (0.02%) ఒక్కటే రాణించిన వాటిలో ఉంది.

నేటి మార్కెట్

సూచీల బలహీనతలు కొనసాగొచ్చు. కొరియా తీరప్రాంతంలో తలెత్తిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పసిడి, యెన్ వంటి మదుపర్లు సురక్షిత పెట్టుబడి సాధనాలకు మళ్లుతున్నారని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఆగస్టు డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు దగ్గరపడటంతో మదుపర్లు ఆచితూచి అడుగేసే అవకాశం ఉంది. జపాన్ మీదుగా ఉత్తర కొరియా చేసిన క్షిపణి ప్రయోగంతో అంతర్జాతీయ మార్కెట్ల సెంటిమెంట్ బలహీనపడింది. ఉత్తర కొరియా తదుపరి పరిణామాలపై మదుపర్లు కన్నేయొచ్చు. ఆకర్షణీయమైన షేర్ల కొనుగోలుకు ఇది మంచి అవకాశమని కొంత మంది విశ్లేషకులు చెబుతున్నారు. నేడు నిఫ్టీ 50 పాయింట్ల నష్టంతో ప్రారంభం కావొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంటున్నారు. 9720 పాయింట్ల వద్ద మద్దతు, 9850- 9890 పాయింట్ల శ్రేణిలో నిరోధం ఎదురు కావొచ్చని అంచనా వేస్తున్నారు. మదుపర్లను ఉద్దేశించి ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి ప్రసంగించిన నేపథ్యంలో కంపెనీ షేర్లు వెలుగులోకి రావొచ్చు.

నేడు ఎక్స్ఛేంజీలు పనిచేస్తాయ్

ముంబయిలో భారీ వర్షాలు కురిసి సాధారణ జనజీవనానికి తీవ్ర ఆటంకం ఎదురైనప్పటికీ.. నేడు ఎక్స్ఛేంజీలు యథావిధిగా పనిచేయనున్నాయి. ఆ మేరకు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. భారీ వర్షాల కారణంగా మంగళవారం చాలా మంది ఉద్యోగులు ఇళ్లకు వెళ్లలేకపోయారని.. వారికి కార్యాలయంలో, దగ్గరి హోటళ్లలో బస ఏర్పాట్లు చేసి.. బుధవారం విధులకు హాజరయ్యేలా చూస్తున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ అధికారులు వివరించారు.

పసిడి.. మళ్లీ రూ.30000 పైకి

అంతర్జాతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపర్లు ఈక్విటీల నుంచి వైదొలిగి పసిడిపై దృష్టి పెట్టారు. దీంతో దేశీయ విపణిలో 10 గ్రాముల మేలిమి బంగారం మళ్లీ రూ.30000 పైకి చేరింది. ఒక్కరోజులోనే రూ.550 పెరగడం ఇందుకు కారణం. అంతర్జాతీయంగా సానుకూల పరిణామాలతో కొనుగోళ్లు పెరగడం ఇందుకు కలిసొచ్చాయని బులియన్ వర్తకులు చెబుతున్నారు. ఇక పరిశ్రమలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ పెరగడంతో కేజీ వెండి ధర రూ.900 లాభంతో రూ.41,100 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు పసిడి ధర 0.90% పెరిగి 1,322.41 డాలర్లకు చేరింది. గతనవంబరు 9 తర్వాత పసిడికిదే గరిష్ఠ స్థాయి. ఔన్సు వెండి సైతం 0.66% పెరిగి 17.54 డాలర్లుగా నమోదైంది.

10.4 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ

● 9% వార్షిక వృద్ధి రేటు ఉంటే 20 ఏళ్లలో సాధ్యమే

● యువత నైపుణ్యాలు పెంచుకోవాలి

● నీతి ఆయోగ్ సభ్యుడు సారస్వత్

ఈనాడు - హైదరాబాద్



విజయ్ కుమార్ సారస్వత్

భారత ఆర్థిక వ్యవస్థ ఏటా 9శాతం వృద్ధి చెందితే.. రానున్న 20ఏళ్లలో 10.4లక్షల కోట్ల డాలర్ల పరిమాణానికి చేరుకునే అవకాశం ఉందని నీతి ఆయోగ్ సభ్యుడు విజయ్ కుమార్ సారస్వత్ తెలిపారు. ప్రస్తుత వృద్ధి రేటుతో చూస్తే ఇది 5.6లక్షల కోట్ల డాలర్లు ఉండొచ్చని పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధి, ఆర్థికాభివృద్ధి ఈ రెండింటి మధ్య ఎంతో తేడా ఉందన్నారు. చైనా, భారత్ జీడీపీ అధికంగానే ఉందని, కానీ, ప్రజల ఆరోగ్యం, విద్య తదితర వాటిల్లో ప్రపంచంలోని ఎన్నో దేశాలకన్నా వెనకబడ్డాయనీ.. ఇదే ఆర్థిక వృద్ధికీ, సమగ్ర ఆర్థిక అభివృద్ధికీ తేడాను స్పష్టం చేస్తోందని తెలిపారు. మంగళవారం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో జరిగిన ఎనిమిదో డీన్ స్పీకర్ సిరీస్‌లో భాగంగా 'సమగ్రాభివృద్ధి: కల్పితమా? వాస్తవమా?' అనే అంశంపై ఆయన కీలకోపన్యాసం చేశారు. ఉన్న వనరులతో ప్రస్తుత తరం అవసరాలను తీరుస్తూ.. భవిష్యత్తు తరాలకు ఇబ్బంది రాకుండా చూసుకోవాలని, అప్పుడే స్థిరమైన వృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. హరిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి భూ వినియోగం, ప్రజా రవాణా, నీటి వనరుల ఏర్పాటు, విద్యుత్ సరఫరా ఇలా పలు అంశాల్లో సంస్కరణలను వేగంగా తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. 127 కోట్ల భారత జనాభాలో 50శాతం మంది 25ఏళ్లలోపు వారున్నారని, ఏటా 15లక్షల మంది ఇంజినీర్లు బయటకు వస్తున్నారని, వారిని సమర్థంగా ఉపయోగించుకోవాలని సూచించారు. దేశంలో 71శాతం మంది మొబైల్ ఫోన్లు వాడుతున్నారని, ఇంటర్నెట్ వినియోగం 8శాతం, సోషల్ నెట్‌వర్క్‌లను 3శాతం మంది వినియోగిస్తున్నారని తెలిపారు. డిజిటల్ ఇండియా సాధనలో ఇది ఇబ్బంది కలిగిస్తోందని పేర్కొన్నారు. ఆగిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేయాలంటే.. దాదాపు 16,000 కోట్ల డాలర్ల అవసరమన్నారు. సమగ్రాభివృద్ధిలో ప్రపంచంలోని 138 దేశాలను పరిగణనలోనికి తీసుకుంటే మన స్థానం 39 అని, ఇది మెరుగుపడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పలు రంగాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం పెరగాలన్నారు. స్మార్ట్ నగరాల అభివృద్ధి, అందరికీ ఇల్లు, డిజిటల్ ఇండియా, సులువుగా వ్యాపార నిర్వహణ, అందరికీ ఆర్థిక సేవలు, ప్రత్యామ్నాయ ఇంధన వినియోగం, వాహన రంగం ఇలా భారత్‌లో ఎన్నో అవకాశాలున్నాయని తెలిపారు. మన దేశంలో అసంఘటిత రంగాల భాగస్వామ్యాన్ని 25శాతాన్నే పరిగణనలోనికి తీసుకుంటే.. ప్రపంచంలోని చాలా దేశాలు 40శాతాన్ని లెక్కలోకి తీసుకుంటున్నాయని వివరించారు. భారత ఆర్థిక వ్యవస్థ సమగ్రాభివృద్ధి కోసం, వాటి ఫలితాలు పేదలకు అందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నారని తెలిపారు. జీడీపీ మీదే దృష్టి సారించకుండా, అన్ని రంగాల్లోనూ వృద్ధి కోసం కేంద్రం గత మూడేళ్ల నుంచి ప్రణాళికలు రచిస్తోందన్నారు. మన దేశం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడకుండా.. ఎగుమతులు చేసే స్థితికి చేరుకునేందుకు 'భారత్‌లో తయారీ' లక్ష్యమని, దీనికోసం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. రూ.10వేల కోట్లను కేటాయించినప్పటికీ.. ఎస్‌ఎంఈలు రూ.1,000 కోట్లను కూడా వినియోగించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అంకుర సంస్థలు తయారీ రంగంలో కాకుండా.. సాంకేతిక, సేవా రంగాలకే ఎక్కువగా పరిమితం అవుతున్నాయనీ, ఇందులోనూ 70శాతం అంకురాలు విఫలం అవడం లేదా ఇతర సంస్థల్లో విలీనం కావడం జరుగుతోందన్నారు. యువతలో నైపుణ్యాల అభివృద్ధికి ప్రతి రాష్ట్రం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరం ఉందని, దానికి కేంద్రం కూడా సహకారం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ రాజేంద్ర శ్రీవాస్తవ పాల్గొన్నారు.

నా ఆందోళన అంతా అదే

● పాత బోర్డు కార్పొరేట్ పాలన అధ్వానం

● మాజీ సీఎఫ్‌ఓకు భారీ పరిహారం ఎందుకు

● పనయా కొనుగోలులో అవకతవకలు

● నీలేకని రాకతో ప్రశాంతంగా నిద్రపోవచ్చు

● మదుపర్లతో ఎన్.ఆర్. నారాయణ మూర్తి



దిల్లీ: శేషశాయి ఆధ్వర్యంలోని పాత బోర్డు కార్పొరేట్ పాలనను సరిగా నిర్వర్తించలేదని సహ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్. నారాయణ మూర్తి మరోసారి ఆరోపించారు. సీఈఓ బాధ్యతల నుంచి సిక్కా నిష్క్రమించిన తర్వాత తొలిసారిగా మూర్తి మాట్లాడారు. పనయా కొనుగోలులో అవకతవకలు జరిగాయని మరోసారి ఆరోపించారు. మాజీ సీఎఫ్‌ఓకు భారీ పారితోషికాన్ని ఇవ్వడంపైనా మదుపర్లతో జరిగిన కాన్ఫరెన్స్ కాల్‌లో విమర్శలు గుప్పించారు. నందన్ నీలేకని కంపెనీ కొత్త ఛైర్మన్‌గా నియమితులు కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇన్ఫీలో మెరుగైన కార్పొరేట్ పాలనను నీలేకని నెలకొల్పగలరని అన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

కారణం చెప్పాలి: ఆర్. శేషశాయి, ఇతర సభ్యుల రాజీనామాతో బోర్డు పునరుజ్జీవమవడం మొదలుపెట్టింది. అయితే ఇంకా జరగాల్సింది ఎంతో ఉంది. నా ఆందోళన అంతా పాత బోర్డు పాటించిన అధ్వాన కార్పొరేట్ పాలన గురించే. వాటాదార్ల దీర్ఘకాల ప్రయోజనాలకు అనుగుణంగానే నా అడుగులు ఉంటాయి. అంతే తప్ప ఎప్పటికీ వ్యక్తిగత ప్రయోజనాల కోసమో, వ్యక్తిగత లాభాల కోసం పాకులాడను. సిక్కా రాజీనామాకు నేను కారణమంటూ వ్యక్తిగత దాడులకు దిగడం బాధ కలిగించింది. నాకు తెలిసినంత వరకూ భారత కార్పొరేట్ ప్రపంచంలో వ్యవస్థాపకులు సంప్రదాయం, విలువలనే అందించారు. మాజీ సీఎఫ్‌ఓ రాజీవ్ బన్సల్‌కు సునిశిత సమాచారం తెలుసునన్న కారణంగా భారీ మొత్తంలో పరిహారాన్ని అందించడాన్ని నేను వ్యతిరేకిస్తున్నా. బన్సల్‌కు ప్యాకేజీ ప్రకటించిన సమయంలో బోర్డు సమావేశ వివరాలను(మినిట్స్) నమోదు చేయలేదు. ఇన్ఫీలో అంతక్రితం ఏ సీఎఫ్‌ఓకు కానీ.. ప్రస్తుత సీఎఫ్‌ఓకు కానీ.. ఆ స్థాయిలో పరిహార మొత్తాన్ని అందించలేదు. అలా ఎటువంటి ఒప్పందాలు కూడా లేవు. మరి అలాంటపుడు ఎందుకు శేషశాయి ఆధ్వర్యంలోని బోర్డు అలా చేయాల్సి వచ్చిందో కారణం చెప్పాలి.

నివేదికలో వాటి ప్రస్తావనేదీ

ఇజ్రాయెల్ కంపెనీ పనయాను 20 కోట్ల డాలర్లతో కొనుగోలు చేయడంపై వెలువడిన ఆరోపణలపై బోర్డు స్వతంత్ర దర్యాప్తు జరిపింది. అయితే బోర్డులో జరిగిన తీవ్ర పాలనాపరమైన తప్పులు, సీఈఓ వేసిన తప్పటడుగులపై ఆ దర్యాప్తు జరిగిందా లేదా అన్నది నివేదికలో లేదు. అందుకే పూర్తి నివేదికను అందించాలని నేను కోరా. అలా జరగలేదు. నేను మళ్లీ అడుగుతున్నా. ఆ దర్యాప్తు సారాంశ పత్రంలో పాలనపరమైన తప్పుల గురించి; వాటిపై తీసుకున్న చర్యల గురించి ప్రస్తావించలేదు. దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి సైతం పాత బోర్డు నిరాకరించిందన్న విషయాన్ని మీరు గుర్తించాలి.


ఇక ప్రశాంతంగా నిద్రపోవచ్చు

నీలేకని ఛైర్మన్‌గా వచ్చారు. ఆయన నాయకత్వంలో ప్రశాంతంగా నిద్రపోవచ్చు. కార్పొరేట్ పాలన విషయంలో అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తారనే విశ్వాసం నాకుంది. ఆ విషయంలో తగిన దిద్దుబాటు చర్యలు తీసుకుంటారనే అనుకుంటున్నారు. ప్రస్తుత సీనియర్ మేనేజ్‌మెంట్‌పైనా నాకు విశ్వాసముందని పునరుద్ఘాటిస్తున్నా. నీలేకని ఇన్ఫోసిస్‌లో మంచి రోజుల(అచ్ఛే దిన్)ను తిరిగి తెస్తారనే భావిస్తున్నా. కంపెనీ చుట్టూ నీలి మేఘాలు కమ్ముకున్నపుడు ఎలా కార్యాచరణలోకి దిగాలన్నది తాజా పరిణామాలు పాఠం చెబుతున్నాయి. సంస్థను దీర్ఘకాలం నడపడానికి ఇది కీలకం.

ఈనాడు సినిమా



రాశీఖన్నా



'రాజు గారి గది 2'లో నాగార్జున

గది తలుపులు తెరచుకొన్నాయ్

నాగార్జున కథానాయకుడిగా నటించిన చిత్రం 'రాజు గారి గది 2'. సమంత, సీరత్ కపూర్ కథానాయికలు. ఓంకార్ దర్శకత్వం వహించారు. పీవీపీ సినిమాస్, మాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా తెరకెక్కించాయి. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. మంగళవారం నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా మోషన్ పోస్టర్‌ని విడుదల చేశారు. సెప్టెంబరు 20న ప్రచార చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. అక్టోబరులో 'రాజుగారి గది 2' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. "రాజుగారి గది సినిమాకీ ఈ కథకీ ఎలాంటి సంబంధం లేదు. కథ, కథనాలు కొత్తగా ఉంటాయి. సమంత ఓ ఆత్మ రూపంలో కనిపించనుంది. వినోదానికీ ప్రాధాన్యం ఉంద"న్నారు నాగార్జున. సంగీతం: తమన్

నా గర్వం అణిచేది వాళ్లే!

"అందరితోనూ కలివిడిగా ఉంటా. ఎవ్వరితోనైనా స్నేహం చేయడం నా స్వభావం. నాకు ఒక్కసారి పరిచయమైనా, మనసుకి నచ్చితే జీవితాంతం గుర్తుపెట్టుకొంటా" అంటోంది రాశీ ఖన్నా. ప్రస్తుతం ఎన్టీఆర్ 'జై లవకుశ'లో కథానాయికగా నటిస్తోంది. రాశీ మాట్లాడుతూ "నాకు స్నేహితులు ఎక్కువ. ఎందుకంటే నాకు నచ్చితే అంత త్వరగా విడిచిపెట్టను. ఎప్పుడూ టచ్‌లో ఉంటా. స్నేహం అంటే అలానే ఉండాలి. నా స్నేహితులెవరూ నా నుంచి ఏదీ ఆశించరు. నన్ను కథా నాయికగానే చూడరు. వాళ్ల దగ్గరే నేను నేనుగా ఉంటా. ఆ వాతావరణం నాకు నచ్చుతుంది. స్నేహంలో ఉన్న గొప్పతనం అదే. ఎంత స్థాయికి వెళ్లిన వ్యక్తినైనా పేరు పెట్టి, ఏకవచనంతో పిలవొచ్చు. ఆ హక్కు, అధికారం స్నేహితులకే ఉంటుంది. నా గురించి ఏదీ దాచకుండా ఉన్నది ఉన్నట్టుగా చెప్పేస్తారు. ఒక విధంగా నా గర్వం అణిచేది వాళ్లే" అంటోంది.

చరణ్ కోసం కథ సిద్ధమవుతోందా?



రామ్ చరణ్

మాస్, కమర్షియల్ చిత్రాలు తీయడంలో సిద్ధహస్తుడు బోయపాటి శ్రీను. అందుకే ఆయనతో కలసి పనిచేయడానికి అగ్ర కథానాయకులు ఎదురుచూస్తుంటారు. అయితే రొటీన్‌కి భిన్నంగా బెల్లంకొండ సాయిశ్రీనివాస్‌తో ఓ సినిమా చేశారు బోయపాటి. ఇప్పుడు మళ్లీ... తన స్టైల్‌లోకి వచ్చేశారు. ఓ అగ్ర కథానాయకుడి కోసం ఆయన ఓ కథ సిద్ధం చేసుకొన్నారు. ఆ కథలో రామ్ చరణ్ నటిస్తారని సమాచారం. మెగా హీరోలతో బోయపాటికి మంచి అనుబంధమే



బోయపాటి శ్రీను

ఉంది. అల్లు అర్జున్‌తో 'సరైనోడు' చేశారాయన. చిరంజీవి 152వ చిత్రానికీ ఆయనే దర్శకత్వం వహించనున్నారు. 2018 మేలో నందమూరి బాలకృష్ణతో ముచ్చటగా మూడోసారి జట్టు కట్టబోతున్నారు బోయపాటి. ఈలోగా ఓ సినిమా చేయాలన్నది ఆయన వ్యూహం. చరణ్ కూడా బోయపాటితో పనిచేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశారట. ప్రస్తుతం ఆయన 'రంగస్థలం 1985'తో బిజీగా ఉన్నారు. డిసెంబరు నాటికి ఆ పనులు పూర్తవుతాయి. ఆ తరవాత బోయపాటి సినిమా మొదలయ్యే అవకాశాలున్నాయి.

పంచ్ డైలాగ్

కథలు మనం చెప్పుకోకూడదు నాన్నా...
మన కథను ప్రజలు చెప్పుకోవాలి!
చిత్రం: గౌతమిపుత్ర శాతకర్ణి
- పంపినవారు: అంధవరపు నాగేశ్వరరావు, పలాస

మెయిల్ ఐడీ: cinema@eenadu.net



జాక్వెలైన్

దర్శకుడు రెమోనే!



సల్మాన్‌ఖాన్

'రేస్', 'రేస్ 2' చిత్రాలు బాక్సాఫీసు వద్ద మంచి వసూళ్లు రాబట్టాయి. 'రేస్ 3'ని సల్మాన్‌ఖాన్‌తో తీయాలనుకుంటున్నారు నిర్మాత రమేష్ తరణి. కానీ ఈ చిత్రానికి రెమో డిసౌజా దర్శకుడైతేనే చేస్తానని సల్మాన్ షరతు పెట్టాడు. ఇప్పుడు సల్మాన్ అనుకున్నదే జరిగింది. 'రేస్ 3'కి రెమోనే దర్శకత్వం వహించనున్నారు. ఈ విషయాన్ని రమేష్ తరణి వెల్లడించారు. "ఈ చిత్రంలో ప్రధాన పాత్రధారులుగా సల్మాన్‌ఖాన్, జాక్వెలైన్ ఎంపికయ్యారు. రెమో డిసౌజా దర్శకత్వం వహిస్తారు. అక్టోబరులో ముంబయిలో చిత్రీకరణ మొదలుపెడతాం. ఇప్పటి వరకూ వచ్చిన 'రేస్' చిత్రాలకు భిన్నంగా ఉంటుందీ చిత్రం. కథాపరంగా విదేశాల్లో ఎక్కువ భాగం తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నాం. మిగిలిన విషయాలు త్వరలోనే వెల్లడిస్తాన"ని చెప్పారు. సల్మాన్ ప్రస్తుతం 'టైగర్ జిందా హై' చిత్రీకరణతో బిజీగా ఉన్నాడు.

గీతోపదేశం

కలిమి నిలవదు లేమి మిగలదు
కలకాలం ఒక రీతి గడవదు
నవ్విన కళ్లే చెమ్మగిల్లవా
వాడిన బ్రతుకే పచ్చగిల్లదా
ఇంతేరా ఈ జీవితం
తిరిగే రంగుల రాట్నం

గీతం: ఇంతేరా ఈ జీవితం...
చిత్రం: రంగుల రాట్నం
రచన: భుజంగరాయ శర్మ
- పంపినవారు: కంది నరేష్, కరీంనగర్


చిరునామా:
సినిమా డెస్క్,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా- 501512



కళ్యాణ్‌రామ్

'ఎం.ఎల్.ఏ' గారు ఏం చేస్తున్నారు?

కళ్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఎం.ఎల్.ఏ'. మంచి లక్షణాలున్న అబ్బాయి అనేది ఉపశీర్షిక. కాజల్ కథానాయిక. ఉపేంద్ర మాధవ్ దర్శకుడు. సి.భరత్ చౌదరి, ఎంవీ కిరణ్ రెడ్డి నిర్మాతలు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఈనెలాఖరు వరకూ ఇక్కడే కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తారు. ఇప్పటికే 45 శాతం చిత్రీకరణ పూర్తయింది. 2019 ప్రథమార్ధంలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. 'ఎం.ఎల్.ఏ' అనే పేరు ఉన్నప్పటికీ రాజకీయ నేపథ్యం ఉన్న సినిమా కాదని చిత్రబృందం చెబుతోంది. అయితే కొన్ని సన్నివేశాల్లో కళ్యాణ్ రామ్ 'ఎం.ఎల్.ఏ' అవతారంలో కనిపిస్తారని సమాచారం. మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. "ఇదో పక్కా వాణిజ్య చిత్రం. మాస్‌కి నచ్చే అన్ని అంశాలూ ఉన్నాయి. కళ్యాణ్ రామ్ - కాజల్ జోడీ మరోసారి ఆకట్టుకొంటుంద"ని చిత్రబృందం తెలిపింది. ఛాయాగ్రహణం: ప్రసాద్ మూరెళ్ల



దీపికా పదుకొణె

'పద్మావతి' నాకొక ఛాలెంజ్!

దీపికా పదుకొణె బాలీవుడ్‌తో పాటు హాలీవుడ్‌లోనూ సత్తా చాటుతోంది. ఈ మస్తానీ భామకు అభిమానుల సంఖ్య ఎక్కువే. ట్విట్టర్‌లో ఈమెను అనుసరిస్తున్న వారి సంఖ్య 2 కోట్ల మైలురాయిని చేరుకొంది. ఆసియాలో ఎక్కువ మంది ఫాలోవర్స్ ఉన్న మహిళ కూడా దీపికానే. ఈ సందర్భంగా ట్విట్టర్‌లో అభిమానులతో కాసేపు ముచ్చటించింది దీపిక. ఫాలోవర్స్ 20 మిలియన్లు అయిన సందర్భంగా అభిమానులు అడిగిన ఓ 20 ప్రశ్నలకు సమాధానాలిచ్చింది. అందులోని కొన్ని ఇవీ...

- ఛాలెంజింగ్ సినిమా: పద్మావతి
- మీకు నచ్చిన సినిమా: డన్‌కర్క్
- మీకు కన్నీళ్లు తెప్పించిన మీ చిత్రం: పీకూ
- మీ అభిమాన టీవీ షో: ఒజార్క్
- మీకు ఇష్టమైన పుస్తకం: అగస్సీ
- అభిమానులకు ఇచ్చే సందేశం: నేను ప్రతీది చేస్తాను. అది మీ కోసమే. ఇదే నిజం
- మీ సూపర్ హీరో: నా తండ్రి
- మీలో ఆత్మవిశ్వాసాన్ని నింపేది: తల్లిదండ్రులు, నా సోదరి, నా స్నేహితులందించే ప్రోత్సాహం.
- ఇష్టమైన ఆట: బ్యాడ్మింటన్, ఈత
- బెంగళూరులో మీరు మర్చిపోలేనిది: అమ్మానాన్న ఉండే గది
- మీ ప్రస్తుత మానసిక స్థితి: ప్రశాంతం, సంతోషం
- ఓ అభిమాని ఐ లవ్ యు చెప్పగానే... రెండు చేతులు జోడించిన ఎమోజీని ట్వీట్ చేసింది దీపిక.



దివ్య, కిరణ్

సెల్‌ఫోన్‌లో దెయ్యం

కిరణ్, దివ్య నాయకానాయికలుగా నటించిన చిత్రం 'మళ్లీ వచ్చిందా?'. కె. నరేంద్రబాబు దర్శకత్వం వహించారు. వెంకటేష్.సి నిర్మాత. మంగళవారం హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని టి.ప్రసన్నకుమార్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "హారర్ చిత్రాల్లో దెయ్యం భయపెడుతుండడం మామూలే. ఇందులో ఆ భయం కొత్తకోణంలో ఉంటుంద"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "దెయ్యం మనుషుల్ని ఆవహించి రాత్రిళ్లు భయపెట్టడాన్ని హారర్ చిత్రాల్లో ప్రేక్షకులు చూశారు. ఇందులో మాత్రం దెయ్యం సెల్‌ఫోన్స్‌లో కనిపించి పగలే మనుషుల్ని భయపెడుతుండడం చూస్తార"న్నారు. సహనిర్మాతలలో ఒకరైన గురురాజ్ మాట్లాడుతూ "కుటుంబ ప్రేక్షకులకు నచ్చే అంశాలు ఉంటాయి. కొత్త తరహాలో సాగే హారర్ సినిమా. సెన్సారు పూర్తయింది. త్వరలోనే విడుదల చేస్తామ"న్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్, దివ్య, వెంకటేష్, శశికాంత్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమే నా ప్రాణం



నిఖితా రెడ్డి

శ్రీహరి కథానాయకుడిగా నటిస్తూ నిర్మించిన చిత్రం 'నీ ప్రేమే నా ప్రాణం'. నిఖితా రెడ్డి కథానాయిక. వై.రాజశేఖర్ దర్శకుడు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ "మాది వైజాగ్. నేనో డాక్టర్‌ని. చిన్నప్పటి నుంచీ సినిమాలంటే ఆసక్తి. ఓ చక్కటి ప్రేమకథతో ప్రేక్షకులకు పరిచయమవడం ఆనందంగా ఉంది. పాటలూ నేనే అందించా. ప్రేమలో కొత్త కోణాన్ని స్పృశించాం. వైజాగ్ అందాల్ని వెండి తెరపై చూపించామ"న్నారు.

ఈ సుందరే కందిరీగ



ఎవేంజెలైన్ లిల్లీ

సూపర్ హీరో గెటప్పులో ఉన్న ఈ భామ పేరు ఎవేంజెలైన్ లిల్లీ. 'యాంట్ మ్యాన్' సిరీస్‌లో వస్తోన్న మరో చిత్రం 'యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్'లో ఈమే వాస్ప్. అంటే చీమగాడితో నటించే కందిరీగ ఈమె. 'యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్'లో తన లుక్‌ను ట్విట్టర్‌లో పంచుకొంది లిల్లీ. జాక్ కిర్బీ వందో జన్మదినం సందర్భంగా ఈ ఫొటోను ట్వీట్ చేసింది లిల్లీ. ఇందులో చీమ పాత్రలో పాల్ రుడ్ నటిస్తున్నాడు. తన కామిక్ పుస్తకాల్లో ఐరన్ మ్యాన్, ది హల్క్, ఎక్స్ మ్యాన్ లాంటి ప్రేక్షకాదరణ పొందిన పాత్రల్ని సృష్టించారు కిర్బీ. పీటన్ రీడ్ దర్శకత్వంలో వస్తోన్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

దగదర్తి విమానాశ్రయానికి రెండు బిడ్లు!

ఈనాడు, అమరావతి: నెల్లూరు జిల్లాకు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న దగదర్తి విమానాశ్రయం నిర్మాణంలో మరో కీలక అడుగు పడింది. ఈ విమానాశ్రయ పనులు చేజిక్కించుకోవడానికి రెండు సంస్థలు పోటీ పడుతున్నట్లు సమాచారం. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ సంస్థ (బీఐఏసీఎల్)... దగదర్తి విమానాశ్రయ నిర్మాణం కోసం ఆసక్తి చూపుతున్న సంస్థల నుంచి టెండర్లు పిలిచింది. పోటీ పడిన రెండు సంస్థల్లో ట్రూ మెగా విమానయాన సంస్థ ఉన్నట్లు సమాచారం. దగదర్తిలో విమానాశ్రయాన్ని 'డిజైన్, నిర్మాణం, నిర్వహణ, బదిలీ' (డీబీఓటీ) విధానం కింద పబ్లిక్, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో నిర్మించనున్నారు. ఈ బిడ్లను బీఐఏసీఎల్ త్వరలోనే తెరవనుంది. రెండు సంస్థల్లో ఎవరు ఎక్కువ ఆదాయ వాటాను ఇవ్వడానికి ముందుకొస్తే వారికి పనులు అప్పగించనున్నారు. ట్రూ మెగా సంస్థ 9 శాతం ఆదాయ వాటా ఇవ్వడానికి కోట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై వ్యాఖ్యానించడానికి అధికారులు నిరాకరిస్తున్నారు. అయితే త్వరలోనే టెండర్లు ఖరారు చేసి మంత్రివర్గానికి నివేదిస్తామని... బీఐఏసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు

ఈనాడు, అమరావతి: పురపాలక ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కసరత్తు కొనసాగుతోంది. ఇటీవల ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలు కలిసి పురపాలక శాఖ సంచాలకులు కన్నబాబుతో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఆయా అంశాలను పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శికి పంపారు.

★ రాష్ట్రంలో తెలుగును పరిపాలనభాషగా ప్రకటించడంతో పాటు మాతృభాషాభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయాలని ఎమ్మెల్సీ నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

తెలుగు భాషే మన ఉనికి

- మాతృ భాషను మరచిపోతే అమ్మను మరచిపోయినట్టే
- తెలుగు భాషా దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



గిడుగు రామ్మూర్తి పంతులు ముని మనవళ్లను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

విజయవాడ: మాతృ భాష తెలుగును మరచిపోతే కన్న తల్లిని మరచిపోయినట్లేనని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడికిపోయినా తెలుగే మన ఉనికిని చాటుతుందన్నారు. ఇక్కడి ప్రజల కంటే విదేశాల్లో ఉన్న వారికే భాషాభిమానం ఎక్కువగా ఉందని; మన సంస్కృతి, సంప్రదాయాలను తూ.చ. తప్పకుండా ఆచరిస్తారని తెలిపారు. తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. తెలుగు వికాసానికి విశేష కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినం సందర్భంగా ఈ దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ రోజు తెలుగు భాషాభివృద్ధి కోసం పాటుపడిన వారిని స్మరించుకోవడంతో పాటు, వారిని ఆదర్శంగా తీసుకొని అంతా కర్తవ్యోన్ముఖులు కావాలన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దేశవిదేశాల్లో చాటిన నందమూరి తారక రామారావు పుట్టిన జిల్లాలో ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం అదృష్టమన్నారు. తమ పార్టీ పేరులోనే తెలుగుందని, ప్రజలకు తమ పార్టీ శాశ్వతంగా గుర్తుండిపోవాలనే ఎన్.టి.రామారావు ఈ పేరును సూచించారన్నారు. ప్రస్తుతం పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు కూడా పిల్లలను ఆంగ్లమాధ్యమంలో చేర్పిస్తున్నారని... అయితే ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియంలో చదివిన వారు కూడా విదేశాల్లో ఉన్నత పదవుల్లో ఉన్నారని గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. సిలికాన్ వ్యాలీలో అత్యధిక సంపాదన కలిగిన వారు మన తెలుగువారే అని చెప్పుకునేందుకూ గర్వంగా ఉందని అన్నారు. తెలుగు భాషాభివృద్ధి సాధికారత సంస్థ, ఏడు అకాడమీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి విడిపోయినప్పుడు తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన అనేక చిహ్నాలు చెన్నై వస్తు ప్రదర్శనశాలల్లో ఉండిపోయాయన్నారు. విభజన సందర్భంగా తెలంగాణలో ఉండిపోయిన మన పుస్తకాలు, జ్ఞాపికలను తిరిగి మన రాష్ట్రానికి తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో భాషా కోవిదులు, సాహితీవేత్తలు, భాషా సేవకులు పలువురికి పురస్కారాలు అందజేశారు. అనంతరం గిడుగు రామ్మూర్తి పంతులు మునిమనవళ్లను సత్కరించారు. పురస్కార గ్రహీతల వివరాలు www.eenadu.net లో.

7 అకాడమీల జీవో విడుదల

తెలుగు భాషాభివృద్ధికి సంబంధించిన సాహిత్య, సంగీత, నృత్య, నాటక, దృశ్యకళలు, జానపదాలు, విజ్ఞాన-సాంకేతిక అకాడమీల ఏర్పాటు జీవోను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ అకాడమీల సేవలు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. రాష్ట్ర శాసన సభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, పర్యాటక, భాషా, సాంస్కృతిక శాఖ మంత్రి భూమా అఖిల ప్రియ, రాష్ట్ర ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారాల టెండరుపై వ్యాజ్యం

ఈనాడు, హైదరాబాద్: టెండర్లు పిలవకుండానే ఏపీ శాసనసభ సమావేశాల ప్రత్యక్ష ప్రసారాల హక్కును 'అడ్వాన్స్డ్ కమ్యూనికేషన్స్'కు అప్పగించారంటూ మంగళగిరి వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ వ్యాజ్యంపై విచారించి అసెంబ్లీ కార్యదర్శి, అడ్వాన్స్డ్ కమ్యూనికేషన్స్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను సెప్టెంబరు 12కు వాయిదా వేసింది. మంగళవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఆరుగంటలు ప్రసారం చేస్తే రూ.75 వేలు చెల్లించేలా ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. టెండరు పిలవకుండానే పనులను అప్పగించారని కోర్టు దృష్టికి తెచ్చారు. వివరాలను పరిగణనలోకి తీసుకుని ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది.

బాలకృష్ణపై కేసు నమోదుకు ఆదేశాల కోసం..

ఈనాడు, హైదరాబాద్: నంద్యాల ఉపఎన్నిక సందర్భంగా ఓటర్లకు బహిరంగంగా డబ్బు పంపిణీ చేసిన హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణపై ఎన్నికల సంఘం కేసు నమోదు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ మంగళవారం ఉమ్మడి హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. బాలకృష్ణపై ప్రజాప్రాతినిధ్య చట్టం కింద కేసు నమోదు చేసేలా ఆదేశాలివ్వాలంటూ వైకాపా ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్ పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 16న తెలుగుదేశం అభ్యర్థి తరఫున చేపట్టిన ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారని, ఇందులో ఓటర్లకు బహిరంగంగా నోట్లను పంచారని పేర్కొన్నారు. ఆధారాలతో సహా ఎన్నికల అధికారులకు ఫిర్యాదుచేసినా కేసు నమోదు చేయలేదన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇందులో ప్రతివాదులుగా కేంద్ర ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి, బాలకృష్ణలను పేర్కొన్నారు.

ఆఖరి శ్వాసవరకూ 'జై జగన్' అంటూనే ఉంటా

సామాజిక మాధ్యమంలో వైకాపా ఎమ్మెల్యే రోజా

ఈనాడు అమరావతి: గెలుపైనా, ఓటమైనా, చావైనా, బతుకైనా ఆఖరి శ్వాసవరకూ 'జై జగన్' అంటూనే ఉంటా.. అని వైకాపా ఎమ్మెల్యే ఆర్‌కే రోజా వ్యాఖ్యానించారు. ఈ మేరకు మంగళవారం ఆమె అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో ఈ వ్యాఖ్యలను పోస్ట్ చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో వైకాపా పరాజయం నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. నంద్యాల ఫలితం వెలువడ్డాక రోజాపై సామాజిక మాధ్యమాల్లో వివిధ రకాల ప్రచారం సాగింది. వీటికి సమాధానంగానే ఆమె ఈ వ్యాఖ్యలు చేసినట్లు చెబుతున్నారు.

ఎన్నోసార్లు తెదేపాకు డిపాజిట్లు గల్లంతు: నాని

నంద్యాల ఉప ఎన్నిక ఫలితాలపై చంద్రబాబు అబద్ధాలు చెప్పారని వైకాపా ఎమ్మెల్యే కొడాలి నానీ విమర్శించారు. గతంలో అనేక ఉప ఎన్నికల్లో తెదేపా అభ్యర్థులు ఘోర పరజయాన్ని చవిచూశారని తెలిపారు. 2004 నుంచి 2014 వరకు 44 స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో 21 చోట్ల తెదేపా అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారని గుర్తు చేశారు. పదిచోట్ల మూడో స్థానంలో తెదేపా నిలిచిందన్నారు. 1983లో చంద్రబాబుకు చంద్రగిరిలో డిపాజిట్ కూడా దక్కలేదని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా నేతలపై ఇష్టమొచ్చినట్లుగా కేసులు ఎత్తివేశారని ఇందుకోసం జీవో జారీ చేశారని వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు.

నంద్యాల నాన్న... ఆళ్లగడ్డ అమ్మ

- నంద్యాలలో విజయంతో మా నాన్నను మళ్లీ బతికించుకున్నట్టు భావిస్తున్నా
- శిల్పా సోదరులు సవాలుకు కట్టుబడాలి
- మంత్రి భూమా అఖిలప్రియ వ్యాఖ్యలు



భూమా బ్రహ్మానందరెడ్డికి మిఠాయి తినిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు భూమా అఖిలప్రియ, అమర్‌నాథ్‌రెడ్డి, కాలవ శ్రీనివాసులు తదితరులు

ఈనాడు అమరావతి: నంద్యాల ఎన్నికల్లో సాధించిన గెలుపుతో తన తండ్రి భూమా నాగిరెడ్డిని మళ్లీ బతికించుకున్నట్టుగా భావిస్తున్నానని మంత్రి అఖిలప్రియ తెలిపారు. నంద్యాల తనకు నాన్న వంటిదని, ఆళ్లగడ్డ అమ్మ వంటిదని, ఈ రెండు నియోజకవర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. నంద్యాల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటామన్న హామీకి శిల్పా సోదరులు కట్టుబడి ఉండాలని ఆమె డిమాండ్ చేశారు. నంద్యాల ఉప ఎన్నికలో గెలిచిన తెదేపా అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డితో కలసి ఆమె మంగళవారం సాయంత్రం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబును కలిశారు. అనంతరం వీరిద్దరూ, కర్నూలు ఇన్‌ఛార్జి మంత్రి కాలవ శ్రీనివాసులుతో కలసి విలేఖరులతో మాట్లాడారు. "ఓటు ద్వారా మా నాన్నను బతికించినందుకు నంద్యాల ప్రజలకు కృతజ్ఞతలు. తెదేపాలో ఒక వ్యక్తి చనిపోతే పార్టీ ఏవిధంగా ఆ కుటుంబాన్ని ఆదుకుంటుందో, అండగా ఉంటుందో చెప్పడానికి ఇదే తార్కాణం. కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రతి ఒక్కరూ మాకు అండగా నిలిచారు. ఇలాంటి పార్టీలో ఉన్నందుకు ఆనందంగా, గర్వంగా ఉంది. ఎన్నికలయ్యాక మంత్రులు మళ్లీ వస్తారా? రారా? అన్న ఆలోచన ప్రజల్లో రాకూడదని, వెంటనే నియోజకవర్గానికి వెళ్లి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పాలని, కలెక్టర్‌తో మాట్లాడి సమన్వయం చేసుకోమని ముఖ్యమంత్రి చెప్పారు. 28 వేల మెజార్టీ ఇవ్వడం ద్వారా ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా తమకు ఎంత నమ్మకముందో, భూమా నాగిరెడ్డిపై ఎంత ప్రేమ ఉందో నంద్యాల ప్రజలు నిరూపించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఇదే స్థాయిలో ఓట్లు వేస్తారు" అని అఖిల ప్రియ పేర్కొన్నారు.

బాబాయి బాటలో నడుస్తా

నంద్యాల ప్రజలు భూమా నాగిరెడ్డిపై పెంచుకున్న ప్రేమాభిమానాల్ని ఓటు ద్వారా తెలియజేయడం చాలా సంతోషంగా ఉందని, బాబాయి నాగిరెడ్డిలానే తాను కూడా నంద్యాల ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటామని బ్రహ్మానందరెడ్డి తెలిపారు. పేదలకు 13 వేల ఇళ్లు కట్టించకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనన్నారు. నంద్యాల విజయం చంద్రబాబు కఠోర శ్రమకు ప్రజలిచ్చిన కానుక అని మంత్రి కాలవ శ్రీనివాసులు అభివర్ణించారు. జగన్ గ్యాంగ్‌కి అవకాశమిస్తే నంద్యాల మరో పులివెందులకంటే దారుణంగా మారుతుందని జనం భయపడ్డారని తెలిపారు.

వాయుగుండంగా మారనున్న తీవ్ర అల్పపీడనం

ఈనాడు, విశాఖపట్నం: ఛత్తీస్‌గఢ్ మీదుగా ప్రస్తుతం మధ్యప్రదేశ్, దాని చుట్టుపక్కల ప్రాంతాల వరకు పయనించిన అల్పపీడనం.. మరింత తీవ్రరూపం దాల్చిందని వాతావరణశాఖ వెల్లడించింది. ఇది ఇప్పటికీ సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపరితల ఆవర్తనంతో కలిసి గుజరాత్ దిశగా కదులుతోందని వివరించింది. బుధవారానికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావం వల్ల ఉత్తర కోస్తా జిల్లాలపై రుతుపవనాలు బలంగా కనిపిస్తున్నాయని వాతావరణ అధికారులు తెలిపారు. విశాఖ మీదుగా రుతుపవన ద్రోణి పయనిస్తోందన్నారు. రాయలసీమ మీదుగా ద్రోణి కొనసాగుతోందని చెప్పారు. సెప్టెంబరు 2న కోస్తా జిల్లాలకు భారీ వర్షసూచన ఉందని వెల్లడించారు.

సెప్టెంబర్ 15లోగా సమస్యల్ని పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె

విజయవాడ, న్యూస్‌టుడే: పురపాలక కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే జీవో నెం. 279ను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు పలు సమస్యల పరిష్కారం కోరుతూ సెప్టెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె చేపట్టాలని పురపాలక ఉద్యోగుల ఐకాస నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వానికి నిరవధికసమ్మె నోటీసును ఐకాస ప్రతినిధులు అందించారు.

గడువు తీరేలోగా అమెరికా రావచ్చు!



ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు... హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

నేను హెచ్1బి వీసాపై ఉన్నాను. నా భార్యాపిల్లలు హెచ్-4 వీసాపై ఈ ఏడాది సెప్టెంబరు 5న అమెరికా రానున్నారు. అదే రోజు(సెప్టెంబరు 5)తో వారి వీసా కాలం తీరనుంది. వారిని ఇమిగ్రేషన్ అధికారులు అనుమతిస్తారా? - అనిల్ కుమార్ బోడపాటి

మీ భార్యాపిల్లల వీసా సెప్టెంబరు అయిదో తేదీన కాలం తీరనుందని పేర్కొన్నారు. ఆ తేదీ కన్నా ముందుగావారు అమెరికా రావచ్చు. వీసా కాలం తీరితే నూతన హెచ్-4 వీసాల కోసం వారు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

నాకున్న గ్రీన్‌కార్డు ఏడాది వరకు చెల్లుబాటవుతుంది. 2016 మే నెలలో భారతదేశం వచ్చాను. వ్యక్తిగత కారణాలరీత్యా వెనక్కు వెళ్లలేకపోయాను. ప్రస్తుతం అమెరికా వెళ్దామనుకుంటున్నాను. విధి విధానాలేమిటి? - కుమార్

ఆరు నెలలు, అంతకుమించి అమెరికాకు దూరంగా ఉంటే పౌరసత్వానికి అవసరమైన నిరంతర నివాసం అంశం ప్రతిబంధకంగా మారుతుంది. మీ విషయంలో ఏడాది దాటిన నేపథ్యంలో రిటర్నింగ్ రెసిడెంట్(ఎస్‌బి-1) వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. ఎస్‌బి-1 వీసాలను హైదరాబాద్ అమెరికా కాన్సులేట్ నిర్వహించదు. దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయంలో మాత్రమే ఈ వీసా ప్రక్రియను నిర్వహిస్తుంది. మరింత సమాచారం కోసం https:// in.usembassy.gov/visas/ immigrant-visas/ returning-resident-visa/ ను చూడండి. అమెరికాలో న్యాయపరమైన శాశ్వత నివాసితులు సుదీర్ఘకాలం పాటు అమెరికాకు దూరంగా ఉండాలంటే వారు తొలుత రీ ఎంట్రీ పర్మిట్ కోసం ఫామ్-ఐ131ను భర్తీ చేయాల్సి ఉంటుంది. అమెరికా వదిలి వెళ్లే ముందు రీ ఎంట్రీ పర్మిట్ దాఖలు చేసిన పక్షంలో శాశ్వత, పరిమిత శాశ్వత నివాసితులు రిటర్నింగ్ రెసిడెంట్ వీసాతో పని లేకుండా నిర్ధారిత గడువులోగా అమెరికాలో ప్రవేశించవచ్చు.

నాకు బి2 వీసా ఉంది. వచ్చే ఏడాది ఆగస్టుతో ఆ వీసా కాలం తీరనుంది. పునరుద్ధరణకు ఇప్పుడు దరఖాస్తు చేయవచ్చా? నా వయసు 73 సంవత్సరాలు. ఇంటర్వ్యూ మినహాయింపునకు నేను అర్హుడనేనా? - కుమార స్వామి

వచ్చే ఆగస్టులో వీసా కాలం తీరనున్నా మీరు బి1/బి2 వీసా పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోవచ్చు. గడువు తీరేలోపు ఎప్పుడైనా మీరు వీసా పునరుద్ధరణ చేసుకోవచ్చు. ఇంటర్వ్యూ మినహాయింపునకు మీరు అర్హులా? కాదా? అన్నది తెలుసుకునేందుకు www.ustraveldocs.com/ inను చూడండి. మినహాయింపునకు అర్హత పొందినప్పటికీ దరఖాస్తును వ్యక్తిగతంగానే దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూ మినహాయింపునకు అర్హత పొందకపోతే ఈ వెబ్‌సైట్ ద్వారానే వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు దరఖాస్తు చేసుకోవాలి.

హెచ్1బి వీసాపై ప్రస్తుతం అమెరికాలో ఉన్నాను. ఆ వీసా ఈ ఏడాది సెప్టెంబరులో కాలం తీరనుంది. మూడు నెలల కోసం నా భార్య, పిల్లలు అమెరికా రావాలనుకుంటున్నారు. నా వీసా గడువు పొడిగింపు ప్రక్రియను ప్రీమియం విధానం ద్వారా చేసుకోవచ్చా? అలా సాధ్యం కాకపోతే వీసా ఎప్పుడు పొడిగింపునకు అవకాశం ఉంటుంది. పొడిగింపు కాకున్నా భార్యాపిల్లలను అమెరికా తీసుకురావచ్చా? 2018 జనవరిలో నా ప్రాజెక్టు పూర్తి అవుతుంది. - లెనిన్

వీసా గడువు పొడిగింపునకు మీ సంస్థ లేదా మీ పిటిషనర్ దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. వీసా పొడిగింపు పిటిషన్‌ను యూఎస్‌సీఐఎస్ ఆమోదిస్తే మీరు నూతన వీసా కోసం దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. మీరు అమెరికా వదిలి వెళ్లి, ఉద్యోగం చేసేందుకు మళ్లీ రాదలచుకుంటే నూతన హెచ్1బి వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. హెచ్-4 డిపెండెంట్ వీసాల కోసం దరఖాస్తు చేయాలంటే యూఎస్‌సీఐఎస్ జారీ చేసిన ఐ-797 ఆమోదిత నోటీసును వినియోగించుకోవచ్చు.

★ వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support-india@ustraveldocs.coకు ఈ-మెయిల్ చేయండి.

★ మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.gov ను సంప్రదించవచ్చు.

★ హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితర సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.netకు పంపగలరు.

కరెంటు ఆదాకు కంకణం కట్టుకోండి

ఈనాడు, అమరావతి: విద్యుత్తు ఆదాకు అన్ని ప్రభుత్వ శాఖలు కంకణ బద్ధులు కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన ఆదా మిషన్ (ఏపీఎస్‌ఈసీఎం) ఆరో కార్యవర్గ సమావేశం, నాలుగో సర్వసభ్య సమావేశం మంగళవారం సచివాలయంలో జరిగింది. ప్రభుత్వం రూపొందించిన విద్యుత్తు సమర్థ వినియోగ విధానంపై ఈ సందర్భంగా ఆయన సమీక్షించారు. ఏటా రాష్ట్ర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు 52 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్తును వినియోగిస్తున్నాయని, సమర్థ వినియోగం వల్ల ఇందులో 13వేల మిలియన్ యూనిట్లు ఆదా చేయవచ్చని చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖలకు విద్యుత్తు సమగ్ర వినియోగ చర్యలు తప్పనిసరి చేశామని వాటిని పాటించేలా ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆధార్ బిల్లుపై విచారణకు ముందు గోప్యత తీర్పును అధ్యయనం చేస్తాం: సుప్రీం

దిల్లీ: ఆధార్ చట్టాన్ని సవరించడానికి ఉద్దేశించిన బిల్లును ద్రవ్య బిల్లుగా లోక్‌సభ స్పీకర్ నిర్ణయించడంపై కాంగ్రెస్ నేత జైరాంరమేశ్ చేసిన సవాల్‌పై విచారించడానికి ముందుగా... వ్యక్తిగత గోప్యతపై ఇటీవల వెలువడిన కీలక తీర్పును అధ్యయనం చేస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. సత్వర విచారణ జరపడం కోసం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ మంగళవారం వచ్చింది. దీనిని శుక్రవారం ప్రస్తావించాలనీ, అప్పటిలోగా తాము గోప్యతపై తీర్పును అధ్యయనం చేస్తామనీ సీజేఐ జస్టిస్ మిశ్ర తెలిపారు. ముఖ్యమైన, తీవ్రమైన ఈ అంశంపై తొందరపడి నిర్ణయం తీసుకోలేమని సుప్రీంకోర్టు గతంలో జైరాంరమేశ్ తరఫు న్యాయవాదికి స్పష్టం చేసింది. రాజ్యసభ పరిశీలనను తప్పించడానికే ఆధార్ బిల్లును ద్రవ్యబిల్లుగా పేర్కొన్నారని రమేశ్ తన పిటిషన్లో పేర్కొన్నారు.

చదువులేని వాడవనీ దిగులు చెందకూ...!

మారుతున్న వివాహ అర్హతల ముఖచిత్రం

వాషింగ్టన్: గత కొన్ని దశాబ్దాల్లో అత్యున్నత విద్యావంతులైన మహిళల సంఖ్య పెరగడంతో వివాహ తీరుతెన్నులు...ఆర్థిక పర్యవసానాల స్వరూప స్వభావాల్లో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి. చివరకు బాగా చదువుకున్న మహిళలు...తమకంటే తక్కువ విద్యార్హత ఉన్న పురుషులను వివాహం చేసుకోవడానికి సైతం ఏమాత్రం జంకని పరిస్థితిని కల్పించనున్నాయి. అంటే...., వివాహ విపణిలో పురుషులకు కల్యాణయోగ్యతలు మరింతగా పెరిగే అవకాశాలు మెరుగుపడ్డాయన్నది తాజా అధ్యయనం సారాంశంగా ఉంది. 1990-2000, 2009-2011 సంవత్సరాల్లో అమెరికాలోని గణాంకాలను అధ్యయనకర్తలు లోతుగా విశ్లేషించారు. అప్పుడే అటు విద్యార్హతల విషయంలోనూ...ఇటు ఆర్జన పరంగానూ స్త్రీ, పురుషుల ప్రగతిలో సుస్పష్టమైన తేడా గోచరించినట్లు కెన్సస్ విశ్వవిద్యాలయానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ చాంగ్ వాన్ కిమ్ చెప్పారు. ఆయా సంవత్సరాల్లో...అత్యున్నతస్థాయి విద్యార్హతల విషయంలో మహిళల సంఖ్య బాగా పెరిగిపోయింది. వ్యక్తిగతంగా స్త్రీల ఆర్జన కూడా అధికమైంది. మొత్తం మీద ఈ రెండు అంశాల్లోనూ పురుషుల కంటే అతివల ప్రగతే వేగవంతంగా ఉంది. అయితే, కుటుంబ జీవన పరిమాణాల కోణం నుంచి చూస్తే మాత్రం...మహిళలకు అవకాశాలు గత కొన్ని దశాబ్దాల్లో తగ్గుముఖం పట్టడం గమనార్హం. అదే సమయంలో కుటుంబ ఆదాయానికి ఇల్లాలి వాటా కూడా పెరిగిందని అధ్యయన నివేదిక పేర్కొంది.

పిల్లలకు సమయం కేటాయించండి

- డబ్బు, ఆస్తుల సంపాదన ముఖ్యం కాదు
- బాలలపై పెరుగుతున్న లైంగిక వేధింపులు
- తెలుగు రాష్ట్రాల్లోనూ పరిస్థితి దారుణం
- నోబెల్ బహుమతి గ్రహీత కైలాస్ సత్యార్థి

ఈనాడు - హైదరాబాద్



'బడిలోకాని.. ఇంట్లోకాని.. చిన్నారులకు ఎక్కడా రక్షణ ఉండటం లేదు. ఆ విషయాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియక వాళ్లలో వాళ్లే నరకం అనుభవిస్తున్నారు. తల్లిదండ్రులు మారాలి. డబ్బు, ఆస్తుల సంపాదనే ముఖ్యం కాదు.. ప్రతిరోజు మీ పిల్లల కోసం కొంత సమయం కేటాయించండి.. మనసు విప్పి మాట్లాడండి. వారి చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకోండి. ఏం జరిగినా నేనున్నాంటూ భరోసా ఇవ్వండి' అని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాస్ సత్యార్థి పేర్కొంటున్నారు. బాలల హక్కుల కోసం, చిన్నారుల అక్రమ రవాణా, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా 4 దశాబ్దాలుగా పోరాడుతున్న ఆయన 'సురక్షిత్ బచ్‌పన్.. సురక్షిత్ భారత్' అనే నినాదంతో 'భారత్ యాత్ర' పేరిట మరో ప్రజాఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ సందర్భంగా 'ఈనాడు - ఈటీవీ'తో ముచ్చటించారు.

తెలిసిన వాళ్లే.. : ఓ నివేదిక ప్రకారం 53 శాతంమంది చిన్నారులు అఘాయిత్యాలను ఎదుర్కొంటున్నారు. 2015 ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం.. నేరస్థుల్లో 99 శాతంమంది బాధితులకు తెలిసిన వారే కావడం గమనార్హం. నాలుగైదు నిమిషాలకో చిన్నారిపై ఘోరం జరుగుతోంది. ఇలాంటి ఘటనలు వేలల్లో జరుగుతుంటే వందల్లో మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. తల్లిదండ్రుల ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. పోలీసులు సైతం బాధితుల వివరాలను గోప్యంగా ఉంచాలి.

తెలుగు రాష్ట్రాల్లోనూ..: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ పరిస్థితి దారుణంగానే ఉంది. 2013-15 మధ్య 17,560 మంది చిన్నారులు అదృశ్యమైనట్లుగా తెలిసింది. వారిలో ఎంతమంది జాడ కనుక్కొన్నారో ఎవరికీ తెలియదు.

హైదరాబాద్ పాతబస్తీలో జరుగుతున్న దారుణం వింటేనే ఆందోళన కలుగుతుంది. అభం శుభం తెలియని చిన్నారులు అరబ్బు షేక్‌ల బారిన పడి నరకం చూస్తున్నారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. బాల్య వివాహాల సమస్య ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోంది. దీనిపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంపొందించాలి.

కేసులకు 40 ఏళ్లు పడుతుంది: లైంగిక వేధింపులకు సంబంధించి 4 శాతం కేసుల్లో మాత్రమే శిక్ష పడుతుండగా 90 శాతం కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. కొత్తగా ఎలాంటి సంఘటనలు జరగ్గకపోతే.. కొన్ని రాష్ట్రాల్లోని పెండింగ్ కేసుల్ని పరిష్కరించేందుకు 40 ఏళ్లు పడుతుంది. దీని నివారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి. ప్రత్యేకంగా జిల్లాకో న్యాయమూర్తిని నియమించాలి.

పోస్కో చట్టాన్ని అమలు చేయాలి.. : అశ్లీల వెబ్‌సైట్లను నిషేధించాలి. ఉపాధ్యాయులు, బస్సు డ్రైవర్లు, ఆయాలు, వాచ్‌మెన్లు.. ఇలా పిల్లలతో నిత్యం మెలిగే ప్రతి ఒక్కరికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి. యజమాన్యాలు సైతం విద్యార్థులకు నెలకొకసారైనా కౌన్సెలింగ్ నిర్వహించాలి. పోస్కో చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలి. అవసరమైతే మార్పులు చేయాలి. చిన్నారుల అక్రమ రవాణా నివారణకు అడ్డుకట్ట వేసేందుకు పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తేవాలి. ఒక్క ప్రభుత్వం తీసుకునే చర్యల తోనే ఈ అఘాయిత్యాలకు అడ్డుకట్టపడదు. సమాజమంతా కదిలి వస్తేనే సాధ్యమవుతుంది.

మొదటి యాత్ర స్ఫూర్తితోనే..: బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా 1998లో తొలిసారి యాత్రకు శ్రీకారం చుట్టా. ప్రపంచవ్యాప్తంగా 103 దేశాలను సందర్శించా. 80 వేల కి.మీ. తిరిగా. కొంత మార్పు వచ్చింది. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా. అదే స్ఫూర్తితో సెప్టెంబరు 11న చిన్నారుల అక్రమ రవాణా, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా 'భారత్ యాత్ర' ప్రారంభిస్తున్నాం. ఇది కన్యాకుమారిలో ప్రారంభమై.. అక్టోబరు 16న దిల్లీకి చేరుతుంది. అందరికీ అవగాహన కల్పించాలన్నదే మా లక్ష్యం. యాత్ర సెప్టెంబరు 21న హైదరాబాద్‌కు చేరుకుంటుంది.

డేరా ఖాళీ అవుతోంది

- 18 మంది బాలికలకు విముక్తి

చండీగఢ్: డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయం లోపల ఉన్నవారిలో దాదాపు అందరూ బయటకు వచ్చేసినట్లే. డేరా అధినేత రాంరహీం సింగ్‌ను న్యాయస్థానం దోషిగా ప్రకటించిన తర్వాత డేరా లోపలే ఉన్న వేలాది మందిని బయటకు రప్పించడానికి యంత్రాంగం చేపట్టిన చర్యలు దాదాపు పూర్తి కావచ్చాయి. మంగళవారం సుమారు 650 మందిని వెలుపలకు పంపించారు. ఇంకా 250-300 మంది మాత్రమే లోపల ఉన్నారని అధికారులు తెలిపారు. 18 ఏళ్ల లోపు 18 మంది బాలికల్ని డేరా నుంచి బయటకు రప్పించారు. పంజాబ్, హరియాణాల్లో ప్రశాంత పరిస్థితులు నెలకొంటున్నాయి. డేరా ప్రధాన కార్యాలయానికి వెళ్లే రహదారులపై తప్పిస్తే మిగిలిన చోట్ల బుధవారమంతా కర్ఫ్యూను ఎత్తివేయాలని అధికారులు నిర్ణయించారు. విద్యాసంస్థలు, బ్యాంకులు తెరచుకున్నాయి. పంజాబ్‌లో అంతర్జాల సేవల్ని పునరుద్ధరించారు. అయిదు జిల్లాల్లో కర్ఫ్యూ ఎత్తివేశారు. రైళ్లను పునరుద్ధరించారు.

యుద్ధ పరిస్థితుల్ని యుద్ధం మాదిరిగానే ఎదుర్కోవాలి: డేరా సంస్థ ప్రక్షాళనపై తీసుకున్న చర్యల గురించి సవివర నివేదిక సమర్పించాలని హరియాణా సర్కారును పంజాబ్-హరియాణా హైకోర్టు మంగళవారం ఆదేశించింది. హింసాత్మక ఘటనలపై నమోదైన అన్ని కేసులపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను నియమించాలనీ, తమ అనుమతి లేకుండా వీటిలో ఏ కేసునూ ఎత్తివేయవద్దని రెండు రాష్ట్రాలనూ ఆదేశించింది. యుద్ధ తరహా పరిస్థితులు నెలకొన్నప్పుడు యుద్ధం మాదిరిగానే వాటిని ఎదుర్కోవాలని పేర్కొంది. భద్రత బలగాలు ముందుగా రబ్బరు తూటాలను ప్రయోగించి ఉండాల్సిందని డేరా తరఫు న్యాయవాదులు అభిప్రాయపడినప్పుడు ధర్మాసనం ఏకీభవించకుండా- ఈ వ్యాఖ్యచేసింది. పెట్రోలు బాంబులు, మారణాయుధాలతో వచ్చినవారి విషయంలో మృదువుగా వ్యవహరించడం సబబు కాదని తెలిపింది. డేరా అనుచరుల మారణాయుధాలు, గుర్మీత్ వెంట భారీగా వచ్చిన వాహనాలు గురించి ధర్మాసనం పలు ప్రశ్నలు వేసింది.

ప్రధానిపై వ్యాఖ్యలేమీ చేయలేదని స్పష్టీకరణ: మునుపటి విచారణలో తాము మౌఖికంగా చేసిన కొన్ని వ్యాఖ్యలు వక్రీకరణకు గురయ్యాయని ధర్మాసనం పేర్కొన్నట్లు అదనపు సొలిసిటర్ జనరల్ సత్యపాల్‌జైన్ విలేకరులకు తెలిపారు. ప్రధానిపై ఒక్క పదాన్నీ తాము వాడలేదనీ, సాధారణ చర్చల్లోనూ ప్రధాని పేరు ప్రస్తావనకైనా రాలేదనీ స్పష్టం చేసినట్లు వివరించారు. తదుపరి విచారణ సెప్టెంబరు 27న జరుగుతుందన్నారు. మరోపక్క కారాగారంలో ఉన్న డేరా బాబా సోమవారం రాత్రి ఎలాంటి ఆహారం తీసుకోలేదు. మంగళవారం మాత్రం పాలు తీసుకున్నట్లు కారాగార అధికారి ఒకరు తెలిపారు. ఎవరితోనూ మాట్లాడకుండా తన గదిలోనే పచార్లు చేస్తున్నట్లు చెప్పారు. గుర్మీత్ వారసుడెవరో నిర్ణయించుకోలేదని డేరా వర్గాలు తెలిపాయి.

తెరిపివ్వని వర్షాలు.. పెరిగిన మృతులు

- టెక్సాస్‌లో మరో ఆరుగురు దుర్మరణం
- లక్ష మంది భారతీయులకు వరద ముప్పు

హ్యూస్టన్: వరుసగా నాలుగోరోజు కూడా టెక్సాస్‌లో కుండపోత వర్షాలు కురిశాయి. ఇళ్లలోకి నీరు రావడంతో సహాయం కోసం అర్థిస్తున్నవారిని కాపడానికి సహాయక బృందాలకు భారీ వర్షాలు ఆటంకంగా మారాయి. మరో వైపు అతిభారీ వర్షాలు కురవనున్నాయని జాతీయ వాతావరణ విభాగం(ఎన్‌డబ్ల్యూఎస్) హెచ్చరించింది. వాతావరణం ఏమాత్రం తెరిపి ఇచ్చినా 30 వేల మందిని శిబిరాలకు తరలించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం శిబిరాల్లో 5500మంది ఉన్నట్లు హ్యూస్టన్ మేయరు సిల్విస్టర్ టర్నర్ చెప్పారు. వరదనీటి ఉద్ధృతికి నలుగురు చిన్నారులు సహా ఇద్దరు వృద్ధులు ప్రయాణిస్తున్న కారు కొట్టుకుపోయింది. వీరంతా ప్రాణాలు కోల్పోయారు. సతీసమేతంగా టెక్సాస్ చేరుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వరద పరిస్థితిని సమీక్షించారు. సహాయం కావాల్సిన భారతీయులు +18322311988లో సంప్రదించాలని హ్యూస్టన్‌లో భారత కాన్సుల్ జనరల్ అనుపమ్ రే ట్వీట్ చేశారు. 200 మందికిపైగా భారతీయ విద్యార్థులకు మనదేశ రాయబార కార్యాలయం ఆధ్వర్యంలో వసతి, ఆహారం ఏర్పాటు చేశారు. స్నానానికి వెళ్లి వరదల్లో చిక్కుకుని, ప్రస్తుతం సెయింట్ జోసెఫ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిఖిల్ భాటియా, షాలిని అనే ఇద్దరు విద్యార్థుల పరిస్థితి విషమంగానే ఉంది. హ్యూస్టన్, చుట్టుపక్కల నివసిస్తున్న దాదాపు లక్షమంది భారతీయులు వరదల వల్ల ఇబ్బందులు పడుతున్నారు.

అమ్మో... మళ్లీ 2005

- **భారీ వర్ష సూచనతో సర్వత్రా ఆందోళన**
- **గత అనుభవంతో ఆర్థిక రాజధానిలో కలవరం**

2005 జులై 26...

దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో ఎడతెగని వర్షం.

తెల్లవారుజాము నుంచే స్థానిక రైళ్లు, బస్సులు, సొంత వాహనాల్లో ఏదో ఒక విధంగా అవస్థలు పడి కార్యాలయాలకు పయనమైన ఉద్యోగులు.

రెయిన్‌కోట్లతో పాఠశాలలకు భారంగా వెళ్లిన విద్యార్థులు.

గంటగంటకీ వాన ఉధృతి. చినుకు చినుకు కాస్తా కుంభవృష్టి అయింది.

నింగీనేలా ఏకమయ్యాయా, ఆకాశానికి చిల్లులు పడ్డాయా అన్నట్లు రోజంతా విడవని వర్షం.

రైలు మార్గాలు ఏమయిపోయాయో కనిపించలేదు.

రోడ్లు నదులయ్యాయి. కార్లు పడవల్లా తేలాయి.

రహదారులు ఎక్కడ ఉన్నాయో, ఎంత కుంగాయో తెలియలేదు.

మధ్యాహ్నానికి ఉపద్రవాన్ని గుర్తించిన యంత్రాంగం అప్పటికప్పుడు సెలవులు ప్రకటించింది.

అయినా- ఇంటికి వెళ్లే దారి లేదు.

కాలినడకే ఆధారం.

ఉదయాన్నే ఇంటి నుంచి బయల్దేరినవారిలో కొందరైతే మరుసటి రోజు, మరికొందరు రెండ్రోజుల తర్వాత అతి కష్టం మీద ఇళ్లకు తిరిగి చేరారు.

కేవలం 24 గంటల వ్యవధిలో ఏకధాటిగా కురిసిన వాన 944 మిల్లీమీటర్లు...!

దాదాపు రూ.1700 కోట్ల ఆర్థిక నష్టం మిగిల్చి, రమారమి 500 మందిని పొట్టనపెట్టుకున్న ఆ వాన అంటే ఇప్పటికీ ముంబయి వాసులకు వణుకే.

అంతటి తీవ్రమైన వానలు ఇప్పుడు మళ్లీ కురియబోతున్నాయనే హెచ్చరికలు... ఇప్పటికే మొదలైన తీవ్రత...వారందరికీ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

1974 తర్వాత మళ్లీ 2005లోనే

ముంబయిలో 1974లో 24 గంటల్లో 575 మి.మీ. వాన కురిసింది. 31 ఏళ్ల వరకు అదే నగర వర్షపాత రికార్డుగా ఉండేది. అలాంటిది 2005లో దానిని తిరగరాసేలా జులై 26న ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల మధ్య 644 మి.మీ. వర్షం కురిసింది. 24 గంటల మొత్తం వ్యవధిని తీసుకుంటే అది మరో 300 మి.మీ. ఎక్కువ. నిజానికి ముంబయిలో దశాబ్దాల క్రితం నిర్మించిన మురుగునీటి వ్యవస్థ కేవలం 25 మి.మీ. వర్షాన్నే తట్టుకోగలదు. ఒక్క రోజులో 944 మి.మీ. వర్షం కురియడంతో నగరం చెరువయింది... కాదు.... కాదు... సముద్రమయింది. పట్టాలు ఉన్నాయో, లేదో తెలియనంతగా నీళ్లు వెల్లువెత్తడంతో ఆ రోజు మధ్యాహ్నం 2.30 నుంచి స్థానిక రైళ్లను నిలిపేశారు. 27, 28 తేదీలను సెలవు రోజులుగా ప్రకటించారు. ఏటీఎంలు స్తంభించిపోయాయి. అంతర్జాల సేవలు నిలిచిపోవడంతో బ్యాంకులు మూతపడ్డాయి. ఆఖరికి స్టాక్ ఎక్స్ఛేంజీలూ పాక్షికంగానే పనిచేశాయి. మూడు విమానాశ్రయాల రన్‌వేలపైకీ నీళ్లు రావడంతో వాటిని 30 గంటలకు పైగా మూసివేయాల్సి వచ్చింది. అలా జరగడం చరిత్రలో అదే తొలిసారి. 700 విమాన సర్వీసులు రద్దు కావడమో, ఆలస్యమవడమో అనివార్యమయింది. రైళ్లనైతే ఆగస్టు 6 వరకు రద్దు చేశారు. ముంబయి-పుణె ఎక్స్‌ప్రెస్ మార్గంలో కొండచరియలు విరిగి పడడంతో 24 గంటల పాటు రాకపోకల్ని ఆపేశారు. 50 లక్షల చరవాణులు, 23 లక్షల సాధారణ ఫోన్లు కొన్ని గంటలపాటు మూగబోయాయి. చాలా మంది రెండ్రోజులకు పైగా కార్యాలయాల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఒక్క ముంబయి నగరానికే రూ.550 కోట్ల నష్టం వాటిల్లి ఉంటుందని అప్పట్లో అంచనా వేశారు. కొంత మంది బాలీవుడ్ ప్రముఖులూ ఆనాటి వరుణ ప్రతాపంలో తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. జావేద్ అఖ్తర్ దిల్లీ నుంచి ముంబయికి తిరిగి రాలేక మూడు రోజులు హోటల్లోనే ఉండిపోయారు. ఒక్క క్షణంలో ప్రజలు తమ సర్వస్వాన్నీ కోల్పోవడాన్ని చూసి ఆవేదన చెందానని అప్పట్లో షారూఖ్ ఖాన్ పేర్కొన్నారు. ఆనాటి వర్షాలకు శివసేన అగ్రనేత బాల్‌ఠాక్రే నివాసమూ మునిగిపోగా నేవీ రంగంలో దిగి రక్షించాల్సి వచ్చింది. ముంబయికి సేవలందించడంలో సైన్యమూ పాలు పంచుకొంది.

కారణాలెన్నో...

సరైన మురుగునీటి వ్యవస్థ లేకపోవడం, తీరానికి రక్షణగా ఉన్న మడ అడవుల్ని నాశనం చేయడం, ప్రణాళికలేని అభివృద్ధి... ఇలాంటివన్నీ పన్నెండేళ్ల క్రితం ముంబయికి కాళరాత్రుల్ని మిగిల్చాయి. ఆ తర్వాత ప్రభుత్వం, స్థానిక సంస్థలు కొన్ని చర్యల్ని చేపట్టినా... ఇప్పటికీ భారీ వర్షం పేరెత్తితే ముంబయి వణికిపోతోంది. స్వయంకృతాపరాధం కొంతయితే, భారీ వర్షాల సమయంలో సముద్ర మట్టం పెరిగిపోయి నగరం నుంచి మురుగు/ వర్షపునీరు బయటకు వెళ్లకపోవడం మరో ప్రధాన సమస్యగా నిలుస్తోంది. పోటు ఎక్కువగా ఉన్నప్పుడే కనిపించే ఈ సమస్య, భారీ వర్షాల్లో మరిన్ని రెట్లు పెరుగుతోంది. దీంతో జనజీవనమంతా స్తంభించిపోతోంది.

– ఈనాడు ప్రత్యేక విభాగం


జలమయమైన థాణె రైల్వే స్టేషన్

ఫడణవీస్‌కు ప్రధాని మోదీ ఫోన్



కుండపోత వర్షాలతో ముంబయిలో తలెత్తిన పరిస్థితి గురించి ప్రధాని నరేంద్ర మోదీ మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడణవీస్‌తో మాట్లాడి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సాయం అందుతుందని భరోసా ఇచ్చారు. ఇదే విషయాన్ని ప్రధాని ట్వీట్ ద్వారా వెల్లడించారు. కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ముఖ్యమంత్రికి ఫోన్ చేసి నగరంలోని పరిస్థితి గురించి ఆరా తీశారు.

మరో రెండు రోజులు కుండపోత..

ముంబయి, దక్షిణ గుజరాత్, కొంకణ్, గోవా, పశ్చిమ విదర్భ ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పుణేలోని భారత వాతావరణ శాఖ అధికారి ఏకే శ్రీవాత్సవ తెలిపారు. అల్పపీడనం వాయుగుండంగా మారటంతో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనావేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అవసరమైతే సహాయ చర్యలను చేపట్టేందుకు నేవీ హెలికాప్టర్లను సిద్ధం చేసింది. జాతీయ విపత్తు నిర్వహణ, ప్రతిస్పందన దళాలు సన్నద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

వరద ముంబయి

దేశ ఆర్థిక రాజధానిని ముంచెత్తిన కుంభవృష్టి

- ఎక్కడికక్కడే చిక్కుకు పోయిన ప్రయాణికులు
- నదుల్ని తలపించిన రహదారులు
- వరద నీటిలో కొట్టుకుపోయిన వాహనాలు
- మహానగరంలో అడుగడుగునా ట్రాఫిక్ జామ్‌లు
- పలు లోతట్టు ప్రాంతాలు జలమయం
- నేవీ, విపత్తు ప్రతిస్పందన దళాలు అప్రమత్తం

ముంబయి – న్యూస్‌టుడే

భారీ వర్షాలు ముంబయి మహానగరంతో పాటు పొరుగునే ఉన్న నవీ ముంబయి, థానే ప్రాంతాలను ముంచెత్తాయి. మంగళవారం రోజంతా వర్షం పడుతూనే ఉండటంతో నగరంలోని ప్రధాన రహదారులతో పాటు ఈస్టర్న్, వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవేలు, సియాన్-పన్వేల్ రహదారి, ఎల్‌బీఎస్ మార్గాలలో ట్రాఫిక్ స్తంభించింది. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి రహదారులపై పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉదయం కార్యాలయాలకు వెళ్లటానికి తిరిగి ఇళ్లకు చేరటానికి ఉద్యోగులు, కార్మికులు తీవ్రంగా ఇబ్బందులుపడ్డారు. ట్యాక్సీలు దొరకటం కష్టమైంది. రెండు ఆస్పత్రుల భవనాల్లోకి వరద నీరు చేరింది. మరోవైపు సముద్రపు అలలు సాధారణ స్థాయికన్నా మూడు మీటర్ల ఎక్కువ ఎత్తు వరకూ ఎగసిపడుతున్నాయి. దీని వల్ల మురుగు, వరద నీరు సముద్రంలోకి వెళ్లటంలో జాప్యం జరిగి లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. దాదర్, అంధేరి, వర్లీ, కుర్లా, సకినక, పశ్చిమ ఖర్, ఘట్కోపర్, హిందుమాత, సియన్ తదితర ప్రాంతాల్లో వేలాది వాహనాలు రహదారులపైనే నిలిచిపోయాయి. వర్షతీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో మధ్యాహ్నం సమయానికే పాఠశాలలకు, కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. దీంతో ఇళ్లకు చేరుకునేందుకు జనం నరక యాతన పడ్డారు. నడుము లోతు నీళ్లలో ఈదుకుంటూ గమ్యస్థానాలకు చేరాల్సి వచ్చింది. నగరంలో రైల్వే పట్టాలు వెంబడి లక్షలాది మంది జనం వరదనీటిలో నడుచుకుంటూ కిలోమీటర్ల పొడవున బారులు తీరారు.

మంగళవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 మధ్య కేవలం మూడున్నర గంటల సమయంలో శాంతాక్రజ్ వాతావరణ కేంద్ర పరిధిలో 80 నుంచి 90మిల్లీమీటర్ల(8-9 సెంటీమీటర్ల) వర్షపాతం నమోదుకాగా కొలబా వాతావరణ కేంద్రం పరిధిలో 150 నుంచి 200మి.మి(15-20సెం.మీ) వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ కె.జె.రమేశ్ వెల్లడించారు. అయితే, ప్రస్తుత పరిస్థితిని 2005 జులై 26, 27 తేదీల్లో కురిసిన కుంభవృష్టితో పోల్చేందుకు ఆయన నిరాకరించారు. అప్పుడు ఒక్క రోజులోనే 944మి.మి (94సెం.మీ) అసాధారణ వర్షపాతం నమోదైందని తెలిపారు. మంగళవారం మొత్తంమీద 29.8 సెం.మీ వర్షపాతం నమోదైంది.

జీవనాడికి అంతరాయం

ముంబయికి జీవనాడి అయిన సబర్బన్ రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మూడు ప్రధాన మార్గాలు పశ్చిమ, మధ్య, హార్బర్ లైన్లలో స్థానిక రైళ్లు ఉదయం 11.30 గంటల వరకూ నిలిచిపోయాయి. ఆ తర్వాత తిరిగి ప్రారంభమైనా ఆలస్యంగా నడుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో రైలు పట్టాలపై భారీగా నీరు నిలిచింది. పలు రైలు సర్వీసులు రద్దు కావటంతో ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ వేలమంది ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. రైళ్లు గమ్యస్థానాలకు చేరక ముందే పట్టాలపై అర్ధంతరంగా నిలిచిపోవటంతో ప్రయాణికులు పలు చోట్ల మార్గమధ్యంలోనే గంటల తరబడి చిక్కుకుపోయి అవస్థలుపడ్డారు.

విమానాలు మళ్లింపు

భారీ వర్షం, తీవ్ర గాలులు, ఆకాశం మేఘావృతమై ఉండటం వంటి ప్రతికూల పరిస్థితుల వల్ల ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశీయ, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మంగళవారం ఉదయం రన్‌వే సరిగా కనిపించక ఏడు విమానాలు కిందికి దిగటానికి ముందు పలుమార్లు గాలిలోనే చక్కర్లు కొట్టాల్సి వచ్చింది. సాయంత్రం వరకు ఆరు విమాన సర్వీసులు రద్దయ్యాయి. మరో 10 విమానాలను అహ్మదాబాద్ తదితర నగరాల్లోని విమానాశ్రయాలకు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ప్రధాన రన్‌వే ఒక్కటే పనిచేసింది. విమానాలు సగటున 45 నిమిషాలు ఆలస్యంతో బయలుదేరినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఇండిగో రెండు విమాన సర్వీసులను రద్దుచేసినట్లు ప్రకటించింది. మరోమూడు సర్వీసులను దారిమళ్లించింది. జెట్ ఎయిర్‌వేస్ మూడు సర్వీసులను రద్దు చేసింది.


వరద నీటిలో తన పిల్లలను పాఠశాల నుంచి జాగ్రత్తగా ఇంటికి తీసుకెళ్తున్న ముంబయి మహిళ

పాఠశాల పైకప్పు కూలి ముగ్గురు విద్యార్థులు దుర్మరణం..

అహ్మద్‌నగర్ జిల్లా నిబోడి గావ్‌లో జిల్లా పరిషత్ పాఠశాల స్లాబ్ కూలి ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఆగ్రహానికి గురైన గ్రామస్థులు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అహ్మద్‌నగర్-శోలాపూర్ రహదారిలో బైఠాయించారు.

ముంబయిలో 2005 తర్వాత ఈ స్థాయిలో అతి భారీ వర్షం, వరదలు రావడం మళ్లీ ఇప్పుడే.


థాణెలో ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు


ముంబయిలోని సియోన్ రైల్వే స్టేషన్‌లో భారీ వర్షం కురుస్తుండటంతో నిలిచిన రైలు.. నిలబడి చూస్తున్న ప్రయాణికులు


భారీగాలుల ధాటికి ముంబయిలో విరిగిపడిన హోర్డింగులు

ఎంత పనిచేశావు లారా ..



ముంబయిలో ఇంట్లోకి వర్షం నీళ్లు రాకుండా తలుపుల వద్ద తుండుగుడ్డలు(టవల్స్) అడ్డుగా పెట్టిన దృశ్యమిది. ఇవన్నీ వింబుల్డన్, ఆస్ట్రేలియన్, యూఎస్, ఫ్రెంచ్ ఓపెన్లు ఆడిన సందర్భంగా టెన్నిస్ స్టార్ మహేశ్‌భూపతి ఉపయోగించినవి. మధుర స్మృతులుగా వాటిని దాచుకున్నాడు. ఆయన సతీమణి, బాలీవుడ్ మాజీ నటి, విశ్వసుందరి 2000గా ఎంపికైన లారా దత్తా వాటిలో కొన్నింటిని ఇలా ఉపయోగించారు. ట్విటర్‌లో ఈ ఫొటో పోస్ట్ చేస్తూ ఇలాగైనా పనికొచ్చాయని కామెంట్ పెట్టారామె. ఎంత పనిచేశావు?, వేళాకోళంగా ఉందా?, ఎంత కష్టపడ్డానో తెలుసా? అంటూ ట్విటర్‌లోనే భూపతి బదులిచ్చాడు.

- ముంబయిలో టైఫూన్ తరహా వాతావరణం నెలకొని ఉందని పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. దిల్లీలో జరిగే భారత్-ఆస్ట్రేలియా ప్రతినిధుల భేటీకి తాను హాజరుకావాల్సి ఉన్నప్పటికీ విమానం రద్దు వల్ల వెళ్లలేకపోయినట్లు పేర్కొన్నారు. నీటిలో చిక్కుకుపోయినట్లు తన ఆస్ట్రేలియా మిత్రులకు తెలిపానన్నారు.
- పలువురు సినీ ప్రముఖులు కూడా భారీ వర్షాలపై సామాజిక మాధ్యమాల్లో స్పందించారు. ప్రజలు బయటకు రావద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బాలీవుడ్ నటులు దీపికా పదుకోనే, దియా మిర్జా తదితరులు ట్వీట్ చేశారు.
- డబ్బావాలాలు కార్యాలయాలకు లంచ్ బాక్సులను చేరవేయటానికి బైకులకు బదులుగా నడిచి వెళ్లాల్సి వచ్చింది.
- ప్రస్తుత వర్షాలతో అంతగా భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజలు ఇళ్లలోనే ఉండాలని శివసేన అధినేత ఆదిత్య ఠాక్రే తెలిపారు.
- ఎవరైనా ఆపదలో చిక్కుకుంటే సాయమందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముంబయి పోలీసులు ప్రకటించారు. 100కు డయల్ చేయాలని నగర పౌరులకు సూచించారు.

రైలుపై కొండచరియలు

- **పట్టాలు తప్పిన నాగ్‌పుర్-ముంబయి దురంతో**
- **డ్రైవర్ అప్రమత్తతతో ప్రాణనష్టం నివారణ**
- **ఆదుకున్న అధునాతన పెట్టెలు**

అసన్‌గావ్ (మహారాష్ట్ర): భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగి పడడంతో నాగ్‌పుర్-ముంబయి దురంతో రైలు మంగళవారం ఉదయం మహారాష్ట్రలోని వాసింద్-ఆసన్‌గావ్ స్టేషన్ల మధ్య పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదనీ, ప్రయాణికులెవరూ గాయపడలేదని అధికార వర్గాలు ప్రకటించాయి. ఉదయం 6.36 గంటలకు ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ అద్భుతంగా వ్యవహరించి ఆకస్మిక బ్రేకుల్ని వేయడంతో పెను ప్రమాదం తప్పిందని మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి సునీల్ ఉదాసి తెలిపారు. మరో అధికారి మాత్రం ప్రమాదానికి కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. కేసర ఘాట్ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొంత మేర రైలు మార్గం కొట్టుకుపోయి ఉంటుందనీ, ప్రమాదానికి అదే కారణం కావచ్చనీ ఆ అధికారి అంచనా వేశారు.

ఎల్‌హెచ్‌బీ పెట్టెలు రక్షించాయి..!: ప్రమాదానికి గురైన రైల్లో ఇంజిన్‌తో పాటు 18 పెట్టెలున్నాయి. ఇవన్నీ అధునాతన ఎల్‌హెచ్‌బీ శ్రేణివి. వీటిలో తొమ్మిది పెట్టెలు పట్టాలు తప్పాయి. ప్రమాదం జరిగినప్పుడు, మరో రైలును ఢీకొన్నప్పుడు ఇవి బోల్తా కొట్టకుండా, ఉన్నచోటే కూరుకుపోయి ఆగిపోతాయి. అందుకే దశలవారీగా పాత పెట్టెల స్థానంలో వీటిని ప్రవేశపెట్టాలని రైల్వే గతంలోనే నిర్ణయించింది. దురంతో ప్రమాదంలో నష్టం తక్కువగా ఉండడానికి ఎల్‌హెచ్‌బీ శ్రేణి పెట్టెలే ఒక ప్రధాన కారణమని భావిస్తున్నారు.


ఉలిక్కిపడ్డ ప్రయాణికులు: ప్రమాదం జరిగిన సమయంలో ఎక్కువ మంది ప్రయాణికులు మంచి నిద్రలో ఉన్నారు. బెర్తులపై నుంచి కిందికి పడిపోవడంతో వారంతా ఉలిక్కిపడ్డారు. మరుగుదొడ్లలో చిక్కుకుపోయినవారిని బయటకు తీసుకురావడానికి కిటికీ అద్దాలను పగులగొట్టారు. చెల్లాచెదురైన సామాన్లను దాటుకుంటూ తలుపులు తీసుకుని బయటకు వచ్చి చూస్తేగానీ ప్రమాదం తీవ్రత అర్థం కాలేదని ఇదే రైల్లో ఉన్న పీటీఐ వార్తాసంస్థ విలేకరి తెలిపారు. వర్షంలో తడుస్తూనే కొంత మంది ప్రయాణికులు సమీపంలోని స్టేషన్‌కు నడుచుకుంటూ వెళ్లారు. ఘటనా స్థలిలో నిలిచిపోయిన ప్రయాణికుల్ని బస్సులు, కార్లలో ముంబయి పంపించారు. ఆ మార్గంలో ఇతర రైళ్ల రాకపోకలకు కొన్ని గంటలపాటు అంతరాయం కలిగింది. గత పది రోజుల్లో దేశంలో ప్రమాదానికి గురైన నాలుగో రైలు ఇది.


మహారాష్ట్రలో పట్టాలు తప్పిన దురంతో ఎక్స్‌ప్రెస్



మంగళవారం దిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఖేల్‌రత్న అవార్డులు అందుకుంటున్న దేవేంద్ర జజారియా (పారా అథ్లెట్), సర్దార్ సింగ్ (హాకీ), అర్జున అవార్డులు స్వీకరిస్తున్న హర్మన్‌ప్రీత్ (క్రికెట్), జ్యోతిసురేఖ (ఆర్చరీ), సాకేత్ మైనేని(టెన్నిస్) , సత్యవర్త్ కడియన్ (రెజ్లింగ్)

ఛాంపియన్



వావ్.. విండీస్!

- ఇంగ్లాండ్‌పై సంచలన విజయం
- రెండో టెస్టులో 322 పరుగుల ఛేదన
- హోప్, బ్రాత్‌వైట్ అద్భుత పోరాటం

లీడ్స్

ఎక్కడైనా.. ఏ జట్టయినా.. ప్రత్యర్థి ఎంతటి బలహీనమైనా.. నాలుగో ఇన్నింగ్స్‌లో 300కు పైగా లక్ష్యాన్ని ఛేదించడమంటే మాటలు కాదు. ఇక గత కొన్నేళ్లలో పతనావస్థకు చేరుకున్న వెస్టిండీస్ లాంటి జట్టు.. ఇంగ్లాండ్ లాంటి మేటి టెస్టు జట్టును దాని సొంతగడ్డపై ఎదుర్కొంటూ 322 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తుందని ఎవరైనా అనుకుంటారా? ఇంగ్లాండ్ కూడా ఇలాగే ఆలోచించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇంకా వికెట్లు చేతిలో ఉన్నా.. విండీస్ ముందు మరింత భారీ లక్ష్యాన్ని నిలిపే అవకాశమున్నా.. ఆ ప్రయత్నం చేయలేదు. ఆలస్యం చేసి, ప్రత్యర్థికి డ్రా చేసుకునే అవకాశం ఇవ్వొద్దనుకుంది. విండీస్‌ను కూల్చేసి సిరీస్ సాధించేద్దామనుకుంది. కానీ ఆ జట్టు ఏదో అనుకుంటే ఇంకేదో అయింది. విజయం కోసం చూస్తే.. మొదటికే మోసం వచ్చి ఓటమి చవిచూడాల్సి వచ్చింది. డ్రాతో గట్టెక్కడమే గగనం అనుకున్న విండీస్.. అనూహ్యంగా ఆడేసింది. భారీ లక్ష్యాన్ని ఛేదించి, మ్యాచ్‌ను ఎగరేసుకుపోయింది.

టెస్టు ర్యాంకింగ్స్‌లో ఎనిమిదో స్థానంలో ఉన్న వెస్టిండీస్.. రెండో స్థానంలో ఉన్న ఇంగ్లాండ్‌ను దాని సొంతగడ్డపై సంచలన రీతిలో ఓడించింది. తొలి టెస్టులో ఇన్నింగ్స్ 209 పరుగుల తేడాతో ఓడిన కరీబియన్ జట్టు.. రెండో టెస్టులో అద్భుతంగా పుంజుకుని 5 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌ను మట్టికరిపించింది. 322 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్.. షెయ్ హోప్ (118; 211 బంతుల్లో 14×4), క్రెయిగ్ బ్రాత్‌వైట్ (95; 180 బంతుల్లో 12×4)ల అసాధారణ పోరాటంతో అనూహ్య విజయాన్నందుకుంది. లక్ష్యాన్ని ఆ జట్టు 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. చివరి రోజు ఆటలో ఇంకో నాలుగు ఓవర్లు మాత్రమే మిగిలుండగా విండీస్ ఛేదన పూర్తి చేసింది. రోస్టన్ చేజ్ (30), బ్లాక్‌వుడ్ (41) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడారు. తొలి ఇన్నింగ్స్‌లోనూ అద్భుత శతకం (147) సాధించిన షై హోపే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. విండీస్ విజయంతో మూడు టెస్టుల సిరీస్ 1-1తో సమమైంది.

ఆరంభంలో తడబడి..: ఈ మ్యాచ్‌లో విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 169 పరుగుల ఆధిక్యం సాధించడం విశేషం. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 258 పరుగులకే పరిమితం కాగా.. వెస్టిండీస్ 427 పరుగులు సాధించింది. ఐతే మూడో రోజు ఆట ఆఖరుకు రెండో ఇన్నింగ్స్‌లో 171/1తో ఉన్న ఇంగ్లాండ్.. అనూహ్యంగా 8 వికెట్లకు 490 పరుగుల భారీ స్కోరు వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. 322 పరుగుల లక్ష్యం విండీస్‌కు చాలా ఎక్కువనుకుందేమో.. నాలుగో రోజే కుదిరితే ఒకట్రెండు వికెట్లు పడగొట్టేద్దామని.. అరగంట సమయం ఉండగా ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఐతే సోమవారం ఆ ఆరు ఓవర్లను జాగ్రత్తగా ఆడుకుని వికెట్ నష్టపోకుండా 5 పరుగులు చేసిన విండీస్.. చివరి రోజు తొలి సెషన్లో తడబడింది. స్వల్ప వ్యవధిలో కీరన్ పావెల్ (23), కైల్ హోప్ (0)ల వికెట్లు కోల్పోయి ఓ దశలో 53/2తో నిలిచింది. ఇక అండర్సన్, బ్రాడ్, స్టోక్స్, మొయిన్ అలీ లాంటి బౌలర్లను ఎదుర్కొని విండీస్ నిలవడం కష్టమే అనిపించింది. ఐతే ఈ దశలో బ్రాత్‌వైట్‌తో కలిసి షెయ్ హోప్ అద్భుతంగా పోరాడాడు. ఈ జోడీ క్రీజులో కుదురుకునే వరకు ఆచితూచి ఆడింది. ఆ తర్వాత జోరు పెంచింది. వీళ్లిద్దరూ 40 ఓవర్ల పాటు వికెట్టే ఇవ్వలేదు. 197/2తో పటిష్ఠ స్థితికి చేరుకున్న విండీస్‌కు విజయంపై ఆశలు మొలిచాయి. ఐతే టీ విరామానికి ముందు బ్రాత్‌వైట్ ఔటయ్యాడు. అయినా విండీస్ తగ్గలేదు. ఓవైపు హోప్ పాతుకుపోవడంతో చేజ్ (30), అతడి తర్వాత వచ్చిన బ్లాక్‌వుడ్ (41) ధాటిగా ఆడారు. ఓవర్లు మరీ ఎక్కువ లేకపోవడంతో అందుకు తగ్గ వేగంతో బ్యాటింగ్ చేశారు. ఏమాత్రం తేడా వచ్చినా వికెట్లు టపటపా పడిపోయి ఓటమి చవిచూసే పరిస్థితుల్లో హోప్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టిన తీరు అమోఘం. అదే సమయంలో బ్లాక్‌వుడ్ మెరుపు షాట్లతో లక్ష్యాన్ని వేగంగా కరిగించేయడంతో విండీస్ సాఫీగా ఛేదన పూర్తి చేసింది.

ఫైనల్లో మేమిద్దరం..

ఆ రోజు త్వరగా రావాలి



ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో సైనా నెహ్వాల్‌ను ఎదుర్కోవాల్సి వస్తుందనుకున్నా అది జరగలేదని, భవిష్యత్‌లో ఇద్దరు భారతీయులు మధ్య మెగా టోర్నీ ఫైనల్స్ జరగాలని ఆశిస్తున్నానని పి.వి. సింధు చెప్పింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజతం గెలిచిన సింధు, కాంస్యం నెగ్గిన సైనా నెహ్వాల్, కోచ్ గోపీచంద్ మంగళవారం ఉదయం హైదరాబాద్ తిరిగొచ్చారు. శంషాబాద్ విమానాశ్రయంలో వారికి ఘనస్వాగతం లభించింది. అనంతరం గోపీచంద్ అకాడమీలో జరిగిన విలేకరుల సమావేశంలో సింధు మాట్లాడుతూ.. "ప్రపంచ ఛాంపియన్‌షిప్ స్వర్ణాన్ని త్రుటిలో కోల్పోయినందుకు నిరాశ చెందాను. ఐతే ఆ తర్వాత కొద్దిసేపటికి మామూలుగా మారిపోయా. గతంతో పోల్చుకుంటే బ్యాడ్మింటన్‌కు ఇప్పుడు ఆదరణ పెరిగింది. ఒకవైపు క్రికెట్ మ్యాచ్ వస్తున్నా చాలామంది బ్యాడ్మింటన్‌ను వీక్షించడం గొప్ప విషయం. రానున్న రోజుల్లో ఆటకు మరింత ఆదరణ లభిస్తుందనుకుంటున్నా. నిజానికి ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో సైనా నెహ్వాల్, నేను తలపడతామని భావించాను. కానీ అలా జరగలేదు. ఏదో ఒకరోజు మెగా టోర్నీలో ఇద్దరు భారతీయుల మధ్య ఫైనల్ జరగొచ్చు. ఆ రోజు త్వరగా రావాలని కోరుకుంటున్నా" అని సింధు వివరించింది.

ఈ ప్రోత్సాహమే కావాలి... గోపీచంద్: దేశంలో క్రీడా సంస్కృతి మెరుగైనప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ దిశగా ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న కృషి అభినందనీయమని భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నాడు. "దేశంలో అత్యున్నత పదవుల్లో ఉన్న వాళ్లు క్రీడల గురించి తరచూ మాట్లాడుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీలా కొన్ని నెలల్లో ఎన్నో సార్లు క్రీడల గురించి మాట్లాడిన ప్రధానిని గతంలో చూడలేదు. దేశంలో క్రీడాభివృద్ధికి కేవలం విజయాలే కాదు.. క్రీడా సంస్కృతి కూడా అవసరం. పోటీ ప్రపంచంలో ముందుకెళ్లాలంటే ఇంకా చాలా చేయాలి. ప్రతిభావంతుల్ని గుర్తించే లక్ష్యంతో ప్రధాని గొప్ప ప్రయత్నం చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి ప్రయత్నాలు జరుగుతాయని ఆశిస్తున్నా" అని అన్నాడు.

సింధు, సైనాలకు గవర్నర్ అభినందనలు: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రజతం నెగ్గిన పి.వి. సింధును, కాంస్యం గెలిచిన సైనా నెహ్వాల్‌ను గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ మంగళవారం అభినందించారు.



ఈనాడుకు ప్రత్యేకం

ఆధిపత్యానికి ఇది సంకేతం!

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధిస్తే అద్భుతమే అనుకుంటున్న రోజుల నుంచి ఒకేసారి రెండు పతకాలు సాధించే స్థాయికి చేరుకుంది భారత్. ఈ ఘనతలో సైనా నెహ్వాల్‌ది కీలకపాత్ర అనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతర్జాతీయ వేదికపై దాదాపుగా పదేళ్ల క్రితం తన పోరాటాన్ని ఆరంభించిన ఈ హైదరాబాద్ అమ్మాయి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో వరుసగా రెండో పతకాన్ని ఖాతాలో వేసుకుంది. రెండేళ్ల క్రితం రజతం నెగ్గిన సైనా.. గ్లాస్గోలో కాంస్యంతో మెరిసింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఒకేసారి రెండు పతకాలు సాధించడం బ్యాడ్మింటన్‌లో భారత ఆధిపత్యానికి సంకేతమంటున్న సైనాతో ముఖాముఖి 'ఈనాడు'కు ప్రత్యేకం.

ఈనాడు - హైదరాబాద్

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మీ ప్రదర్శన సంతృప్తినిచ్చిందా..?

నిరుడు ఈ సమయానికి మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్నా. కదల్లేని పరిస్థితి. మళ్లీ రాకెట్ పట్టినా మునుపటి ఫామ్ అందుకోగలనా అన్న ఆందోళన కలిగింది. వైద్యులు, ఫిజియో, ట్రెయినర్ల మద్దతుతో మళ్లీ ఆట మొదలుపెట్టాను. ఈ ఏడాది ఆరంభంలో సాధించిన మలేసియా ఓపెన్ గ్రాండ్‌ప్రి టైటిల్ నాలో విశ్వాసాన్ని నింపింది. ఇంకా కష్టపడితే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మరింత మెరుగ్గా ఆడగలనని అనుకున్నా. అందుకు తగ్గట్లే కష్టపడ్డా. ఫలితం వచ్చింది. కెరీర్ కొనసాగిస్తానా? లేదా? అన్న పరిస్థితి నుంచి ప్రపంచ ఛాంపియన్‌లో కాంస్య పతకం సాధించడం గొప్పగా అనిపిస్తోంది. టోర్నీలో రెండో సీడ్ సుంగ్‌ను ఓడించడం నాకెంతో సంతృప్తినిచ్చింది. సెమీస్‌లో ఒకుహరకు గట్టి పోటీనిచ్చా. మొత్తంగా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో వరుసగా రెండో పతకం గెలవడం మధురానుభూతే.

మ్యాచ్‌ల షెడ్యూల్ సరిగా లేకపోవడం వల్లే ఓడారన్న కోచ్ విమల్‌కుమార్ వ్యాఖ్యలపై మీరేమంటారు?

విమల్‌కుమార్ వ్యాఖ్యలు సరైనవే. నా క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ రాత్రి పొద్దుపోయాక జరిగింది. సరిగ్గా నిద్రపోలేదు. ఆ తర్వాత సరైన విరామం లేకుండానే సెమీస్ ఆడాల్సి వచ్చింది. ఆ మ్యాచ్ సమయానికి నేను పూర్తి సిద్ధంగా లేను.

వరుసగా ఏడోసారి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో క్వార్టర్స్ చేరుకున్నారు. గతంతో పోల్చుకుంటే ఈసారి పోటీ ఎలా ఉంది?

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పోటీ ఎప్పుడూ తీవ్రంగానే ఉంటుంది. ప్రతి ఒక్కరు ఛాంపియన్ కావాలన్న లక్ష్యంతో వస్తారు. పతకం కోసం ఎంతవరకైనా పోరాడతారు. ఈసారి పోటీ తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. మహిళల సింగిల్స్‌లో ప్రమాణాలు పెరిగాయి. ఫిట్‌నెస్‌పై ఎక్కువ దృష్టిసారిస్తున్నారు. దూకుడుతో పాటు రక్షణాత్మకంగా ఆడటంలోనూ పట్టు సంపాదిస్తున్నారు. అన్ని దేశాల్లో ఇది జరుగుతోంది. అందుకే చైనా క్రీడాకారులకు గట్టి పోటీ ఎదురవుతోంది.

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఒకేసారి భారత్ రెండు పతకాలు నెగ్గింది. ఈ విజయాలను ఎలా చూడొచ్చు?

బ్యాడ్మింటన్‌లో భారత్ ఆధిపత్యానికి ఇది సంకేతమనుకోవచ్చు. ప్రస్తుతం బ్యాడ్మింటన్‌లో భారత్ దూసుకుపోతోంది. గత పదేళ్ల శ్రమకు ఫలితం లభిస్తోంది. బాయ్ నెలకొల్పిన మౌలిక వసతులు, శిక్షణతో క్రీడాకారులు సత్తాచాటుతున్నారు. నాణ్యమైన శిక్షణతో ఫలితాలు వస్తున్నాయి. ప్రపంచ స్థాయి క్రీడాకారుల సంఖ్య పెరిగింది. షట్లర్లలో సామర్థ్యం, ప్రమాణాలు, ఆత్మవిశ్వాసం పెరిగాయి. ఇప్పుడు ఏ టోర్నీకి వెళ్లినా విజేతగా నిలుస్తామన్న నమ్మకంతో వెళ్తున్నారు. ఇటీవలి ఫలితాలే ఇందుకు నిదర్శనం.

మహిళల సింగిల్స్ ఫైనల్‌ను ఎలా ఆస్వాదించారు?

ఫైనల్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూశాను. ప్రతి పాయింటు కోసం సింధు, ఒకుహర నువ్వానేనా అన్నరీతిలో అసాధారణంగా పోరాడారు. మ్యాచ్‌లో ఇద్దరు ఏ దశలోనూ వెనక్కితగ్గలేదు. ఉత్కంఠభరితంగా సాగిన వారి మ్యాచ్‌ను చూసిన ప్రేక్షకులకే అలుపొచ్చింది.



అనుకోకుండా వెళ్లాడు.. పతకం పట్టేశాడు

బాక్సింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ సెమీస్‌లో గౌరవ్

హాంబర్గ్: గౌరవ్ బిదూరి.. కొన్ని వారాల కిందటి వరకు ఈ యువ బాక్సర్‌కు ప్రపంచ ఛాంపియన్‌షిప్ గురించి ఆలోచనే లేదు. అతను శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు ఫ్రాన్స్‌కు వెళ్లాడు. అక్కడుండగా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యావంటూ కబురొచ్చింది. భూటాన్ ఓ వైల్డ్ కార్డ్ ఎంట్రీని తిరస్కరించడంతో భారత్‌కు అదనంగా ఓ బాక్సర్‌ను ప్రపంచ బాక్సింగ్‌కు పంపించే అవకాశం దక్కింది. ఆ అవకాశం గౌరవ్‌ను వరించింది. అలా అనుకోకుండా ప్రపంచ బాక్సింగ్‌కు వెళ్లిన గౌరవ్.. బాంటమ్ వెయిట్ (56 కేజీలు) విభాగంలో సెమీ ఫైనల్ చేరడం ద్వారా కనీసం కాంస్యం ఖరారు చేసుకున్నాడు. క్వార్టర్స్‌లో అతను ట్యునీషియా బాక్సర్ బిలెల్ మహ్మదిపై విజయం సాధించాడు. అరంగేట్ర ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లోనే పతకం గెలిచిన రెండో భారత బాక్సర్ గౌరవ్. ఇంతకు ముందు 2011లో వికాస్ కృష్ణన్ ఈ ఘనత సాధించాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఇప్పటిదాకా భారత్‌కు మూడు పతకాలు మాత్రమే దక్కాయి. వికాస్‌తో పాటు విజేందర్ సింగ్ (2009), శివ తాపా (2015) కాంస్యాలు సాధించారు.



156 పరుగులా.. 8 వికెట్లా?

రసపట్టులో బంగ్లా-ఆసీస్ తొలి టెస్టు

ఢాకా: బంగ్లాదేశ్-ఆస్ట్రేలియా తొలి టెస్టులో ఫలితం రావడం ఖాయం. 265 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా.. మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసింది. ఆసీస్ ఆరంభంలోనే రెన్‌షా (5), ఖవాజా (1) వికెట్లను కోల్పోయినప్పటికీ.. వార్నర్ (75 బ్యాటింగ్; 96 బంతుల్లో 11×4, 1×6) ధాటిగా ఆడి తన జట్టుకు విజయావకాశాలు కల్పించాడు. అతను స్టీవెన్ స్మిత్ (25 బ్యాటింగ్)తో అభేద్యమైన రెండో వికెట్‌కు 81 పరుగులు జోడించాడు. ఆసీస్ విజయానికి ఇంకో 156 పరుగులు అవసరం. నాలుగో రోజు వీళ్లిద్దరినీ త్వరగా ఔట్ చేస్తే బంగ్లా గెలిచే అవకాశాలుంటాయి. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 45/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా.. లియాన్ (6/82) ధాటికి 221 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 260 పరుగులు చేయగా.. ఆసీస్ 217 పరుగులకే పరిమితమైంది.

● ప్రొకబడ్డీకి వరుణుడి దెబ్బ

ముంబయి: ముంబయిలో భారీ వర్షం కారణంగా మంగళవారం జరగాల్సిన ప్రొ కబడ్డీ మ్యాచ్‌లు వాయిదా పడ్డాయి. సకాలంలో జట్లు స్టేడియానికి చేరుకోవడంలో విఫలమవడంతో నిర్వాహకులు మ్యాచ్‌లను వాయిదా వేశారు.

షరపోవా అదరహో..

- ఘనంగా పునరాగమనం
- యుఎస్ ఓపెన్ రెండో రౌండ్లో ప్రవేశం

న్యూయార్క్

రష్యా తార మరియా షరపోవా ఘనంగా గ్రాండ్‌స్లామ్ పునరాగమనం చేసింది. యుఎస్ ఓపెన్ తొలి రౌండ్లో ఆమె 6-4, 4-6, 6-3తో ప్రపంచ నంబర్-2 హలెప్ (రొమేనియా)పై విజయం సాధించింది. హోరాహోరీగా జరిగిన పోరులో 30 ఏళ్ల షరపోవా 60 విన్నర్లు, ఏడు ఏస్‌లు కొట్టింది. 64 అనవసర తప్పిదాలు, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. మ్యాచ్ సాగుతున్నంత సేపు ఉద్వేగంగా కనిపించిన షరపోవా.. చివరి పాయింట్ తర్వాత మరింత ఉద్వేగానికి లోనైంది. కన్నీటిని అదిమిపడుతూ తనదైన శైలిలో ప్రేక్షకులకు ముద్దులు విసిరింది. "ఇది ఎప్పటిలాగే మరో మ్యాచ్, మరో అవకాశం అనుకున్నా. ఇది అంతకన్నా ఎక్కువ అని ఇప్పుడు అర్థమవుతోంది" అని ఆమె వ్యాఖ్యానించింది. మ్యాచ్ సందర్భంగా ప్రేక్షకుల నుంచి ఆమెకు మంచి మద్దతు లభించింది. మహిళల సింగిల్స్‌లో ఐదో సీడ్ వోజ్నియాకి (డెన్మార్క్), తొమ్మిదో సీడ్ వీనస్ విలియమ్స్ (అమెరికా) కూడా రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. తొలి రౌండ్లో వోజ్నియాకి 6-1, 7-5తో బుజామెస్కు (రొమేనియా)పై విజయం సాధించగా.. వీనస్ 6-3, 3-6, 6-2తో కుజ్‌మోవా (స్లొవేకియా)ను ఓడించింది. ఆరో సీడ్ కెర్బర్ (జర్మనీ), ఏడో సీడ్ కొంటా (బ్రిటన్)లకు షాక్ తగిలింది. ఒసాకా (జపాన్) 6-3, 6-1తో కెర్బర్‌ను, కుర్నిచ్ (సెర్బియా) 4-6, 6-3, 6-4తో కొంటాను మట్టికరిపించారు. పురుషుల సింగిల్స్‌లో యువ సంచలనం అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) కష్టంగా రెండో రౌండ్లో అడుగుపెట్టాడు. నాలుగో సీడ్ జ్వెరెవ్ తొలి రౌండ్లో 7-6 (11-9), 7-5, 6-4తో కింగ్ (బార్బడోస్)పై విజయం సాధించాడు. ఐదో సీడ్ సిలిచ్ (క్రొయేషియా), ఎనిమిదో సీడ్ సోంగా (ఫ్రాన్స్), పదో సీడ్ ఇస్నర్ (అమెరికా) శుభారంభం చేశారు.



లంక సెలక్టర్ల రాజీనామా



కొలంబో: శ్రీలంక జట్టు సొంతగడ్డపై భారత్ చేతిలో టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురవడమే కాక.. వన్డే సిరీస్‌ను కూడా కోల్పోయిన నేపథ్యంలో సనత్ జయసూర్య నేతృత్వంలోని శ్రీలంక క్రికెట్ సెలక్షన్ కమిటీ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. జయసూర్యతో పాటు మదురసింఘె, కలువితరణ, గురుసిన్హా, ఉపశాంత ఈ కమిటీలో సభ్యులు. వీరి రాజీనామాల్ని శ్రీలంక బోర్డు ఆమోదించాల్సి ఉంది. భారత్‌తో సిరీస్‌కు ముందు జింబాబ్వే లాంటి చిన్న జట్టు చేతిలోనూ శ్రీలంక వన్డే సిరీస్ ఓడిపోయింది. ప్రస్తుత సిరీస్‌లో భారత్‌పై లంక ఇప్పటికీ ఒక్క విజయం కూడా నమోదు చేయలేదు.

కొరకరాని కొయ్య.. ఉత్తర కొరియా

ఉత్తర కొరియా యుద్ధభేరి మోగిస్తోంది. నిన్న మొన్నటి వరకూ ఆ దేశం జోరుగా క్షిపణి ప్రయోగాలు చేస్తుంటే.. అమెరికాతో బేరసారాల కోసమేనని అనుకున్నారు. అమెరికా హెచ్చరికలు జారీ చేస్తున్నా తీరు మార్చుకోలేదు. తాజాగా జపాన్ మీదుగా క్షిపణి ప్రయోగించి యుద్ధానికి సిద్ధమంటూ సవాలు విసిరింది. ఈ ప్రయోగం దక్షిణ కొరియా, జపాన్‌లను కూడా కలవరపరుస్తోంది. అటు అమెరికా అధ్యక్షుడి మీదా ఒత్తిడి పెరిగిపోతోంది. దీని పర్యవసానాలు ఎలా ఉంటాయనే ఆందోళన ఇప్పుడు ప్రపంచదేశాల్లో వ్యక్తమవుతోంది. ఒకవేళ ఉత్తర కొరియా తన మీద క్షిపణి ప్రయోగం చేస్తే బదులుగా అమెరికా తీవ్రంగా స్పందించక మానదు. దక్షిణ కొరియా, జపాన్ సైతం యుద్ధ క్షేత్రంలోకి అడుగు పెడతాయి. ఉత్తర కొరియా పనిపట్టేందుకు సిద్ధమవుతాయి. ఆ ప్రభావం ప్రపంచ దేశాలన్నింటిపైనా పడుతుంది

రెండో ప్రపంచయుద్ధంలో జపాన్ ఓటమి పాలై లొంగిపోవటంతో అప్పటి వరకూ ఆ దేశం ఆక్రమణలో ఉన్న కొరియా ఉత్తర భాగం రష్యా అజమాయిషీలోకి రాగా, దక్షిణ భాగాన్ని అమెరికా ఆక్రమించాయి. ఈ రెండింటినీ విలీనం చేసే యత్నాలు ఫలించలేదు. 1948 నుంచి ఉత్తర కొరియా, దక్షిణ కొరియా రెండు దేశాలుగా ఏర్పడ్డాయి. ఉత్తర కొరియా రష్యా ప్రభావంతో సోషలిస్టు రాజ్యంగా ఆవిర్భవించగా, దక్షిణ కొరియా అమెరికా ప్రభావంతో పెట్టుబడిదారీ వ్యవస్థను అనుసరించింది. వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా నాయకుడైన కిమ్ సంగ్ రష్యా మద్దతుతో ఉత్తర కొరియా అధ్యక్షుడయ్యాడు. 1994 వరకూ పాలించాడు. దక్షిణ కొరియా అమెరికా, జపాన్ నుంచి లభించిన పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానంతో శరవేగంగా అభివృద్ధి సాధించింది. అదే సమయంలో ఉత్తర కొరియా ప్రపంచదేశాలతో మమేకం కాలేక వెనుకబడిపోయింది. కిమ్ సంగ్ తర్వాత 1994 నుంచి 2012 వరకూ కిమ్ జాంగ్, ఆ తర్వాత ప్రస్తుత కిమ్ జాంగ్ ఉన్ అధ్యక్షులయ్యారు. కిమ్ జాంగ్ ఉన్ అధికారాన్ని చేపట్టిన నాటి నుంచి యుద్ధ కాంక్షను ప్రదర్శిస్తూ వచ్చాడు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి అంశాలు అతడి అజెండాలో లేవు. అదే సమయంలో సైన్యాన్ని బలోపేతం చేయడం, ఖండాంతర క్షిపణులను అభివృద్ధి చేయటంపైనే అతడి దృష్టి అంతా. అంతటితో ఆగకుండా అమెరికాను సవాలు చేస్తూ అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తున్నాడు.

ముప్పు ముంగిట్లో దక్షిణ కొరియా

దక్షిణ కొరియా రాజధాని సియోల్ నగరం ఉత్తరకొరియా సరిహద్దుకు ఎంతో దగ్గరగా ఉంది. ఆ దేశానికి చెందిన బహుళజాతి సంస్థలైన ఎల్‌జీ, శాంసంగ్, హ్యూండాయ్ ఇక్కడి నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఆ దేశ ఆర్థిక వ్యవస్థలో మూడోవంతు వాటా రాజధాని నగరానిదే. యుద్ధ మేఘాలు కమ్ముకుంటే ఉత్తర కొరియా సియోల్ మీద దాడికి దిగే అవకాశాలు ఉంటాయి. తత్ఫలితంగా దక్షిణ కొరియా ఆర్థిక వ్యవస్థ చితికిపోతుంది. అందుకే ఎట్టిపరిస్థితుల్లోనూ యుద్ధం వద్దనుకుంటోంది. కానీ పొరుగు దేశాన్ని ఎలా నిలువరించాలో తెలియని పరిస్థితి.



జపాన్ మళ్లీ సైనిక శక్తి అవుతుందా?

రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ అమేయమైన సైనిక శక్తి. కానీ ఆ యుద్ధంలో ఓడిపోవటం జపాన్ సైనిక స్వరూపాన్ని పూర్తిగా మార్చివేసింది. జపాన్ సైన్యంపై అమెరికా ఆంక్షలు అమలయ్యాయి. జపాన్ కూడా సైనికంగా ఎదగాలని అనుకోకుండా అభివృద్ధి బాటలో పయనించింది. ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ రంగాల్లో అద్భుత ప్రగతి సాధించింది. కాని తన రక్షణ అవసరాల కోసం అమెరికాపై ఆధారపడింది. ఇప్పుడు జపాన్ ఆలోచనల్లో మార్పు వస్తోంది. ఉత్తర కొరియా దూకుడు, చైనాతో విభేదాల కారణంగా తానూ బలమైన సైనిక శక్తి కావాలనుకుంటోంది. మళ్లీ సైన్యాన్ని బలోపేతం చేయాలనే ఆలోచనకు ప్రస్తుత జపాన్ ప్రధాని షింజో అబే సానుకూలంగా ఉన్నారు. జపాన్‌కు ఉన్న ఆర్థిక, సాంకేతిక సత్తాను పరిగణలోకి తీసుకుంటే బలమైన సైనిక శక్తిగా మారటం పెద్ద కష్టమేం కాదు. ఉత్తర కొరియా వ్యవహారం ముదిరిన పక్షంలో అదే జరుగుతుందని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

చైనా, రష్యా పాత్ర

చైనా తలుచుకుంటే ఉత్తర కొరియాను అదుపు చేయగలదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎంతో కాలంగా చెబుతున్నారు. కానీ దానికి చైనా నుంచి సానుకూల స్పందన కనిపించటం లేదు. ఇంతకాలం ఉత్తర కొరియాకు అన్నీ తానై వ్యవహరించటమే దీనికి కారణం. ఆ దేశ వాణిజ్యంలో చైనా వాటా 90 శాతం ఉంది. అన్ని రకాలైన వస్తువులను, ఆయుధాలను చైనా సరఫరా చేస్తోంది. తూర్పు ఆసియాలో అమెరికా ప్రభావం ఇంకా విస్తరించి తనదాకా రాకుండా ఉండాలంటే అడ్డుగా ఉత్తర కొరియా వంటి దేశం ఉండటం అవసరమని చైనా భావిస్తోంది. అందుకే ప్రస్తుత వివాదంలో గుంభనంగా వ్యవహరిస్తోంది. ఉత్తర కొరియాను సృష్టించటంలో అసలు పాత్ర రష్యాదే అయినా తర్వాత కాలంలో ఆ దేశ వ్యవహారాల్లో చైనా క్రియాశీలకంగా మారింది. అయినప్పటికీ చైనాకు ఉన్న భయాలే రష్యాకూ ఉన్నాయి. అందువల్ల ఈ రెండు దేశాలు ఉత్తర కొరియాను కట్టడి చేసేందుకు ప్రయత్నించటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రెండో అతిపెద్ద వర్తక భాగస్వామి భారత్!

ఉత్తర కొరియాతో మనదేశానికి బలమైన వర్తక బాంధవ్యం ఉందనే విషయం ఎక్కువమందికి తెలియదు. ఆ దేశంతో వర్తక భాగస్వామ్యం ఉన్న దేశాల్లో మొదటిది చైనా అయితే తర్వాత స్థానం మనదే. మనదేశం నుంచి మందులు, ప్రత్యేకమైన రసాయనాలు, ట్రక్కులు, దుస్తులు, పాలిస్టర్ నూలు, పెట్రోలియం ఉత్పత్తులు పెద్ద సంఖ్యలో ఎగుమతి అవుతున్నాయి. అయినప్పటికీ ఉత్తర కొరియా వ్యవహారశైలిని భారతదేశం సమర్థించటం లేదు. ప్రస్తుతానికి ఈ వివాదంలో తలదూర్చకుండా దూరంగా ఉండిపోయింది.

మరిన్ని ఆర్థిక ఆంక్షలు?

ఈనెల మొదటివారంలో ఉత్తర కొరియాపై ఐక్యరాజ్య సమితి భద్రతామండలి ఆర్థిక ఆంక్షలు విధించింది. దీని వల్ల ఆ దేశానికి తీవ్రమైన ఇబ్బందులు తప్పవు. బొగ్గు, ఇనుప ఖనిజం తదితర ముడిపదార్థాలు ఉత్తర కొరియా నుంచి చైనా కొనుగోలు చేస్తుంది. చైనా నుంచి అన్ని రకాలైన వస్తువులు ఉత్తర కొరియా దిగుమతి అవుతాయి. ఆంక్షల ఫలితంగా అవి నిలిచిపోయే అవకాశం ఏర్పడుతుంది. అయినా వెనక్కి తగ్గకపోగా ఇంకా దూకుడుగా ముందుకు సాగుతోంది ఆ దేశం. దీంతో మరికొన్ని ఆంక్షలు విధించాలని అమెరికా ఆలోచిస్తోంది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సమావేశంలో దీనిపై చర్చించనుంది.

– ఈనాడు ప్రత్యేక విభాగం

ఆయుధ సంపత్తి..



- 1976- 81 మధ్య కాలంలో ఉత్తర కొరియా క్షిపణి అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. 1984లో మొదటి స్కడ్- బి క్షిపణిని ప్రయోగించి చూసింది.
- రొడాంగ్ క్షిపణిని 1990లో ప్రయోగించింది. 1998లో వీటిని సైన్యంలోకి చేర్చుకుంది. రొడాంగ్ క్షిపణులకు 1300 కిలోమీటర్లలోని లక్ష్యాలను గురిపెట్టగల సత్తా ఉంది.
- అణు విస్తరణ ఒప్పందం నుంచి 2003లో బయటకు వచ్చింది. అప్పటి నుంచి అణ్వాయుధాలను సమకూర్చుకునేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. 2005 నాటికి తన వద్ద అణ్వాయుధాలు ఉన్నట్లు ప్రకటించింది.
- 2006లో మూడు రకాలైన క్షిపణులను ప్రయోగించింది. ఇందులో ఒకటైన తాపెడాంగ్-2 క్షిపణి సుదూర లక్ష్యాలను ఛేదించగలదు. తద్వారా అమెరికా నగరాలపై దాడి చేయగల శక్తిని సంపాదించుకున్నట్లయింది.
- అదే ఏడాదిలో అణు పరీక్షలు నిర్వహించింది. 2009లో మరోసారి క్షిపణి ప్రయోగాలు, అణు పరీక్షలు నిర్వహించింది.
- ప్రస్తుత అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ 2012లో అధికారంలోకి వచ్చాడు. అప్పటి నుంచి దూకుడు పెరిగింది. 2013లో మూడో అణు పరీక్షలను నిర్వహించింది. న్యూక్లియర్ రియాక్టర్‌ను ప్రారంభించింది.
- 2015 సెప్టెంబరులో అమెరికాపై అణు దాడికి సిద్ధంగా ఉన్నట్లు బెదిరించింది. ఆ మరుసటి ఏడాదిలో హైడ్రోజన్ బాంబును పరీక్షించింది. అయిదోసారి అణు పరీక్షలు నిర్వహించింది.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యశ్రేణి క్షిపణిని ప్రయోగించింది. దీన్ని జపాన్, అమెరికా తీవ్రంగా విమర్శించాయి. తర్వాత నెలలోనే 4 ఖండాంతర క్షిపణిలను ప్రయోగించగా అందులో 3 క్షిపణిలు జపాన్‌కు సమీపంలో కూలిపోయాయి.
- తాజాగా జపాన్ మీదగా క్షిపణిని ప్రయోగించింది. ఇది జపాన్‌లోని హొక్కాడై దీవి సమీపంలో సముద్రంలో పడింది. ఈ ఏడాది మొత్తం మీద ఉత్తర కొరియా 14 క్షిపణులను ప్రయోగించింది. దీంతో సమీపంలోని దక్షిణ కొరియా, జపాన్ దేశాలతో పాటు అమెరికా కలవర పాటుకు గురవుతున్నాయి.

రూ.1000 నోట్లను తీసుకురావట్లేదు: ఆర్థికశాఖ

దిల్లీ: రూ.1000 నోట్లను తిరిగి ప్రవేశపెట్టే యోచనలేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. చిల్లర సమస్యలను తొలగించేందుకు ఇటీవల కొత్తగా రూ.200 నోట్లను రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) చెలామణీలోకి తెచ్చిన సంగతి తెలిసిందే. అంతకుముందు కొత్త రూ.50 నోట్లను కూడా ఆర్‌బీఐ తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో మళ్లీ రూ.1000 నోట్లను కూడా ప్రభుత్వం ప్రవేశపెడుతుందని వదంతులు మొదలయ్యాయి. అయితే ఈ వార్తలను కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ కొట్టిపారేశారు.

రబ్రీదేవి, తేజస్వీలను విచారించిన ఐటీ విభాగం

పట్నా: బినామీ ఆస్తుల కేసులో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ సతీమణి రబ్రీ దేవి, కుమారుడు తేజస్వీ యాదవ్‌లను ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం మంగళవారం విచారించింది. రూ.1000 కోట్ల విలువైన లావాదేవీలకు సంబంధించిన ఈ కేసులో విచారించేందుకు ఐటీ అధికారుల బృందాలు దిల్లీ నుంచి బిహార్ రాజధాని పట్నాకు వెళ్లినట్లు వివరించాయి.

నీట్ కౌన్సెలింగ్ గడువు పొడిగించిన సుప్రీం

దిల్లీ: నీట్ పరీక్షల్లో అర్హత పొందిన విద్యార్థులకు సుప్రీంకోర్టు ఉపశమనం కలిగించింది. డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో 2017-18 సంవత్సరానికిగాను ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు తుదివిడత కౌన్సెలింగ్‌కు గడువును వచ్చేనెల 7దాకా పొడిగించింది. ఈ పొడిగింపు కేవలం డీమ్డ్ వర్సిటీలకే వర్తిస్తుందనీ, తదుపరి పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది. రాష్ట్రాల్లో నీట్ సీట్ల కోసం కౌన్సెలింగ్‌కు తుదిఘట్టమైన మాప్‌అప్ రౌండ్ కోసం నమోదు చేసుకున్న విద్యార్థులు, గత రెండు రౌండ్లలో ఏ కళాశాలలోనూ సీటు కేటాయింపు పొందని వారిని ఇందులో పరిగణనలోకి తీసుకుంటారు. జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచాలనీ, అన్ని డీమ్డ్ వర్సిటీలకు ఈమెయిల్ ద్వారా పంపాలని ధర్మాసనం ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్(డీజీహెచ్ఎస్)ను ఆదేశించింది.

నవకల్పనలో చైనా అధిగమించనున్న భారత్!

బీజింగ్: భారత నూతన ఆవిష్కరణల అభివృద్ధి రేటు మున్ముందు ఒక్కసారిగా పెరిగిపోనుంది. 2025-30 మధ్యకాలంలో ఈ విషయంలో చైనాను భారత్ అధిగమించి ముందుకు దూసుకువెళుతుంది. మంగళవారం నాడిక్కడ విడుదలైన 'బ్రిక్స్' నివేదిక ఈ విషయాన్ని పేర్కొంది. నవకల్పన విషయంలో 2016లో చైనా అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో రష్యా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, భారత్‌లు ఉన్నట్లు 'బ్రిక్స్' తాజా నివేదిక తెలిపింది.

రాష్ట్రపతిని కలిసిన ఉపరాష్ట్రపతి, కేంద్రమంత్రులు

దిల్లీ: ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్, మరికొందరు కేంద్ర మంత్రులు మంగళవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి కార్యదర్శి ట్విట్టర్‌లో తెలిపారు. వివాదాస్పద డోక్లామ్ నుంచి భారత్, చైనాలు తమ భద్రతా బలగాలను ఉపసంహరించుకున్న మరుసటి రోజే సుష్మాస్వరాజ్ రాష్ట్రపతిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రపతిని కలిసిన వారిలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక గజపతిరాజు, ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా, మహిళా, శిశుసంక్షేమాభివృద్ధి శాఖ మంత్రి మేనకా గాంధీ, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ఉన్నారు.



రాజ్యసభ సభ్యులుగా పార్లమెంట్‌హౌస్‌లో మంగళవారం ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులతో కలసి బృంద ఫొటో దిగిన ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ పి.జె.కురియన్, కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ

అవిభక్త కవలల తొలిదశ శస్త్రచికిత్స విజయవంతం

దిల్లీ: ఒడిశాకు చెందిన రెండేళ్ల వయసు అవిభక్త కవలల్ని వేరుచేసే తొలిదశ శస్త్రచికిత్స విజయవంతమైంది. ఎయిమ్స్‌లో 20 గంటలపాటు రక్తనాళాల్ని వేరుచేసేందుకు సిరల బైపాస్ శస్త్రచికిత్స చేపట్టారు. చిన్నారుల్ని పరిశీలనలో ఉంచామని వైద్యులు వెల్లడించారు. కవలల్ని వేరు చేసే శస్త్రచికిత్స అక్టోబర్ చివర్లో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 20 మంది ఎయిమ్స్ వైద్యులతోపాటు జపాన్‌కు చెందిన నిపుణులొకరు పాల్గొన్నారు. ఒడిశా కంధమాల్ జిల్లాకు చెందిన పుష్పాంజలి కన్హర, భుయియ కన్హర దంపతులకు కవలలు జగన్నాథ్, బలరాం తలలు అతుక్కొని ఉన్న అరుదైన స్థితిలో జన్మించారు. శస్త్రచికిత్సకు యాభై గంటల సమయం పడుతుందని వివరించారు. సర్జరీ కోసం సీఎం నవీన్ పట్నాయక్ రూ.కోటి మంజూరు చేశారు.

మహిళల్నీ రైతులుగా గుర్తించండి

దిల్లీ: మహిళల్నీ రైతులుగా గుర్తించి, భూమిపై చట్టపరమైన హక్కుల్ని కల్పించాలని వివిధ మహిళా రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే సంకల్పం ప్రభుత్వానికి నిజంగా ఉన్నట్లయితే మహిళా రైతు సంఘాలకు కూడా ఆర్థిక వనరులు, ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు కల్పించాలన్నాయి. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతు ప్రతినిధులు మంగళవారం దిల్లీలో పలు ప్రభుత్వ సంస్థలను కలిసి ఈ మేరకు విజ్ఞాపనలు సమర్పించారు.

హెచ్ఐవీ బాధితుల కోసం వివాహ వెబ్‌సైట్

అహ్మదాబాద్: హెచ్ఐవీ బాధితుల కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ వివాహ(మ్యాట్రిమోనియల్)వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేసింది. హెచ్ఐవీ బాధితులు అదే వ్యాధి ఉన్న జీవిత భాగస్వామిని వెతుక్కునేందుకు ఈ వెబ్‌సైట్ ఉపయోగపడనుంది.

ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌కు మూడో సంతానం



భార్య రిసోల్–జుతో కిమ్‌జోంగ్ ఉన్(పాతచిత్రం)

సియోల్: ఉత్తరకొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ భార్య రి సోల్-జు మూడో బిడ్డకు జన్మనిచ్చినట్లు దక్షిణ కొరియాకు చెందిన యాన్‌హాప్ వార్తాసంస్థ మంగళవారం వెల్లడించింది. ఫిబ్రవరిలో ఆడపిల్లకు జన్మనిచ్చినట్లు దక్షిణకొరియా నాయకులకు జాతీయ నిఘావర్గాలు తెలిపినట్లు కథనం రాసింది. వీరికి ఇంతకుముందే ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నీరూ.. చమురు కలపొచ్చు!

లండన్: నీటిలో చమురు చుక్కలు వేస్తే కలిసిపోకుండా.. విడిగా ఉండిపోతాయన్న సంగతి తెలిసిందే. అయితే.. నీటిని, చమురు కలవడం సాధ్యమేనని చెబుతున్నారు పరిశోధకులు. సాధారణంగా చమురు అణువులు నీటితో వికర్షించుకుంటాయి. రెండింటినీ అధిక పీడనం వద్ద ఒత్తిడికి గురిచేస్తే ద్రవపదార్థంలో కరిగిపోతాయని ఎడిన్‌బరో విశ్వవిద్యాలయ పరిశోధకులు పేర్కొన్నారు. నీరు, చమురు తరహాలో ఉండే మీథేన్ కలిపి ఉన్న చిన్న పాత్రని అత్యధిక పీడనానికి గురిచేయడం ద్వారా ఈ విషయాన్ని నిర్ధరించారు.

రెండు కేసుల్లో రామ్‌పాల్ బాబాకు విముక్తి

హిసార్: హరియాణాలోని సత్‌లోక్ ఆశ్రమ అధిపతి రామ్‌పాల్ బాబాకు.. రెండు క్రిమినల్ కేసుల నుంచి విముక్తి లభించింది. 2014లో నమోదైన ఈ కేసులకు సంబంధించి సాక్ష్యాధారాలు లేకపోవడంతో.. హిసార్‌లోని స్థానిక కోర్టు మంగళవారం ఈ మేరకు తీర్పును వెల్లడించింది. 2014లో ఓ కేసులో రామ్‌పాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలో.. 15వేలకుపైగా ఆయన అనుచరులు అరెస్టును అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వివిధ ఆరోపణలతో రామ్‌పాల్, ఆయన అనుచరులపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఊరట లభించినప్పటికీ.. మిగతా కేసుల్లో విచారణ కొనసాగుతున్నందున రామ్‌పాల్ జైల్లోనే ఉండనున్నారు.

జీఎస్టీ అపూర్వ సంస్కరణ

ఉదయ్‌పూర్(రాజస్థాన్): జీఎస్టీ ఒక అపూర్వ సంస్కరణ అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు. దేశంలో రాత్రికిరాత్రే పన్ను విధానాలను మార్చేసిందని పేర్కొన్నారు. మంగళవారం ఆయన రాజస్థాన్‌లో రూ.15 వేల కోట్ల విలువైన పలు హైవే ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖేల్‌గావ్‌లో నిర్వహించిన భారీ బహిరంగసభలో మాట్లాడుతూ.. జీఎస్టీ రవాణా వ్యయాల్ని తగ్గించిందనీ, ట్రక్కులు, ట్రాక్టర్ ట్రాలీ డ్రైవర్ల సంపాదనను పెంచిందన్నారు. భారత రవాణా రంగంలో పరివర్తనను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. చిన్న వ్యాపారుల్లో జీఎస్టీపై అవగాహన పెంచేందుకు 15 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను కోరారు. దీనివల్ల వారు ప్రయోజనం పొందుతారన్నారు. ఎన్నికల వేళ ప్రకటనలు చేయడం, భారీ హామీలు గుప్పించడం ఓ సంప్రదాయంలా మారిందనీ, ఏళ్లకొద్దీ కొనసాగిందన్నారు. తమ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల వేగాన్ని పరిధిని, స్థాయిని పెంచిందన్నారు. అభివృద్ధినే చేస్తామనీ, రాజకీయాల్ని కాదని వ్యాఖ్యానించారు. కోటలో 11 ఏళ్లుగా పూర్తికాని వంతెనను తమ ప్రభుత్వం సవాలుగా తీసుకుని పూర్తి చేసిందన్నారు.

మూడేళ్లలో 50 ఏళ్లకన్నా ఎక్కువ పనులు

మోదీ హయాంలో మూడేళ్లలో జరిగిన అభివృద్ధి పనులు.. గత 50 ఏళ్లలో జరిగినదానికన్నా ఎక్కువేనని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. గతంలో ప్రాజెక్టులు విధివిధానాల చట్రంలో ఇరుక్కుపోయేవనీ, మోదీ నేతృత్వంలోని భాజపా ప్రభుత్వం ఆ సంస్కృతికి చరమగీతం పాడిందన్నారు. నిలిచిపోయిన 57 ప్రాజెక్టుల్ని పూర్తిచేశామని వెల్లడించారు.

మోదీ చైనా పర్యటన ఖరారు

దిల్లీ: భారత ప్రధాని నరేంద్రమోదీ సెప్టెంబరు 3 నుంచీ 5వ తేదీ వరకూ చైనాలో పర్యటిస్తారు. డోక్లాం సెక్టారులో భారత్-చైనాల మధ్య కొనసాగిన ప్రతిష్ఠంభన సజావుగా సమసిన ఇరవై నాలుగు గంటల తర్వాత ప్రధాని చైనా పర్యటన ఖరారైంది. "చైనాలోని ఫుజియన్ ప్రావిన్స్‌లో ఉన్న జియామెన్‌లో జరిగే 'బ్రిక్స్' సదస్సుకు నరేంద్రమోదీ హాజరౌతారు. మూడురోజుల పాటు చైనాలో పర్యటిస్తారు' అని విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మోదీ చైనా నుంచి 5న బైలుదేరి మయన్మార్ వెళతారు.



ఉదయ్‌పూర్‌లో పలు పథకాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేసిన ప్రధాని మోదీ.. నిర్మించబోయే ప్రాజెక్టు నమూనాను నిశితంగా పరిశీలిస్తున్న దృశ్యం

స్పష్టతనివ్వని చైనా

- డోక్లామ్‌లో రహదారి నిర్మాణం నిలుపుదలపై డొంకతిరుగుడు జవాబులు

బీజింగ్: డోక్లామ్‌లో రహదారి నిర్మాణం నిలుపుదల గురించి చైనా ఇంకా స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. మూడు దేశాల కూడలి అయిన ఈ ప్రాంతంలో చైనా తలపెట్టిన రహదారి నిర్మాణ పనులను భారత సైన్యం అడ్డుకోవడంతో దాదాపు రెండున్నర నెలలు కొనసాగిన ప్రతిష్టంభన.. సోమవారంతో ముగిసిన సంగతి తెలిసిందే. భారత్, చైనా తమ తమ సైన్యాలను అక్కడి నుంచి ఉపసంహరించుకున్నాయి. రహదారి నిర్మాణ సామగ్రిని కూడా చైనా వెనక్కి తరలించుకుంది. అయితే నిర్మాణాన్ని ఆపివేసినట్లు మాత్రం ఆ దేశం నేరుగా ప్రకటించడం లేదు. డోక్లామ్ రహదారి నిర్మాణాన్ని కొనసాగిస్తారా అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి హువా చన్యింగ్‌ను ప్రశ్నించగా "వాతావరణంతో పాటు అన్ని అంశాలనూ పరిగణలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో పరిస్థితికి అనుగుణంగా నిర్మాణ ప్రణాళికను రూపొందిస్తాం" అని బదులిచ్చారు. ఇటు డోక్లామ్‌లో తమ సైనికులు గస్తీ కాస్తారని పునరుద్ఘాటించారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్ల పొడిగింపు ఉత్తర్వును కొట్టివేసిన దిల్లీ హైకోర్టు

దిల్లీ: పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రిజర్వేషన్లు కల్పించడాన్ని పొడగిస్తూ కేంద్ర ప్రభుత్వం గతంలో జారీ చేసిన ఉత్తర్వును దిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు 1997 ఆగస్టు 13న సిబ్బంది, శిక్షణ విభాగం (డీఓపీటీ) జారీ చేసిన మెమోను రద్దు చేస్తున్నట్లు జస్టిస్ గీతా మిత్తల్, జస్టిస్ సి.హరిశంకర్‌లతో కూడిన ధర్మాసనం ప్రకటించింది. 1992 నవంబరు 16న ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లను ఐదేళ్లపాటు కల్పించేందుకు సుప్రీం కోర్టు అనుమతినిచ్చింది. అనంతరం దీన్ని డీఓపీటీ మరింత పొడగించడాన్ని ఆల్ ఇండియా ఈక్వాలిటీ ఫోరం సహా కొందరు కోర్టుల్లో సవాలు చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సరైన ప్రాతినిధ్యం దక్కడం లేదని సూచించే గణనీయ సమాచార సేకరణేదీ చేపట్టకుండానే.. ప్రభుత్వం గుడ్డిగా రిజర్వేషన్లను పొడగిస్తూ వచ్చిందని కోర్టు వ్యాఖ్యానించింది.



లాఫ్టర్ యోగాతో గిన్నిస్ బుక్‌లోకి..

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్స్(కిస్) లాఫ్టర్ యోగాలో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. మంగళవారం కిస్ ప్రాంగణంలో 16,454 మంది విద్యార్థులు ఈ విన్యాసం చేసి గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించారు. గతంలో 1,100 మంది ఈ ఫీట్ చేసి నెలకొల్పిన రికార్డు దీంతో మరుగైపోయింది. గురు మదన్ కటారియా ఈ యోగాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో కిస్ వ్యవస్థాపకులు అచ్యుత సామంత తదితరులు పాల్గొన్నారు.

అమ్మను చంపి.. గుండెను తిన్న కుమారుడు

- కొల్హాపూర్‌లో దారుణం

పుణె: కన్నతల్లిని చంపిన కుమారుడు ఆమె గుండెను ప్లేట్లో పెట్టుకుని ఆరగించిన రాక్షస ఘటన కొల్హాపూర్(మహారాష్ట్ర)లో సోమవారం జరిగింది. సునీల్ కుష్‌కర్ణి అనే ఓ భవన నిర్మాణ కూలీ(27) పాల్పడిన దారుణ కృత్యాన్ని వివరించడానికి ఏ భాషలోనూ మాటలు చాలవనిపించే కిరాతక ఘటన ఇది.

బాధ్యతలేకుండా తిరిగే సునీల్ సోమవారం తప్పతాగి ఆకలితో నకనకలాడిపోతూ ఇంటికొచ్చాడు. ముందుగా పక్కింటికెళ్లి తలుపు తట్టి బాగా ఆకలిగా ఉందనీ...తింటానికి ఏమైనా పెట్టమని వారిని అడిగాడు. వారు లేదనడంతో తన ఇంటికొచ్చాడు. అమ్మతో అన్నం కోసం గొడవపడ్డాడు. తాగిన మైకం... విపరీతమైన ఆకలి అతడిని రాక్షసుడిని చేసింది. కోపంగా తల్లిపైకి లంఘించి ఆమె గొంతునొక్కేసి పక్కనే ఉన్న కత్తితో దారుణంగా పొడిచి చంపేశాడు. వెంటనే తల్లి ఛాతీ భాగాన్ని చీల్చి ఆమె గుండెను వెలికి తీసి ఒక ప్లేటులో పెట్టుకున్నాడు. పక్కనే ఉన్న జాడీలో నుంచి పచ్చడి తీసి వేసుకున్నాడు. అక్కడే కనపడిన పెప్పర్‌స్ప్రేను కూడా ఆ దుర్మార్గుడు తల్లి గుండెమీద చల్లుకుని, పచ్చడితో నంజుకుని ఆరగించాడు. తర్వాత రక్తమోడుతున్న చేతులతో అలాగే నడుచుకుంటూ వీధిలోకి వెళ్లాడు. విషయం తెలిసిన పోలీసులు సునీల్‌ను అరెస్టు చేశారు. అతడు తల్లి గుండెను కొంతభాగం మాత్రమే తిని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

'డొల్ల' ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు ఇవ్వాలి

- పీపీపీ విధానంలో నడపాలి
- నీతి ఆయోగ్ సూచన

దిల్లీ: పనితీరు సరిగాలేని, డొల్ల ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య నమూనా కింద ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని నీతి ఆయోగ్ సూచించింది. ఈ సంస్థ ఇటీవల విడుదల చేసిన మూడేళ్ల కార్యాచరణ ఎజెండాలో ఈ సూచన చేసింది. ఈ ప్రతిపాదన ప్రకారం.. ప్రైవేటు రంగం ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుంటాయి. అదే సమయంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం నిధులు అందిస్తుంది. కార్యాచరణ ఎజెండాలోని ముఖ్యాంశాలివీ..

- కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల సంఖ్య పెరిగినప్పటికీ వాటిలో విద్యార్థుల చేరిక గణనీయంగా పడిపోతోంది. అదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో చేరికలు బాగా పెరిగాయి. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు డొల్లగా మారిపోయాయి.
- 2010-14లో ప్రభుత్వ పాఠశాలలు 13,500 మేర పెరగ్గా.. విద్యార్థుల చేరిక 1.13 కోట్ల మేర పడిపోయింది. ప్రైవేటు పాఠశాలల్లో చేరికల సంఖ్య 1.85 కోట్ల మేర పెరిగింది.
- 2014-15లో యాభై మంది కన్నా తక్కువ విద్యార్థుల సంఖ్యను కలిగిన ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 3.7 లక్షల మేర ఉంది. మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో ఇవి 36 శాతంగా ఉండటం గమనార్హం.
- ఉపాధ్యాయుల గైర్హాజరు పెరగడం, బోధనకు పరిమిత సమయాన్ని వెచ్చించడం, విద్యలో నాణ్యత లోపించడం వంటి కారణాల వల్ల ఈ పరిస్థితి తలెత్తుతోంది.
- ప్రైవేటు పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ బడుల్లో ఫలితాలు చాలా దారుణంగా ఉంటున్నాయి.
- ఆసక్తి ఉన్న రాష్ట్రాల్లో చేపట్టిన సాహసోపేత ప్రయోగాలను పరిశీలించడానికి రాష్ట్రాల భాగస్వామ్యంతో ఒక కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయాలి.
- డొల్లగా మారిపోయి, ఆర్థికం భారంగా మారిన సర్కారీ బడులను పీపీపీ విధానంలో నడిపితే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2015-17 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00